ప్రభాతనవ

SINGIDI | తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం  singidinews.com

శనివారం 22 ఆగస్టు 2026 | సంపుటి: 1  సంచిక: 66  పేజీలు 12  వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## ఎకరం రూ.264 కోట్లు

### రాయదుర్గంలో ఆల్ టైమ్ రికార్డు ధర




హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సరికొత్త రికార్డు నమోదైంది. రాయదుర్గంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ నిర్వహించిన వేలంలో ఎకరా భూమి ఏకంగా రూ. 264 కోట్లు పలికింది.

**హైదరాబాద్, ఆగస్టు 21 (సింగిడి):** 2



## షావుకారు జానకి కన్నుమూత

2

## తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు

### హైకోర్టులో ముగిసిన వాదనలు

### 16న తీర్పు వెలవరించనున్న హైకోర్టు



**హైదరాబాద్, ఆగస్టు 21 (సింగిడి):**
తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిష న్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుప క్షాల వాదనలు ముగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. 2

## సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట



### రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలంపై జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ

తెలంగాణలోని రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలం ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వేలాన్ని నిలిపివే యాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

**- హైదరాబాద్, ఆగస్టు 21 (సింగిడి)** 2



## రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన రద్దు

### అనుమతివ్వని కేంద్రం

- ఈ నెల 23న లండన్ నుంచి హైదరాబాద్ చేరుకోనున్న సీఎం
- వచ్చే నెలలో అమెరికా వెళ్లే యోచన
- అమెరికా భేటీలకు అధికారులను పంపే అవకాశం
- 'తెలంగాణ రైజింగ్' ఆగదని సీఎం స్పష్టీకరణ

2

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన రద్దయింది. కేంద్ర విదేశాంగశాఖ అనుమతి నిరాకరించడంతో పర్యటన రద్దు చేసుకున్నట్టు సమాచారం. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి లండన్ పర్యటనలో ఉన్నారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం.. ఈనెల 23న లండన్ నుంచి అమెరికా వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో లండన్ నుంచే హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు.

**హైదరాబాద్, ఆగస్టు 21 (సింగిడి)**

## రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

- అందుకే రేవంత్ పర్యటనకు అనుమతి నిరాకరణ
- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరణ

2



ప్రజల కోసం ప్రజా ప్రభుత్వం.. విద్యార్థుల కోసం విద్యా ప్రభుత్వం.. అంటూ సీఎం రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్న ఉద్దేశంతోనే విద్యాశాఖను తన దగ్గరే ఉంచుకున్నానని కూడా ఆయన వ్యాఖ్యానించారు. కానీ.. ఇప్పుడు పాలిటెక్నిక్ విద్యార్థులు రోడ్లపైకి వచ్చారు. తమ చదువు, భవిష్యత్తుపై ప్రభావం చూపే జీవో 97ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు చేస్తోంది. ఇంతకీ జీవో 97లో ఏముంది?.. పాలిటెక్నిక్ విద్యార్థులకు అది ఎందుకు ఇబ్బందిగా మారింది? వారి డిమాండ్లు ఏంటి? సర్కార్ స్పందన ఎలా ఉంది? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**- హైదరాబాద్ బ్యూరో (సింగిడి)**



## జీవో 97తో క్యా హువా?

### రోడ్లపైకి పాలిటెక్నిక్ విద్యార్థులు

**అసలు జీవో 97 అంటే ఏంటి?**

- పాలిటెక్నిక్ విద్యార్థులకు ఈ ఉత్తర్వుతో సంబంధమేంటి?
- ఆందోళనకు కారణమేంటి?
- ప్రభుత్వం ఏం చెబుతోంది..
- ప్రతిపక్షం ఏం అంటోంది?
- జీవో 97పై అసలు వివాదమేంటి?

**అసలు జీవో 97 అంటే ఏంటి?**

జీవో 97 అనేది తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థకు సంబంధించిన కీలక మార్పులను ప్రతిపాదించే ప్రభుత్వ ఉత్తర్వు. ఇందులో డిప్లొమా కోర్సుల నిర్మాణం, బోధనా విధానం, విద్యా ప్రమాణాలు, తదుపరి అవకాశాలకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. ఈ మార్పులు తమ చదువు, భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయన్న ఆందోళనతోనే విద్యార్థులు నిరసనలకు దిగుతున్నారు.

**విద్యార్థుల రోడ్డెక్కడం వెనుక..**

పాలిటెక్నిక్ చదువుతున్న వేలాది మంది జీవో 97పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళన బాట పట్టారు. తమ విద్యా అవకాశాలు, ఉద్యోగ భవిష్యత్తుపై అనిశ్చితి ఏర్పడకూడదన్నది వారి ప్రధాన డిమాండ్‌గా కనిపిస్తోంది. నిర్ణయం తీసుకునే ముందు తమతో చర్చించాలని వారు కోరుతున్నారు.

**బీఆర్ఎస్‌కు రాజకీయ అస్త్రం**

విద్యార్థుల ఆందోళనను బీఆర్ఎస్ రాజకీయంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందన్న విమర్శలు అధికార పక్షం నుంచి వస్తున్నాయి. మరోవైపు సమస్యపై సర్కార్ స్పందించేలా ఒత్తిడి తీసుకురావడమే తమ ఉద్దేశమని ప్రతిపక్షం చెబుతోంది. దీంతో ఈ అంశం చుట్టూ రాజకీయ వేడి కూడా పెరుగుతోంది.

**ప్రభుత్వం ముందున్న పరీక్ష**

విద్యకు సంబంధించిన అంశం కావడంతో జీవో 97పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల అభ్యంతరాల్లో వాస్తవం ఎంత? ఉత్తర్వు అమలైతే ఎలాంటి మార్పులు వస్తాయి? సర్కార్ వివరణ ఏంటి? అన్నదే ఇప్పుడు కీలకంగా మారింది.

**చదువు కోసం రోడ్డెక్కాల్సిందేనా?**

విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉందని చెబుతున్న సమయంలో.. తమ సమస్యల పరిష్కారం కోసం పాలిటెక్నిక్ విద్యార్థులు రోడ్లపైకి రావడం చర్చకు దారితీస్తోంది. రాజకీయ పార్టీలు ఎవరికి వారు లెక్కలు చూసుకున్నా.. విద్యార్థులకు మాత్రం ఒక్కటే ముఖ్యం — చదువుకు భరోసా.. భవిష్యత్తుకు స్పష్టత. జీవో 97 వివాదానికి సర్కార్ ఇచ్చే పరిష్కారమే ఇప్పుడు కీలకం.

## పెల్లెట్ గన్ బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్

- ఎఫ్ఐఆర్ కోసం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం ముందు ధర్నా
- జులై 20 నిరసనల్లో పెల్లెట్లు తగిలాయని యువకుడి ఆరోపణ
- పెల్లెట్ గన్స్ వాడలేదని ఢిల్లీ పోలీసుల వాదన

2

పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్-జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు.

**న్యూఢిల్లీ, ఆగస్టు 21 (సింగిడి)**



## కాంగ్రెస్‌లో సవతుల పోరు

- బీఆర్ఎస్ మళ్లీ పుంజుకుంటోంది: సీపీఐ నారాయణ
- కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు తీవ్రమవుతున్నాయన్న నారాయణ
- సీఎం తప్పులు చేయకుండా ఉంటేనే మంత్రుల్లో భయం ఉంటుందని వ్యాఖ్య
- కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందన్న సీపీఐ నేత

2

## 'మా ఊళ్లోకి రావొద్దు'


### రాజస్థాన్‌లో స్కూల్ తనిఖీకి వెళ్లిన కాక్రోచ్ పార్టీ కార్యకర్తలపై గ్రామస్థుల దాడి!

2



- రాంపురా-కన్వర్‌పురా గ్రామంలో ఉద్రిక్తత
- వాహనాలు, మొబైల్ ఫోన్లు ధ్వంసమైనట్లు సీజేపీ ఆరోపణ
- మహిళా కార్యకర్తలపై కూడా దాడి జరిగిందని వెల్లడి
- ఓ కార్యకర్త చేయి విరిగిందని అశుతోష్ రంకా ఆరోపణ
- నిందితులను అరెస్ట్ చేయాలని సీజేపీ డిమాండ్

రాజస్థాన్‌లో ప్రభుత్వ పాఠశాల పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలపై గ్రామస్థులు దాడి చేశారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. **–న్యూఢిల్లీ (సింగిడి)**



## కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

- కొండా సురేఖపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆగ్రహం
- 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీల భేటీ
- సుస్మిత వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ
- వ్యాఖ్యలను సురేఖ ఖండించకపోవడంపై అభ్యంతరం

2

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. ఈ అంశంపై ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాలకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీలు సీఎల్పీ వేదికగా సమావేశమై చర్చించారు. అనంతరం కొండా సురేఖను రాష్ట్ర మంత్రివర్గం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేసినట్లు సమాచారం.

**- హైదరాబాద్, ఆగస్టు 21 (సింగిడి)**

## నా టార్గెట్ రేవంత్ రెడ్డి

### కాంగ్రెస్ పార్టీ కాదు: కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు

- సోనియా, రాహుల్, ప్రియాంకపై గౌరవం ఉందన్న సుస్మిత
- రేవంత్, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోందని ఆరోపణ
- 'టికెట్ నిర్ణయించడానికి సీఎం ఎవరు?' అని ప్రశ్న
- స్వతంత్రంగా పోటీ చేసేందుకు సిద్ధమని ప్రకటన
- పరకాల నుంచి పోటీ చేయడం ఖాయమని వెల్లడి

2



మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కుమార్తె వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సురేఖ పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో కొండా సుస్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కేవలం సీఎం రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని ఆ వ్యాఖ్యలు చేశానని స్పష్టం చేశారు.

**- హైదరాబాద్, ఆగస్టు 21 (సింగిడి)**

## సీఎం వచ్చాక మాట్లాడతా

### చెప్పాల్సింది కమిటీకి చెప్పా.. కొండా సురేఖ



కాంగ్రెస్ షోకాజ్ నోటీసుల అంశంలో తాను చెప్పాల్సింది క్రమశిక్షణ కమిటీకి చెప్పానని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ విషయంపై ఇప్పుడు మీడియాతో మాట్లాడబోనని చెప్పారు.

**- హైదరాబాద్, ఆగస్టు 21 (సింగిడి)**

## ఎమ్మెల్యేలకు ఫ్రీగా కార్లు

### ఇస్తామన్న సీఎం విజయ్.. వద్దన్న ఉదయనిధి స్టాలిన్

- తమిళనాడులో ఎమ్మెల్యేలందరికీ ఉచిత కార్లు ఇస్తామన్న సీఎం విజయ్
- డ్రైవర్, ఇంధనం కోసం నెలకు రూ. 75,000 అలవెన్స్ ప్రకటన
- ప్రభుత్వ ఆఫర్‌ను తిరస్కరించిన ప్రతిపక్ష డీఎంకే
- రాష్ట్ర అప్పులను గుర్తుచేస్తూ.. కార్లు వద్దని తెలిపిన ఉదయనిధి స్టాలిన్
- సొంతంగా కారు లేని వారికే ఈ పథకమన్న ప్రభుత్వం

2



ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం 22 ఆగస్టు 2026

# రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన రద్దు



ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలకు సంబంధించి ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం.. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. సీఎం రేవంత్‌రెడ్డి యూకే, యూఎస్ పర్యటనకు చాలా రోజుల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. అయితే, యూకే పర్యటనకు మాత్రమే విదేశాంగశాఖ అనుమతించింది. అమెరికా పర్యటనకు అనుమతివ్వలేదు.

**దిగ్భ్రాంతికి గురిచేసింది: సీఎం రేవంత్‌రెడ్డి**

యూఎస్ పర్యటనకు కేంద్రం అనుమతించకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. తన పర్యటనకు రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించారని పేర్కొన్నారు. రాజకీయ కోణంలో పర్యటనను అడ్డుకోవడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. "కేంద్ర నూతన విద్యా విధానాన్ని అమలు చేయటమే నా లక్ష్యం. తెలంగాణకు అత్యుత్తమ విద్యాసంస్థలు తీసుకురావడమే నా లక్ష్యం. ప్రపంచస్థాయి సంస్థలను తీసుకురావటమే పర్యటన ఏకైక ఉద్దేశం. నా విదేశీ పర్యటన వికసిత్ భారత్‌కు దోహదపడుతుందని భావించా. దేశ నిర్మాణం కోసం రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని నమ్ముతాను" అని సీఎం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరో వైపు.. అమెరికా పర్యటన కొనసాగించాలని అధికారుల బృందానికి సీఎం ఆదేశించారు. అన్ని ఎంవోయూలు యథాతథంగా చేసుకోవాలని, వర్సిటీలతో భాగస్వామ్య ఒప్పందాలను ఖరారు చేసుకోవాలని అధికారులకు సూచించారు.

**లండన్ పర్యటనలో సీఎం..**

రెండ్రోజుల క్రితం ఢిల్లీలో సీడబ్ల్యూసీ సమావేశానికి వెళ్లిన ముఖ్యమంత్రి .. అక్కడి నుంచి నేరుగా లండన్ చేరుకున్నారు. ఇవాళ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నెన్స్‌ను ఆయన సందర్శిస్తారు. సాయంత్రం ఎమిరేట్స్ స్టేడియంలో జరిగే ఈపీఎల్ ఫుట్‌బాల్ ప్రజంటేషన్ కార్యక్రమానికి హాజరవుతారు. 22న కేంబ్రిడ్జ్ బృందంతో సమావేశం కానున్నారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్‌లోని సెనేట్ హౌస్‌ను, సాయంత్రం లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శిస్తారు. ఆగస్టు 23న సీఎం లండన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు బయలుదేరతారు

## రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

### అందుకే సిఎం రేవంత్ పర్యటనకు అనుమతి నిరాకరణ

**విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరణ**

**న్యూఢిల్లీ,ఆగస్ట్21 ఆగస్టు 21 (సింగిడి)**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. దీనిపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. శుక్రవారం న్యూఢిల్లీలో ఆ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి బ్రిటన్ పర్యటనకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే సీఎంలు, ఇతర ప్రముఖుల పర్యటనలను.. రాజకీయ క్లియరెన్స్ కోసం అంచనా వేస్తామని ఆయన వివరించారు. ప్రతిపాదిత కార్యక్రమం పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండాలని ఈ సందర్భంగా జైస్వాల్ స్పష్టం చేశారు. అమెరికా పర్యటన అంశంలో అలా లేదన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి యూఎస్ పర్యటనకు క్లియరెన్స్ నిరాకరించామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. 10 రోజుల విదేశీ పర్యటన కోసం సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కోసం న్యూఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం అర్ధరాత్రి తర్వాత అక్కడి నుంచి బయలుదేరి విదేశాలకు వెళ్లారు. ముందుగా అనుకున్న ప్రకారం.. ఆగస్టు 30వ తేదీ వరకు బ్రిటన్, అమెరికాల్లో సీఎం బృందం పర్యటించ నుంది. ఈ రెండు దేశాల్లోని వివిధ యూనివర్సిటీలను సందర్శించి తెలంగాణలో ఉన్నత విద్య, క్రీడల అభివృద్ధిపై ఈ బృందం చర్చించనుంది. అలాగే లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం బృందం సందర్శించనుంది. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో పాల్గొనుంది. అనంతరం యూఎస్‌కు సీఎం బృందం బయలుదేరి వెళ్లాల్సి ఉంది. కానీ సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వ లేదు. దాంతో ఆయన లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. అయితే యూఎస్ పర్యటనకు వెళ్లాలని అధికారుల బృందాన్ని సీఎం రేవంత్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

## నా టార్గెట్ రేవంత్ రెడ్డి



"సీఎం రేవంత్ రెడ్డి పరకాల వచ్చి రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఎమ్మెల్యే సీటు ఇస్తున్నట్లు ప్రకటించారు. నేను రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేశాను. పార్టీని కాదు. నాకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మీనాక్షి నటరాజన్‌పై చాలా గౌరవం ఉంది. కానీ, రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోంది. అందుకే వారిని టార్గెట్ చేసుకున్నాను. పైగా ఎమ్మెల్యే టికెట్ ఎవరికివ్వాలో నిర్ణయించడానికి ఆయన ఎవరు? సీడబ్ల్యూసీ సమావేశాల వంటి వ్యవస్థ ఉంది కదా. ఆ ప్రకారంగానే అభ్యర్థులను ప్రకటిస్తారు. నేను అదే ప్రశ్నించాను. నేను స్వతంత్రగా పోటీ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాను" అని కొండా సుస్మిత ఓ జాతీయ మీడియా ఛానెల్‌తో మాట్లాడుతూ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయమంటూ గీసుకొండలో బుధవారం నాడు సుస్మిత అన్న విషయం తెలిసిందే. ఇటీవల పరకాల బహిరంగ సభలో 'వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలి' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ అలా ఏకపక్షంగా ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. సీఎం సోదరుడు పెట్టిన డొల్ల కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమిని కట్టబెట్టారని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడనని.. తన వ్యాఖ్యలపై కౌంటర్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తే సీఎం కుటుంబం అవినీతిని ఒక్కొక్కటిగా బయటపెడతానన్నారు.

### కొండా సురేఖను మంత్రి పదవి నుంచి

## బర్తరఫ్ చేయాలి

సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను టార్గెట్ చేస్తూ కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఆమె వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కూడా సురేఖకు వ్యతిరేకంగా గళం విప్పారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యేలు మీడియా సమావేశంలో మాట్లాడారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను కొండా సురేఖ ఇప్పటివరకు ఖండించకపోవడాన్ని ఎమ్మెల్యేలు తీవ్రంగా తప్పుబట్టారు. మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలపై బాధ్యత వహించాల్సిందేనని అభిప్రాయపడ్డారు. సీఎంను వ్యతిరేకించే వారికి పార్టీలో ఉండే అర్హత లేదని స్పష్టం చేశారు. మీ భాష ఎప్పుడూ పార్టీకి నష్టం కలిగించేలా ఉందని కొండా ఫ్యామిలీని ఉద్దేశించి అన్నారు. సుస్మిత వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ చెప్పడంపైనా ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇచ్చిన వివరణ తమకు ఆమోదయోగ్యంగా లేదని తేల్చారు. సీఎం రేవంత్ ఎంతో కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు. అలాంటి వ్యక్తిని విమర్శించినప్పుడు ఖండించడం కనీస బాధ్యత అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చాలనే ప్రతిపక్షాల కుట్రలకు బలం చేకూర్చుతున్నారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధిష్ఠానాన్ని కోరారు.

### సీఎం వచ్చాక మాట్లాడతా

"నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ కమిటీకి చెప్పా. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను"అని కొండా సురేఖ అన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మంత్రికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌కు వివరణ పంపారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయొద్దని అందులో కోరారు. మరోవైపు కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కుమార్తె చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## ప్రయాణికులకు ఆర్టీసీ ఆఫర్

### రిటర్న్ టిక్కెట్ బుకింగ్‌పై పదిశాతం రాయితీ

**హైదరాబాద్,ఆగస్ట్21 (సింగిడి):**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు ఆర్థిక భారాన్ని తగ్గించడంతో పాటు ముందస్తు రిజర్వేషన్‌ను ప్రోత్సహించేందుకు ఒక ప్రత్యేకమైన ఆఫర్‌ను అందుబాటు లోకి తెచ్చింది. ప్రయాణికులు తమ రాకపోకల టికెట్లను ఒకేసారి బుక చేసుకోవడం ద్వారా తిరుగు ప్రయాణం టికెట్‌పై 10 శాతం తగ్గింపును పొందవచ్చు. దూరప్రాంతాలకు ప్రయాణించే వారికి, అలాగే వారాంతాల్లో కుటుంబంతో కలిసే వెళ్లేవారికి ఈ ఆఫర్ ఎంతో ప్రయోజనకరంగా మారింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు , ప్రయాణికులను ఆకట్టుకునేందుకు సంస్థ ఈ ప్రత్యేక పథకాన్ని డిజైన్ చేసింది. ఈ ఆఫర్‌ను పొందడానికి ప్రయాణికులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా మొబైల్ యాప్ ఉపయోగించి ముందస్తుగా టికెట్లు బుక చేసుకోవలసి ఉంటుంది. వెళ్లేందుకు, తిరిగి రావడానికి ఒకేసారి టికెట్లను రిజర్వ్ చేసినపడు మాత్రమే వర్తించే ఈ ఆఫర్ ద్వారా ప్రయాణికులు తమ ప్రయాణ ఖర్చులపై మంచి ఆదా చేసుకోవచ్చు. ప్రయాణ తేదీలను ముందుగానే చేసుకునే వారికి సీట్ల లభ్యత సమస్య లేకుండా, తక్కువ ధరలోనే టికెట్ దొరికే సౌకర్యం కలగడమే కాకుండా గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకునే వీలు కలుగుతుంది. టికెట్ల బుకింగ్‌కు సంబంధించిన సందేహాల నివారణకు లేదా సమాచారం కోసం సంస్థ హెల్ప్‌లైన్ నంబర్లు 040-69440000, 040-23450033 లను కూడా అందుబాటులో ఉంచింది. ప్రైవేట్ వాహన ప్రయాణాల కన్నా భద్రత, సౌకర్యం అధికంగా ఉండేఆర్టీసీ బస్సుల సేవలను వినియోగించుకోవాలని సంస్థ కోరుతోంది. రాబోయే పండుగలు, సెలవుల సీజన్‌లో ప్రయాణించే వారు చివరి నిమిషంలో ఇబ్బందులు పడకుండా ఈ ముందస్తు బుకింగ్ 10 శాతం డిస్కౌంట్ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవచ్చు.

## సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట

తెలంగాణలోని రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలం ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వేలాన్ని నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) రాయదుర్గం పాన్ మక్తాలోని సుమారు 11 ఎకరాల భూమిని వేలం వేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎకరాకు కనీస ధరను రూ.175 కోట్లుగా నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ జువ్వాడి ప్రణయ సింహారావు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపిస్తూ, గతంలో కంచ గచ్చిబౌలిలోని భూముల వేలాన్ని సుప్రీంకోర్టు నిలిపివేసిందని, ప్రస్తుతం ప్రభుత్వం అవే రక్షిత భూములను వేలం వేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

అయితే, తెలంగాణ ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన వాదించారు. ప్రస్తుతం వేలానికి ఉంచిన రాయదుర్గం భూములకు, గతంలో స్టే ఇచ్చిన కంచ గచ్చిబౌలి భూములకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ రెండు ప్రాంతాల మధ్య దాదాపు 5 కిలోమీటర్ల దూరం ఉందన్న విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో రాయదుర్గం భూముల వేలం ప్రక్రియకు మార్గం సుగమమైంది.

## తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు



పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆయా ఎమ్మెల్యేలు ప్రచారం చేసిన వీడియోలను న్యాయస్థానానికి సమర్పించారు. అభివృద్ధి కోసం మాత్రమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంటున్నారని బీఆర్ఎస్ తరపు న్యాయవాది గండ్ర మోహన్ రావు కోర్టుకు తెలియజేశారు. ఏఐసీసీ అధికారిక కార్యక్రమాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలు పాల్గొన్నారని, వీరి వీడియోలు ఆంధ్రజ్యోతిలో ప్రసారం అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ కండువా కపకుని.. జాతీయ జెండాగా చెబుతున్నారని, జాతీయ జెండాలో అశోక చక్రం ఉంటుందని గండ్ర మోహన్ రావు.. కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే దానం నాగేందర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికై, ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేశారని కోర్టుకు వివరించారు. పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. ప్రధాన పత్రికలు, టీవీ ఛానళ్లలో ప్రసారమైన వార్తా కథనాలు, వీడియోలను కూడా బీఆర్ఎస్ తరపు న్యాయవాది గండ్ర మోహన్ రావు న్యాయస్థానం ముందు ఉంచారు. ఇరు పక్షాల వాదనలు పూర్తవడంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు హైకోర్టు పేర్కొంది.



## 'మా ఊళ్లోకి రావొద్దు'

ఈ ఘటనపై సీజేపీ కో-కన్వీనర్ అశుతోష్ రంకా తీవ్రంగా స్పందించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయడంతో పాటు విద్యాశాఖ మంత్రి మదన్ దిలావర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి 48 గంటల గడువు విధించారు. సంగనేర్‌లోని రాంపురా-కన్వర్‌పురా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పరిస్థితిని పరిశీలించేందుకు సీజేపీ బృందం వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు రంకా తెలిపారు. ఆ పాఠశాల కొన్నేళ్లుగా గేదెల కొట్టంలో కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. గతేడాది కూడా తమ బృందం అక్కడికి వెళ్లిందని, పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించలేదని చెప్పారు. తమ బృందం అక్కడికి చేరుకునేలోపే కొంతమంది బీజేపీతో సంబంధం ఉన్న వ్యక్తులు అక్కడ ఉన్నారని, అనంతరం ఒక్కసారిగా దాడి జరిగిందని రంకా ఆరోపించారు. తమ వాహనాల అద్దాలు పగలగొట్టారని, మొబైల్ ఫోన్లు ధ్వంసం చేశారని, మహిళా కార్యకర్తపై దాడి చేశారని చెప్పారు. తన చొక్కా కూడా చించివేశారని పేర్కొన్నారు. ఓ కార్యకర్త చేయి విరిగిందని, తమపై రాళ్ల దాడి కూడా జరిగిందని ఆరోపించారు. పోలీసులకు ముందే సమాచారం ఇచ్చినా వారు ప్రేక్షక పాత్ర పోషించారని రంకా ఆరోపించారు. మహిళా కార్యకర్తలపై కూడా రాళ్లు విసిరి, వారి ఫోన్లు ధ్వంసం చేశారని చెప్పారు. ఈ దాడి ముందస్తు ప్రణాళికతోనే జరిగిందని ఆయన ఆరోపించారు. పాఠశాల తనిఖీలపై విధించిన ఆంక్షలను కూడా వెంటనే ఉపసంహరించుకోవాలని రంకా డిమాండ్ చేశారు. 48 గంటల్లో నిందితులపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈసారి పోరాటం కేవలం పాఠశాలల సమస్యలకే పరిమితం కాదని, మంత్రి మదన్ దిలావర్ రాజీనామాను కూడా డిమాండ్ చేస్తామని స్పష్టం చేశారు. కాగా, సీజేపీ బృందం పాఠశాల ప్రాంగణంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో స్థానిక గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్తత పెరిగింది. ఘటనకు సంబంధించి నిందితుల వివరాలు, పోలీసుల తదుపరి చర్యలపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## ఎమ్మెల్యేలకు ఫ్రీగా కార్లు

**చెన్నై, ఆగస్టు 21 (సింగిడి)**

తమిళనాడులో అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే మధ్య వాహనాల కేటాయింపు వ్యవహారం రాజకీయ దుమారానికి దారితీసింది. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరికీ ప్రభుత్వ ఖర్చుతో కార్లు అందజేస్తామని ముఖ్యమంత్రి విజయ్ చేసిన ప్రకటనను డీఎంకే తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ ప్రతిపాదనను తమ పార్టీ తిరస్కరిస్తున్నట్లు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని 234 మంది ఎమ్మెల్యేలకు నియోజకవర్గ పనుల నిమిత్తం ప్రభుత్వ వాహనాలు సమకూర్చుతామని ప్రకటించారు. వీటితో పాటు డ్రైవర్, ఇంధనం, నిర్వహణ ఖర్చుల కోసం నెలకు రూ. 75,000 అలవెన్స్ కూడా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆర్థిక నేపథ్యం లేని కొత్త ఎమ్మెల్యేలకు ఇది ఎంతో ఊరటనిస్తుందని, పారదర్శకమైన, అవినీతిరహిత పాలనకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం పేర్కొంది. అయితే, ప్రభుత్వ నిర్ణయంపై డీఎంకే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్రం అప్పుల్లో ఉందని పదేపదే చెబుతున్న టీవీకే ప్రభుత్వం, ఇప్పుడు ఎమ్మెల్యేలకు కార్లు పంపిణీ చేయడమేమిటని ఉదయనిధి స్టాలిన్ ప్రశ్నించారు. తమ పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు ఈ కార్లను తీసుకోబోరని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్లను పరిశీలించి, సొంత వాహనాలు లేని వారికి మాత్రమే ఈ సౌకర్యం కల్పించాలని ఆయన సూచించారు. డీఎంకే విమర్శలపై మంత్రి ఆధవ్ అర్జున ఘాటుగా స్పందించారు. ఈ పథకం కింద సొంతంగా కారు లేని ఎమ్మెల్యేలకు మాత్రమే వాహనాలు కేటాయిస్తామని ఆయన స్పష్టతనిచ్చారు. ఇది విలాసం కాదని, ప్రజాసేవకు అవసరమైన కనీస సదుపాయమని వ్యాఖ్యానించారు. అనేక బంగ్లాలు ఉన్నప్పటికీ ఉదయనిధి స్టాలిన్ ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఎందుకు నివసిస్తున్నారని ఆయన నిలదీశారు. ముఖ్యంగా చిన్న పార్టీల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలకు ఈ వాహనాలు ఎంతో అవసరమని ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమర్థించుకుంది.

## ఎకరం రూ.264 కోట్లు..

మొత్తం 5.25 ఎకరాల ప్లాట్ విక్రయం ద్వారా ప్రభుత్వ సంస్థ అయిన టీజీఐఐసీకి రూ. 1,386 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. హైదరాబాద్‌లో భూమి ధరకు సంబంధించి ఇదే ఆల్ టైమ్ రికార్డ్. రాయదుర్గం పాన్‌మక్తాలోని సర్వే నెం. 83/1లో ఉన్న ప్లాట్ నెం. P1 కోసం శుక్రవారం ఈ-వేలం నిర్వహించారు. ఎకరాకు రూ. 175 కోట్ల కనీస ధరతో వేలం ప్రారంభించగా, దానిపై ఏకంగా 50.9 శాతం అధికంగా ధర పలికింది. ఇదే కారిడార్‌లో గత మే నెలలో టీజీఐఐసీ నిర్వహించిన వేలంలో ఎకరాకు రూ. 237 కోట్లు పలికింది. తాజా వేలంలో ఆ రికార్డు బద్దలైంది. హైదరాబాద్ ఐటీ, నాలెడ్జ్ సిటీ గ్రోత్ కారిడార్‌లో ఈ భూమి ఉండటం దీనికి ప్రధాన కారణం. ఐటీసీ కోహినూర్ హోటల్‌కు ఎదురుగా, దుర్గం చెరువు, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు అత్యంత సమీపంలో ఈ ప్లాట్ ఉంది. మల్టీ-యూజ్ జోన్‌గా ఉన్న ఈ భూమి కోసం పలు ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు తీవ్రంగా పోటీపడ్డాయి. ఈ వేలంలో పాల్గొనేందుకు బిడ్డర్లు రూ. 10 కోట్ల డిపాజిట్ చెల్లించారు. ఈ భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక్కడ చారిత్రక రాతి కట్టడాలు ఉన్నాయని, దుర్గం చెరువుకు సమీపంలో ఉన్నాయని, యాజమాన్య హక్కుల వివాదాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. అయితే, వేలం ప్రక్రియను నిలిపివేసేందుకు న్యాయస్థానాలు నిరాకరించాయి. ఈ ప్లాట్లు రక్షిత వారసత్వ ప్రాంతాలు, బఫర్ జోన్ల పరిధిలోకి రావని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా రాయదుర్గం ప్రాంతంలో భూముల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. 2025లో ఇక్కడ ఎకరా ధర రూ. 177 కోట్లుగా ఉండేది. ఇప్పుడు అంతకుమించి రికార్డు ధర పలికింది. తాజా డిమాండ్ నేపథ్యంలో, ఇదే సర్వే నంబరులో మరో 5.38 ఎకరాల ప్లాట్‌కు ఆగస్టు 28న వేలం నిర్వహించనున్నట్లు టీజీఐఐసీ ప్రకటించింది.

## నేడు కేరళకు పవన్ కళ్యాణ్

### ఆయుర్వేద థెరఫీ చేయించుకోన్న డిప్యూటి సిఎం

**అమరావతి,ఆగస్ట్21 (సింగిడి):**



జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. శనివారం కేరళకు వెళ్లనున్నారు. ఇటీవల ముంబైలో కుడి భుజానికి రొటేటర్ కఫ్ గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆయన.. వైద్యుల సూచన మేరకు తదుపరి చికిత్సలో భాగంగా కేరళలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యులు పవన్ కల్యాణ్‌కు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కొంతకాలం బహిరంగ కార్యక్రమాలకు, అధికారిక విధులకు దూరంగా ఉండాలని కూడా వైద్యులు సూచించినట్లు జనసేన కేంద్ర కార్యాలయం తెలిపింది. అయితే పాలనా బాధ్యతల నేపథ్యంలో ఆయన వారం రోజుల్లోనే క్యాంపు కార్యాలయానికి అందుబాటులోకి వచ్చారు.ఆ తర్వాత ముందుగా ఖరారైన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు వరుసగా శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో శస్త్రచికిత్స చేసిన కుడి భుజం ప్రాంతంలో వాపు పెరగడంతో పాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం వైద్యుల సలహా మేరకు భుజం పూర్తిస్థాయిలో కోలుకునేలా చికిత్స తీసుకోవాలని పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే కేరళలోని ఆయుర్వేద వైద్యాలయంలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు. వైద్యుల సూచనల మేరకు చికిత్స, విశ్రాంతికి ప్రాధాన్యత ఇస్తూనే తన పాలనా బాధ్యతలను కొనసాగించేందుకు పవన్ కల్యాణ్ ప్రయత్నిస్తున్నట్లు జనసేన కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

## కాంగ్రెస్‌లో సవతుల పోరు..

**హైదరాబాద్, ఆగస్టు 21 (సింగిడి)**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు తీవ్రమవుతున్నాయని, నాయకుల మధ్య సవతుల పోరు నడుస్తోందని సీపీఐ సీనియర్ నేత నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతల అంతర్గత విభేదాల కారణం వల్ల రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ పుంజుకుంటోందని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడా తప్పులు చేయకుండా నిక్కచ్చిగా వ్యవహరించినప్పుడే మంత్రులు, కిందిస్థాయి అధికారులలో భయం ఉంటుందని నారాయణ పేర్కొన్నారు. సీఎం ఇప్పటికైనా రాజకీయాలను పక్కనపెట్టి పూర్తిస్థాయిలో పాలనపైనే దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో నిషేధిత 22ఏ భూముల నిబంధనలను కొందరు అధికారులు, నాయకులు దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఒకవైపు పాలిటెక్నిక్ విద్యార్థులు నిరసనలు, ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంలో తమ సీపీఐ పార్టీ భాగస్వామి కాదని, గడిచిన శాసనసభ ఎన్నికల్లో కేవలం సీట్ల సర్దుబాటు మాత్రమే చేసుకున్నామని గుర్తుచేశారు. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా తాము ఇస్తున్న సూచనలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుతో ప్రజల్లో కాంగ్రెస్ పాలన పట్ల అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతోందని హెచ్చరించారు.

## షావుకారు జానకి కన్నుమూత

**చెన్నై, ఆగస్టు 21 (సింగిడి)**

ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతూ తుది శ్వాసవిడిచారు. ఆమె గత కొంత కాలంగా శ్వాసకోశ, వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల మరోసారి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆమె కన్నుమూశారు. షావుకారు జానకి.. నటి కృష్ణకుమారికి సోదరి. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో 1931 డిసెంబర్ 12న జన్మించారు. చిన్నతనంలోనే నాటకాల్లో పలు పాత్రలు పోషిస్తూ కెరీర్ ప్రారంభించారు. 11 ఏళ్లకు రేడియోలో ఒక తెలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. 1949లో 'రక్షా రేఖ' సినిమాతో చలనచిత్ర రంగంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత 1950లో 'షావుకారు' సినిమా హిట్ కావడంతో ఆమెకు షావుకారు జానకిగా పేరు వచ్చింది. ఆ తర్వాత అనేక సూపర్ హిట్ చిత్రాల్లో జానకి నటించారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో సుమారు 400 చిత్రాల్లో, 3 హిందీ సినిమాల్లోనూ, ఒక మలయాళ చిత్రంలో నటించి మెప్పించారు. సినీ రంగానికి ఆమె చేసిన సేవలకు గాను భారత ప్రభుత్వం ఆమెను 2022లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఇల్లు గడవక నటిగా మారి.. షావుకారు జానకి జీవితమిది.. 'వద్దంటే డబ్బు', 'కన్యా శుల్కం', 'పిచ్చి పుల్లయ్య' , 'రేచుక్క-పగటిచుక్క, 'రోజులు మారాయి', 'సొంతవూరు', 'జయం మనదే', 'డాక్టర్ చక్రవర్తి', 'సంసారం ఒక చదరంగం', 'తోడికోడళ్ళు', 'బాబు బంగారం', 'గీతాంజలి' ఇలా అనేక హిట్ చిత్రాలలో జానకి నటించారు. చివరి సారి 'అన్నీ మంచి శకునములే'లో ఆమె కనిపించారు.

### పెల్లెట్ గన్ బాధితుడితో

## పోలీస్ స్టేషన్‌కు రాహుల్

అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు. జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది. అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం 22-8-2026




# ఆడపిల్లలపై వివక్ష చూపరాదు

- వెల్కటూరు గ్రామాన్ని సందర్శించిన సిపి రష్మీ పెరుమాళ్




**సిద్ధిపేట బ్యూరో,ఆగస్టు 21(సింగిడి):** ప్రజలకు, పోలీసులకు మధ్య దూరాన్ని తగ్గించి, కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సిద్ధిపేట పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన పోలీస్ – మన ఊరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెల్కటూరు గ్రామాన్ని సందర్శించారు. సురక్షనేత్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రజల భాగస్వామ్యం, సహకారంతో ఏర్పాటు చేసిన 24 సీసీటీవీ కెమెరాలను సీపీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండటానికి, వారిని క్రీడల వైపు ప్రోత్సహిస్తూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పోలీస్ , విలేజ్ యూత్ మధ్య ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను టాస్ వేసి సీపీ ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ, గ్లోబల్ వార్మింగ్ నివారణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదిత్య ఐ హాస్పిటల్, ఎల్.వి. ప్రసాద్ ఐ హాస్పిటల్, అగర్వాల్ ఐ హాస్పిటల్ ల సంయుక్త సహకారంతో గ్రామ ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సీపీ ప్రారంభించారు. అనంతరం సురభి మెడికల్ కళాశాల విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాలపై సృజనాత్మక నృత్య ప్రదర్శన ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ ఆకట్టుకునే రీతిలో డాన్స్ పర్ఫార్మెన్స్ చేశారు. వెల్కటూరు విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ యోగా, ధ్యానం వైపు మళ్లాలని సందేశమిస్తూ అద్భుతమైన యోగాసన ప్రదర్శన చేశారు. అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కుషాల్కర్ మాట్లాడుతూ సిద్ధిపేట సురక్ష నేత్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 250కి పైగా గ్రామాల్లో 1400 కంటే ఎక్కువ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయించడం జరిగిందనీ, సీసీటీవీల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణ సాధ్యమవుతుంది అని తెలిపారు. 'సిద్ధిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర' ద్వారా 700 మందికి పైగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాం. 'మన పోలీస్ – మన ఊరు' ప్రోగ్రామ్ ద్వారా ప్రజలకు, పోలీసులకు మధ్య దూరాన్ని తగ్గించడమే పోలీస్ శాఖ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. అత్యవసర సమయంలో డయల్ 112 కి కాల్ చేయాలనీ , ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకూడదని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వెల్కటూరు గ్రామ ప్రజలకు సీపీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డబ్బులు ఇస్తే ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని ఎవరైనా చెప్తే నమ్మకండి, అది పూర్తిగా ఫ్రాడ్ అని తెలియజేశారు. ఫోన్లలో ఉచిత బహుమతులు అని వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దు అని చెప్పారు . పొరపాటున క్లిక్ చేస్తే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ సంఖ్యకు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే వెంటనే డబ్బును ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుంది అని తెలిపారు. ప్రతీ ఒక్కరికీ ఒకే రకమైన సక్సెస్ ఫార్ములా ఉండదన్నారు. సొంత వ్యూహంతో, పట్టుదలతో కష్టపడి లక్ష్యాన్ని చేరుకోవలన్నారు. గ్రామాల్లో ఉండే యువతకు కష్టం విలువ బాగా తెలుస్తుందన్నారు. స్మార్ట్‌ఫోన్‌ను కేవలం జ్ఞానాన్ని పెంచుకోవడానికి, ఆన్లైన్ ఈ–లైబ్రరీ ద్వారా చదువుకోవడానికి మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఆడపిల్లలపై ఎలాంటి వివక్ష చూప కూడదు, వారి కలలను, ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులు ప్రోత్సహించాలి అని విజ్ఞప్తి చేశారు . సైబర్ క్రైమ్, డ్రగ్స్ రహిత 'సురక్షిత సిద్దిపేట' నిర్మాణంలో పోలీసు శాఖకు ప్రజలందరూ సహకరించాలన్నారు. పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ ఎఆర్ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసిపి రవీందర్ రెడ్డి, సిద్దిపేట త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ బాబు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ నుంచి ఢిల్లీకి సోను యాదవ్ సైకిల్ యాత్ర

జెండా ఊపి ప్రారంభించిన కూన శ్రీశైలం గౌడ్




**కుత్బుల్లాపూర్, ఆగస్టు 21 (సింగిడి):** కుత్బుల్లాపూర్ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, రాహుల్ గాంధీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన సోను యాదవ్ చేపట్టిన సాహసోపేత సైకిల్ యాత్ర శుక్రవారం కుత్బుల్లాపూర్ నుంచి ప్రారంభమైంది. కుత్బుల్లాపూర్ నుంచి ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు సుమారు మూడు నెలల పాటు కొనసాగనున్న ఈ యాత్రను మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ భవిష్యత్తుపై తన రాజకీయ ఆకాంక్షను వ్యక్తం చేస్తూ ఇంత సుదీర్ఘమైన సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టిన సోను యాదవ్‌ను అభినంది ంచారు. ఎలాంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నా పట్టుదలతో యాత్రను కొనసా గిస్తున్న ఆయన సంకల్పం అభినందనీయమని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టాలనే సోను యాదవ్ ఆకాంక్ష నెరవేరాలని కూన శ్రీశైలం గౌడ్ ఆకాంక్షించారు. ప్రజల సమస్యలు, దేశ రాజకీయాలపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగే ఇలాంటి ప్రజా యాత్రలు ప్రజాస్వామ్య చైతన్యానికి దోహదపడతాయని పేర్కొన్నారు. సైకిల్ యాత్ర నిర్వాహకులు సోను యాదవ్ మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ నుంచి ప్రారంభమైన తన యాత్ర తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల మీదుగా కొనసాగి చివరకు ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ముగుస్తుందని తెలిపారు. దాదాపు మూడు నెలల పాటు వేలాది కిలోమీటర్ల మేర సైకిల్‌పై ప్రయాణిస్తూ ప్రజలను కలుసుకుని తన ఆకాంక్షను తెలియజేస్తానని చెప్పారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలనే తన సంకల్పాన్ని ఢిల్లీ వరకు తీసుకెళ్లడమే యాత్ర ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు శ్రీ కూన శ్రీనివాస్ గౌడ్ గారు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని సోను యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సైకిల్ యాత్ర విజయవంతంగా పూర్తిచేసి ఢిల్లీకి చేరుకోవాలని నాయకులు ఆకాంక్షిస్తూ ఆయనకు తమ మద్దతు ప్రకటించారు.

# కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 21 (సింగిడి):** మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా 127 – రంగారెడ్డి నగర్ డివిజన్ ఇందిరా గాంధీ నగర్ లో సుమారు 48 లక్షల రూపాయలు, గురుమూర్తి నగర్ లో 29 లక్షలు, గిరి నగర్ లో 90 లక్షలు, రంగారెడ్డి నగర్ లో 60 లక్షల రూపాయలు, పంచశీల కాలనీలో 22.70 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీలో పాదయాత్ర నిర్వహించి ప్రజలకు అందుతున్న మౌలిక వసతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ అభివృద్దే లక్ష్యంగా గత 12 ఏళ్ల కాలంలో కోట్ల రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరచామని అన్నారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా సిసి రోడ్ల నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల మార్పు, త్రాగునీటి సరఫరా పెంపు, కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు కాలనీల భద్రతకై సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో చింతల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్పందన, పోలీస్ అధికారులు ఏసీపీ గిరి ప్రసాద్, సీఐ శ్రీనివాస్ రావు, వాటర్ వర్క్స్ డీజీఎం వికాస్, ఏఈ అభిరామ్, మాజీ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, డివిజన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, స్థానిక నాయకులు ఓంకార్ రెడ్డి, క్రాంతి యాదవ్, ఎర్వ సాయికిరణ్ (బంటి), గౌసుద్దీన్, ఇబ్రహీం, సురేష్ గౌడ్, సంపత్, సాయి నేత, ఆంజనేయులు, నాగార్జున, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు ఎల్వోసీ అందజేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్




**వికారాబాద్, ఆగస్టు 21(సింగిడి):** ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 23 వార్డ్ వెంకటేశ్వర కాలానికి చెందిన మొహ్మద్ ఆర్మన్ చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి క్రింద మూడు లక్షల రూపాయల విలువగల ఎల్ వో సీని వారి తండ్రికి శుక్రవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా భాదితుని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని అంతా మంచి జరుగుతోందని ఆయన అన్నారు.

## సుదర్శన్‌రెడ్డి నగర్‌లో ఫ్రైడే – డ్రై డే




**కుత్బుల్లాపూర్, ఆగస్టు 21 (సింగిడి):** జీడిమెట్ల సర్కల్, 284 – గణేశ్ నగర్ వార్డ్ సుధర్శన్ రెడ్డి నగర్ లో ఫ్రైడే – డ్రై డే కార్యక్రమం నిర్వంచారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ విభాగం అదికారులు కాలనీ ఆర్డ బ్లూఏ సభ్యులు పాల్గొని స్టానికులకు దోమలు ఉత్పత్తికి ప్రధాన కారణమైన నిల్వనీటిని ఎప్పటికప్పుడు తొలిగించాలని ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాదులు నివారణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంట మాలజీ విభాగం అధికారులు, కాలనీ ఆర్డబ్లూఏ సభ్యులు (ఆర్‌డబ్ల్యూఏ) పాల్గొన్నారు.

## ఆన్లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి



**జమ్మికుంట, ఆగస్టు 21 (సింగిడి):** ఆన్లైన్లో బెట్టింగ్ పెట్టి పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా క్రెడిట్ కార్డుల ద్వారా చేసిన అప్పులు తీర్చలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కరీంనగర్ జిల్లాలో చోటు చేసుకుంది. జమ్మికుంట మండలంలోని గండ్రపల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి ప్రదీప్ రావు(30) అనే యువకుడు ఆన్లైన్లో బెట్టింగ్లకు పాల్పడుతూ డబ్బులు పోగొట్టుకున్నాడు. అంతేకాకుండా వివిధ రకాల క్రెడిట్ కార్డుల ద్వారా అప్పులు చేసి చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనస్థాపం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కొంతమేరకు డబ్బులు చెల్లించినప్పటికీ ఇంకా డబ్బులు చెల్లించవలసి ఉండగా తీవ్ర మనస్తాపం చెంది ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమారుడు ఆన్లైన్ బెట్టింగ్ పాల్పడి మృతి చెందడం పట్ల తండ్రి సంపత్రావు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.

# ఇస్నాపూర్ మున్సిపల్ సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం

- ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత
- పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి
- రుద్రారం, పాశంమైలారం, చిట్కుల్ వార్డుల్లో రూ.2.70 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన





**పటాన్చెరు, ఆగస్టు 21 (సింగిడి):** ఇస్నాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించే ందుకు ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడు తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారం, పాశం మైలారం, చిట్కుల్ వార్డుల్లో సుమారు రూ. 2.70 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగు నీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని ప్రతి వార్డును సమానంగా అభివృద్ధి చేయడంతో పాటు, కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తారని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తూ.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్, మాజీ ఎంపీపీలు శ్రీశైలం యాదవ్, గాయత్రి పాండు, కౌన్సిలర్లు పాండు, సంధ్య నవీన్ రెడ్డి, లత వెంకటేష్, రాజు, ఆంజనేయులు, వెంకటేష్, అరుణ్, కో ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, బాబా, అసీయ బేగం, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సుధీర్ రెడ్డి, కృష్ణ, రాజు, బండ రాజు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



**ఆమనగల్లు, ఆగస్టు 21(సింగిడి):** శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆమనగల్లు శ్రీ సత్యసాయి మందిరంలో సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక శ్రీ వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం రోజున శ్రీ వరలక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా కుటుంబంలో సుఖశాంతులు, ఐశ్వర్యం, ఆరోగ్యం, సౌభాగ్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. సుమంగళి స్త్రీలు కుటుంబ శ్రేయస్సు, భర్త ఆయురారోగ్యాలు, సంతాన సౌభాగ్యం, ఇంటిల్లిపాదీ సుఖసంతోషాల కోసం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు. ఈ సందర్భంగా ఆమనగల్లు సత్యసాయి మందిరాన్ని అత్యంత సుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య సామూహికంగా సుమారు 50 వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి ఆశీస్సులు పొందారు. శ్రీ సత్యసాయి బాబా బోధించిన "ప్రేమించు -- సేవచేయు" అనే సేవా భావ–నకు అనుగుణంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తిలో సేవాభావం, సేవలో మానవత్వం ఉండాలనే సత్యసాయి బాబా సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమితి నిరంతరం కృషి చేస్తోందన్నారు. వ్రత కార్యక్రమం అనంతరం నారాయణ సేవ కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు, పట్టణ ప్రజలకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దొంతు శ్రీనివాస్, డాక్టర్ దొంతు పుల్లయ్య, గోల్డ్ రాము, గోల్డ్ బ్రహ్మం, నాగిళ్ల లింగం, ఎన్.ఆర్. ప్రభాకర్, రామాచారి, అప్పం తిరుపతయ్య, ఆర్టీఏ శేఖర్, శంకర్, అల్లాజి, పోలిశెట్టి శ్రీనివాస్, ఉప్పు శ్రీశైలం, పోలిశెట్టి నందు, గందె శేఖర్, ఆలేటి నారాయణ సార్, కృష్ణారెడ్డి, గాజుల శ్రీనివాస్, గంజి వెంకటేష్, దొంతు విజయలక్ష్మి, దొంతు సంధ్య, అప్పం అలివేలమ్మ, బొంతు కృష్ణవేణి, శైలజ, అశ్వినీ, గందె కృష్ణవేణి, కృష్ణవేణి, పోలిశెట్టి సింధు, పోలిశెట్టి ధనలక్ష్మి తదితరులతో పాటు సత్యసాయి భక్తులు, స్థానిక మహిళలు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వరలక్ష్మీ వ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కడ్తాల్లో బోనాల ఉత్సవాలు




**ఆమనగల్లు, ఆగస్టు 21(సింగిడి):** కడ్తాల్ మండల కేంద్రంలో వచ్చే నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వం–కు బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పోచమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక పోచమ్మ ఆలయంలో వివిధ కుల సంఘాల నాయకులు, పెద్దల సమక్షంలో సమావేశం నిర్వహించి ఉత్సవాల తేదీలను ఖరారు చేశారు. గత సంవత్సరంలాగే ఈసారి కూడా అమ్మవారి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ నెలవారీ వేడుకల్లో భాగంగా ఐదో తేదీన కాటమయ్య బోనాలు, ఆరో తేదీన బీరప్ప, పెద్దమ్మ, ఈదమ్మ, మడేలు స్వామి ఏడో తేదీన పోచమ్మ బోనాలు, ఎనిమిదో తేదీన రేణుక ఎల్లమ్మ బోనాలు జరుగుతాయని, ప్రజలు సహకరించాలని కోరారు.

## 22 ఏ నిషేధిత జాబితాలో చేర్చిన పేదల పట్టా భూములను తొలగించాలని కలెక్టర్‌కు వినతి



**వికారాబాద్, ఆగస్టు 21(సింగిడి):** వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు యు. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో 22–ఏ నిషేధిత జాబితాలో చేర్చిన పేదల పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని ఆర్డీవో కుఅందజేశారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు, రాష్ట్ర బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి గపిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ వికారాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు, మాజీ జిల్లా అధ్యక్షులు మాధవ రెడ్డి, బిజెపి నాయకులు, కౌన్సిలర్లు, బిజెపి ముఖ్య నాయకులు పాల్గొని, పేదల పట్టా భూములకు న్యాయం చేయాలని, అర్హులైన రైతులు మరియు భూ యజమానుల భూములను 22–ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి వారికి హక్కులు కల్పించాలని కోరారు.

## పలు అభివృద్ధి పనులకు కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 21 (సింగిడి):** కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం చింతల్ డివిజన్ రంగనగర్, దుర్గయ్యనగర్ కాలనీలలో రూ. 96 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. రంగనగర్‌లో రూ. 60 లక్షల వ్యయంతో వరుద నీటి మురుగు కాలువ నిర్మాణానికి (స్టాం వాటర్ డ్రైన్), దుర్గయ్యనగర్‌లో రూ. 36 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, గతంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని గుర్తు చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు శ్రీధర్ బాబు కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కాలనీవాసులు స్థానిక సమస్యలను, ముఖ్యంగా మంచినీటి విడుదల సమయాన్ని పొడిగించాలని శ్రీశైలం గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ స్థానిక జలమండలి అధికారులతో మాట్లాడి మంచినీటి సరఫరా సమయాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మధు, లక్ష్మణ్, నాగరాజు, అఖిల్ గౌడ్, సాయి యాదవ్, అనంత్ రావు, పద్మ, లాల్ మేస్త్రి, దుర్గయ్యనగర్ కాలనీ అధ్యక్షుడు సురేష్, అక్బర్, నాగేశ్వరరావు, షేక్ మీర్, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం 22-8-2026

# ఎడిటోరియల్

Editorial

## ప్రియాంక బెటర్ ఛాయిస్

పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తీరును గమనిస్తే.. ప్రతిపక్షాలు సభను స్తంభించడం మినహా చేసిందేమీ లేదు. లోపలా, బయటా ప్రియాంక తీరు ఆశాజనకంగా ఉంది. ఆమె సపందర్భోచితంగా మాట్లాడుతున్నారు. రాజకీయంగా మోడీని లేదా బిజెపిని ఎదుర్కొనే విషయంలో ఆమె సందర్భోచితంగా మాట్లాడ గలుగు తున్నారు. ఈ లెక్కన కాంగ్రెస్‌కు ఆమె సరైన నేతగా దారి చూపగలరని భావించవచ్చు. పార్మలెంటులో సమస్యలపై ఆమె అవగాహనతో మాట్లాడుతున్నారు. ఎందుకంటే రాహుల్ కేవలం మోడీ లక్ష్యంగా చేస్తున్న విమర్శలు పెద్దగా ఆకట్టుకోలేక పోతున్నాయి. మోడీని నిందించడం తప్ప ఆధారాలను సమర్పించే ప్రయత్నం ఇప్పటి వరకు చేయలేదు. అయినా ఆయనలో మార్పు కనిపించడం లేదు. ఎందుకంటే పార్లమెంటులో కూడా మళ్లీ ఇదే విధంగా తన పాతపాటనే పాడారు. ఓట్ల తొలగింపు ప్రక్రియ సర్‌ను తప్పుపట్టడమే పెద్ద తప్పు. లోక్‌సభలో అంశాలపై జరిగిన చర్చలో.. విపక్ష సభ్యులు మాట్లాడిన తీరును పరిశీలిస్తే.. రాహుల్ తన అపరిపక్వతను మరోమారు బయట పెట్టుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా వాద్రా మాత్రం పరిణతి చెందిన రాజకీయ నేతగా రాణించారు. వందేమాతరంపై చర్చలో ప్రియాంక ఓ రకంగా మోడీని అడ్డుకుని తీరారనే చెప్పాలి. గత సమావేశాల్లో వందేమాతరం ప్రస్తావన ద్వారా నెహ్రూను ఎండగట్టాలన్న తీరును కూడా తప్పు పట్టారు. ఒకవేళ నెహ్రూ గురించి అయితే ఓ రోజంతా చర్చిద్దామని, తిరిగి మళ్లీ నెహ్రూ జోలికి వెళ్లవద్దని అన్నారు. అయితే ఆమె మాట్లాడిన తీరు పరిణతి చెందిన రాజకీయ నేతగా కనిపించారు. సమస్యలను లోతుగా ఎత్తిచూపి మాట్లాడే సత్తా ఉన్న నేతగా కనిపించారు. రాహుల్‌తో పోలిస్తే ఆమె చాలా మెరుగైన నాయకత్వ లక్షణాలను కనబర్చారు. రాజ్యాంగ వ్యవస్థను పనిచేయకుండా అడ్డుకున్నట్లేనని గుర్తించడ లేదు. డీ లిమిటేషన్‌పై మళ్లీ పార్లమెంట్ పెడితే ప్రియాంకను ముందు పటెట్టం మంచిది. ప్రజలను ఆకట్టుకునేలా ప్రసంగం చేయగలదు. అలాగే తప్పులను ఎత్తిచూపే విధం ఆకట్టుకుంది. కేవలం ఆర్‌ఎస్ఎస్‌ను దుమ్మెత్తి పోయడం ద్వారా మైనార్టీ ఓటు బ్యాంక్‌ను పదిల పర్చుకునే ఎత్తుగడ ప్రదర్శించారు. ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరగాలి. సంస్థాగత వ్యవస్థ మొత్తాన్ని ఆరెస్సెస్ టోకుగా గుప్పిట పట్టిందని చెప్పడం ద్వారా వ్యవస్థను తప్పు పట్టారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఎన్నికల సంఘం ఇదే చేసేది. భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఎన్నికల సంఘాన్ని భాజపా వాడుకుంటోందని ఆరోపించడం ద్వారా ప్రజలల్లో తనకు ఇమేజ్ లేదని చెప్పుకున్నారు. నేతలు నిష్పాక్షికంగా ఉన్నప్పుడే ఎన్నికల సంస్కరణలు సాధ్యమవుతాయని గుర్తించాలి. కాంగ్రెస దేశంలో దశాబ్దాల పాటు పాలన చేసింది. ఎన్నికలవ్యవస్థపై దాడిచేసే బదులు నిర్మాణాత్మక విమర్శలు,సూచనలు చేసివుంటే రాహుల్ ప్రతిభ ఇనుమడించేది. అందుకే ప్రియాంకతో పోలిస్తే రాహుల్‌కు విషయ పరిజ్ఞానం తక్కువని తేలిపోయింది. మొత్తం ఎన్నికల తీరునే తప్పు పట్టారు. సర్ ప్రక్రియను కూడా తప్పు పట్టడం రాజ్యాంగ వ్యవస్థల పనితీరును ప్రశ్నించడం తప్ప మరోటి కాదు. రాహుల్ పరిణతి రాజకీయాలు అవలంబించాలి. రాహుల్‌గాంధీ ఎంతకూ ఓట్ చోరీ, నిరుద్యోగిత అంశాలకే పరిమితమయ్యారు. అంతే తప్ప సమస్యలు లేదా ప్రజలు నిరంతరం ఎదుర్కొం టున్న ప్రధాన విషయాలను ప్రస్తావించడం లో రాహుల్ విఫలం అయ్యారు. పార్లమెంటులో అనేక సమస్యలను ప్రస్తావించి చర్చించడంలో విపక్షనేతగా విఫలం అయ్యారు. విపక్షాల పట్ల ప్రజల్లో ఒక ప్రగాఢ ఆకాంక్షను నెలకొల్పడంలోనూ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. ప్రజలు ఏం సమస్యలు ఎదుర్కొంటున్నారో.. పార్లమెంట్ వేదికగా వాటికి ఎలాంటి పరిష్కారం చూపాలో అన్నది విపక్ష పార్టీల బాధ్యత. కేవలం ఓట్ చోరీ నినాదాలతో ముందుకు నడవలేరు. పార్లమెంటు లో ఆయా అంశాలపై చర్చ జరక్కపోవడానికి కారణం ఇదే. అందుకు విపక్ష పార్టీలదే బాధ్యత. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు ప్రియాంకను విపక్ష నేతగా చేస్తే మంచిది. ఆమెను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలి. అప్పుడు ఆమె రాటుదేలుతుందనడంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు. డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుల్లో ఆమెను ముందు నిలబెడితే మంచిది.

# బ్రిటిషర్లను గడగడ లాడించిన తెలుగు బిడ్డ అల్లూరి

## నేడు అల్లూరి సీతారామరాజు నేతృత్వంలో తిరుగుబాటుకు శ్రీకారం

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు గురించి తెలియని వారుండరు. మన్యం ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసి, వారి కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుడైన అల్లూరి, అక్కడి ప్రజలకు దైవ సమానుడై,




భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడుగా, మన్యం వీరుడుగా, అగ్గి పిడుగుగా ప్రసిద్ధి గాంచిన పోరాట యోధుడు సీతారామరాజు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి. ఆయన ఒక మహోజ్వల శక్తి. ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం. మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాటానికి సిద్ధ మై, చుట్టుపక్కల 30, 40 గ్రామాల ప్రజలకు రాజు నాయకుడయ్యాడు. పోలీసు స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకెళ్ళడంతో విప్లవం ప్రారంభమైంది. 1922 ఆగస్టు 19న మహారుద్రాభిషేకం చేసి చింతపల్లి పోలీసు దోపిడీకి నిశ్చయించుకొన్నారు. 1922 ఆగష్టు 22న మన్యంలో తిరుగు బాటు ప్రారంభం అయింది. రంపచోడవరం ఏజన్సీలోని చింతపల్లి పోలీసు స్టేషనుపై 300 మంది విప్లవ వీరులతో రాజు దాడిచేసి, రికార్డులను చింపివేసి, తుపాకులు, మందుగుండు సామాగ్రిని తీసుకు వెళ్ళారు. మొత్తం 11 తుపాకులు, 5 కత్తులు, 1390 తుపాకీ గుళ్ళు, 14 బాయొనెట్లు తీసుకువెళ్ళారు. ఏమేం తీసుకు వెళ్ళారో రికార్డు పుస్తకంలో రాసి, రాజు సంతకం చేసాడు. అదే ఉత్సాహంతో మరుసటి రోజే శరభన్నపాలెం వెళ్ళి, భోజనాలు చేసి ఆ రాత్రే ఆగష్టు 23న – కృష్ణదేవు పేట పోలీసు స్టేషనును ముట్టడించి, ఆయుధాలను తీసుకు వెళ్ళారు. ముందుగా పోలీసులను భయపెట్టి



బయటకు పంపేశారు. 7 తుపాకులు, కొన్ని మందుగుండు పెట్టెలు మాత్రం లభించాయి.
ఆగష్టు 24న – వరుసగా మూడవ రోజు – రాజవొమ్మంగి పోలీసు స్టేషనుపై దాడి చేసారు. అయితే ఈసారి పోలీసుల నుండి కొద్దిపాటి ప్రతిఘటన ఎదురైంది. అక్కడ ఆయుధాలు దోచుకోవడమే కాక, అక్కడ బందీగా ఉన్న వీరయ్య దొరను కూడా విడిపించారు. ఈ మూడు దాడులలోను మొత్తం 26 తుపాకులు, 2500కు పైగా మందుగుండు సామాగ్రి వీరికి వశమయ్యాయి. రామరాజు పోరాటంలో అత్యంత సాహసో పేతమైనది అడ్డతీగల పోలీసు స్టేషనుపై అక్టోబర్ 15న జరిపిన దాడి. మొదటి దాడులవలె కాక ముందే సమాచారం ఇచ్చి మరీ చేసిన దాడి ఇది. అక్టోబర్ 19న రంపచోడవరం స్టేషనును పట్టపగలే ముట్టడించారు.
4మాసాల విరామం తర్వాత1923 ఏప్రిల్ 17న రాజు కొద్దిమంది అనుచరులతో అన్నవరంలో ప్రత్యక్షమయ్యాడు. రాజు బృందం స్టేషనుకు వెళ్ళారు. విప్లవకారులు 1923 జూన్ 10న ధారకొండ, కొండకంబేరు మీదుగా మల్కనగిరి వెళ్ళి పోలీసు స్టేషను, ట్రెజరీపై దాడి చేసారు . 2-9-1923న రామవరం ప్రాంతానికి కమాండర్‌గా ఉన్న అండర్‌వుడ్ సైనికులకు, మన్యం వీరులకు భీకరమైన పోరాటం జరిగింది. సెప్టెంబర్ లో రాజు ముఖ్య అనుచరుడైన గాము మల్లుదొర పోలీసులకు దొరికి పోయాడు. సెప్టెంబరు 22న విప్లవ కారులు పాడేరు పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. అక్టోబరు 26న గూడెం సైనిక స్థావరంపై దాడి చేశారు. మన్యం ప్రజలు ఎన్ని బాధలు పడుతున్నారో వివరించి, వారికి ఈ బాధలనుండి విముక్తి ప్రసాదించడానికి తాను లొంగి పోవాలని నిశ్చయించు కున్నట్లు చెప్పాడు. తనను ప్రభుత్వానికి పట్టి ఇచ్చినవారికి పదివేల రూపాయల బహుమతి లభిస్తుందని, కనుక తనను ప్రభుత్వానికి పట్టి ఇమ్మని కోరాడు. కాని తాను అటువంటి నీచమైన పని చేయ జాలనని మునసబు తిరస్కరించాడు. తరువాత, 1924 మే 7న కొయ్యూరు గ్రామ సమీపం నుండి, ఒక పశువుల కాపరి ద్వారా తనున్న చోటును పోలీసులకు కబురు పంపాడట. ఏటి ఒడ్డున స్నానం చేస్తూ ఉండగా పోలీసులు చుట్టుముట్టి రాజును బంధించారు. కొయ్యూరులో విడిది చేసి ఉన్న మేజర్ గుడాల్ వద్ద రాజును హాజరు పరిచారు. బందీగా ఉన్న అల్లూరి సీతారామ రాజును (ఒక చెట్టుకు కట్టివేసి) ఏ విచారణ లేకుండా గుడాల్ కాల్చి చంపాడు.

– రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...
9440595494

# నిజాం పాలనలో తొలి హిందూ పోలీస్ కమిషనర్ పింగళి

## నేడు పాశంవారి వెంకట రామారెడ్డి జయంతి

### ముసురు'కుంటున్నాయి !

ముసురుతో పల్లె తడిసి ముద్దైంది
మట్టి ఒళ్లు విరిసి విత్తనాన్ని అగింది
తడి మన్ను ఒడిలో విత్తిన విత్తనాలు..
మొక్కలై..మొగ్గలై..పువ్వులై..కాయలై..
రైతన్న కలల పంట పండించాయి
చిత్తడి నేలల్లో ఈగలు దోమలతో..
ముసురుకున్నాయి పుట్టెడు రోగాలు
ముసురుతో చలి పులి నిద్ర లేచి..
దుప్పట్లో దూరమని పిలుపునిచ్చింది !

ముసురు లేని ప్రకృతి మాత..
కరువు కరాళ నృత్యం చేయ..
అప్పులోళ్లు చుట్టూ ముసురుకున్నారు
ముసురు తేలి పోయిన మరు క్షణమే..
ఆరుద్ర పురుగులు తీసాయి పరుగులు
ఉసిళ్లు పుట్టల్లోంచి మంట చుట్టు చేరి..
రెక్కలు విరిగి చావుకు దగ్గరయ్యాయి
ముసురులో తడిసిన చిలుకలు..
ముద్దు ముచ్చట్లు ఆడుతున్నాయి !

ముసురు మూగిన ముసలోళ్లు..
దగ్గు దమ్ములతో యాతన పడ్డారు
ముసురుతో చెట్టు చేమలు నీటితో..
తడిసి ముద్దై తన్మయత్వం చెందాయి
ముసురు వానలో తడిసిన పిల్లలు..
కాలువల్లో కవాతులతో మురిసిపోయారు
ముసురు పడితేనే సంతోషాల ఊసులు
ముసురు అలిగి దూరమైతే హాహాకారాలు !

మధుపాళీ
9949700037

పింగళి వెంకట రామారెడ్డి. నేటి తరానికి చెందిన చాలా మందికి ఎక్కువగా అపరిచితమైన పేరు. భాగ్యనగరం చిత్రపటంపై చెరగని సంతకం ఆయనది. నిజాం ప్రభువుకు విశ్వాస పాత్రులై, హైదరాబాద్ నగరంపై తనదయిన ముద్ర వేసుకుని, ప్రజలకు అనేక రంగాలలో సహాయ సహకారాలు అందించి ప్రజా శ్రేయస్సే ఏకైక లక్ష్యంగా, అంకిత భావంతో సేవచేసి అపారమైన ప్రేమాభి మానలను చూరగొన్న ప్రజాబంధువు ఆయన. నిజాం రాజుల ఏడు తరాల రాజ్య పాలనలో హైదరాబాదు నగర పోలీసు కమీషనర్ (కొత్వాల్) పదవికి నియమితులైన ప్రప్రథమ హిందువుగా చరిత్రలో మిగిలి పోయారాయన. వెంకట రామారెడ్డి (ఆగష్టు 22, 1869 – జనవరి 25, 1953) నిజాం పరిపాలనలో పోలీసు



ఉన్నతాధికారి. నిజాం ప్రభువు వద్ద తమకు గల పలుకుబడి వల్ల ఎన్నో సంస్థలను స్థాపించారు. ఎన్నింటికో సాయం అందించారు. విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. హైదరాబాద్ లో రెడ్డి హాస్టల్ నెలకొల్పారు. ఆయన1869, ఆగష్టు 22 న వనపర్తి జిల్లా కొత్త కొండ మండలం ఒక చిన్న గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు కేశవరావు, జారమ్మ. ఆయన పుట్టగానే కొద్ది సమయం లోనే తల్లి మరణించగా, తొమ్మిది సంవత్సరాల పాటు రాయణి పేటలో అమ్మమ్మ కిష్టమ్మ చెంత పోషణలో పెరిగారు. చిన్నప్పుడు ఖాస్గీ (ప్రైవేటు) బడిలో భారత, భాగవతాలు చదివారు. తరువాత నాలుగు సంవత్సరాలు వనపర్తి పాఠశాలలో ఉర్దూ, ఫార్సీభాషను చదువు కున్నారు. తరువాత విలియం వాహబ్ దగ్గర కన్నడ, మరాఠీ భాషలు నేర్చుకున్నారు. నజర్ మహమ్మద్ సహాయంతో 1886లో ముదిగల్లు ఠాణాకు అమీను (సబ్ ఇన్స్‌పెక్టర్) గా నియమితులైనారు. తరువాత నిజాం సొంత ఎస్టేటు వ్యవహారాలలో ప్రత్యేక అధికారిగా కొంత కాలం వ్యవహరించారు. నిజాయితీ, సమర్థత, విధుల నిర్వహణలో చాకచక్యం కారణంగా అనతికాలంలో పదోన్నతి లభించింది. మహబూబ్ నగర్, నిజామాబాద్, కరీంనగర్, గుల్బర్గా, అత్రాఫ్ బల్దా (రంగారెడ్డి) జిల్లాలో పోలీసు అధికారిగా విధులు నిర్వహించారు. ఆ తరువాత ఆయన రాజధాని నగరం హైదరాబాద్‌లో నాయెబ్ కొత్వాల్‌గా నియమితులైనారు. అనంతరం కొత్వాల్ (సిటీ పోలీస్ కమిషనర్) అయ్యారు. వేల్సు యువరాజు హైదరాబాదు వచ్చినప్పుడు గట్టి భద్రతా ఏర్పాట్లుచేసి గుర్తింపు పొందారు. 1933 ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు. వెంకట రామారెడ్డి ఎన్నో సంస్థలను పోషించారు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం వేమనాంధ్ర భాషా నిలయం, బాల సరస్వతి గ్రంథాలయం పురోభివృద్ధికి సహాయం అందించారు. 1946లో జరిగిన 26వ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించారు. హైదరాబాదులో రెడ్డి విద్యార్థి వసతి గృహం నెలకొల్పారు. తెలంగాణలో విద్యావ్యాప్తి లోనూ, రాజకీయ చైతన్యం నింపడం లోనూ రెడ్డి హాస్టల్ కీలక పాత్ర పోషించింది. హాస్టల్‌ను ప్రారంభించేందుకు గద్వాల మహారాణి, వనపర్తి రాజా, పింగళి కోదండరాం రెడ్డి, గోపాలు పేట, దోమకొండ రాజా, జటప్రోలు రాజా తదతరుల నుంచి దాదాపు లక్ష రూపాయల వరకు చందాలు పోగు చేశారు. తొలుత నగరంలో అద్దె ఇంట్లో రెడ్డి హాస్టల్‌ను ప్రారంభించారు. తర్వాత 1918లో ప్రస్తుతం అబిడ్స్‌లో ఉన్న రెడ్డి హాస్టల్ సొంత భవనంలోకి మారింది.

మాతృభాష పట్ల జరుగుతున్న నిరాదరణను చూడలేక, 26 మే 1943 బుధవారం రెడ్డి హాస్టల్ గ్రంథాలయంలో నాటి ప్రముఖ పండితులు, భాషాభిమానులు, కవులు, రచయితలు సమావేశం నిర్వహించిన ఫలితంగా తెలుగు భాషా సంస్కృతుల ప్రచారం ప్రధాన లక్ష్యంగా ఒక సంస్థను స్థాపించాలని చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. సంస్థకు 'నిజాం రాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు' అని పేరు పెట్టారు. పరిషత్తు ద్వితీయ మహాసభ ఓరుగల్లులో 1944 డిసెంబర్ 28, 29, 30 తేదీల్లో వైభవంగా జరగగా, ఉదయ రాజు రాజేశ్వరరావు ఆహ్వాన సంఘానికి అధ్యక్షులు కాగా, కాళోజీ నారాయణరావు కార్యదర్శిగా, మహాసభను రాజాబహద్దూర్ వెంకట రామారెడ్డి ప్రారంభించారు. సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించారు.

1946 మార్చి 15, 16, 17 తేదీల్లో తృతీయ మహాసభలు జరిగాయి. లోకనంది శంకరనారాయణ రావు సభలకు అధ్యక్షత వహించారు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి సభలను ప్రారంభించారు. నారాయణ గూడ ఆంధ్ర బాలికోన్నత పాఠశాలకు చాలా కాలం అధ్యక్షులుగా పనిచేశారు. ఆంధ్ర విద్యాలయ కార్యవర్గానికి మరణించే వరకు అధ్యక్షులుగా ఉన్నారు. 1926లో "గోలకొండ పత్రిక" స్థాపనకు ముఖ్య కారకులయ్యారు. ఆ కాలంలో

ఆయన వలన సహాయం పొందని తెలుగు సంస్థ లేదంటే అతిశయోక్తి కాదు. హరిజనోద్ధరణకు ఏర్పడిన సంఘాలకు, అనాథ బాలల ఆశ్రమాలు, కుష్టు నివారణ సంఘం జంతు హింసా నివారణ సమితి వంటి సంస్థలతో పనిచేసి, వాటికి ఉదారంగా ధన సహాయం చేశారు. ఈ క్రమంలోనే 1933లో రెడ్డి బాలికల హాస్టల్ (నారాయణ గూడ), 1954లో రెడ్డి మహిళా కళాశాల (నారాయణగూడ) లను ప్రారంభించారు. పింగళి సేవలకు గుర్తింపుగా నిజాం రాజు జన్మదినోత్సవం సందర్భంగా 1921లో "రాజా బహద్దూర్" అనే గౌరవం ఇచ్చారు. బ్రిటిష్ ప్రభుత్వం 1931లో ఆయనకు "ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్" గౌరవం ప్రదానం చేశారు. వెంకట రామారెడ్డి కాంస్య విగ్రహం హైదరాబాదులో నారాయణగూడ చౌరస్తాలో ప్రతిష్ఠించారు. వెంకట రామారెడ్డి పేరుతో హైదరాబాద్‌లో ఒక మహిళా కళాశాల స్థాపితమైంది. ఆయన పేరు మీద ట్రస్టును ఏర్పాటుచేసి, ఆ ట్రస్ట్ ద్వారా హైదరాబాద్, సైబరాబాద్ మూడు కమిషనరేట్ల పరిధిలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు విధుల్లో ప్రతిభ కనబర్చిన వారికి రాజాబహద్దూర్ వెంకట రామారెడ్డి అవార్డును అందజేస్తున్నారు. పద్నాలుగు సంవత్సరాలు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా పనిచేసి, గ్రామీణ విద్యార్థుల చదువు కోసం రెడ్డి హాస్టల్ స్థాపించి, ఎందరో తెలుగువారు వెలుగులోకి రావడానికి కారకుడైన మహానుభావుడు కొత్వాల్ వెంకటరామారెడ్డి జనవరి 25 తేదీన 1953 సంవత్సరంలో పరమ పదించారు. లోయర్ ట్యాంక్ బండ్ లోని దోమలగుడ ప్రాంతంలో ఆయన సమాధి ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494



# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బీజేపీ నేతల వ్యాఖ్యలు అబద్ధం

- విద్యార్థుల ఖాతాల్లోకే నిధులు జమ చేసేలా ప్రభుత్వం చర్యలు
- మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి



**కరీంనగర్, ఆగస్టు 21(సింగిడి):** ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి విమర్శించారు. కరీంనగర్‌లోని తన నివాసంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రెహమత్ హుస్సేన్ తదితరులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మాట్లాడుతూ పేద, బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూ. 2,400 కోట్లు కేటాయించి, రూ. 2,050 కోట్లను విడుదల చేసిందన్నారు. విద్యార్థుల ఖాతాల్లోకే నేరుగా నిధులు జమ చేసే విధానాన్ని తీసుకురావడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ఫీజు బకాయిలున్నా పరీక్షలు పూర్తయిన వెంటనే విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించాలని కళాశాలలకు ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టారని గుర్తుచేస్తూ, విమర్శలు చేస్తున్న బీజేపీ నేతలు ముందుగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి పథకం ఎక్కడ అమలవుతోందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి నియోజకవర్గంలో సమగ్ర గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడంతో పాటు జర్మన్, జపనీస్ భాషల్లో శిక్షణ ఇచ్చి అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జాతీయ పరీక్షల సంస్థ వైఫల్యాలపై కేంద్రం సమాధానం చెప్పాలని, విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయవద్దని సూచించారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 12 ఏళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. కరీంనగర్ రైల్వే వంతెన నిర్మాణం ఏడాది గడిచినా పూర్తికాకపోవడంతో ప్రజలు, రోగులు, అంబులెన్స్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర పథకాలలో నిధుల వాటాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఎం.డి. తాజ్, వెన్నం రజితారెడ్డి, మాదాసు శ్రీనివాస్, చింతల్ కిషన్, కూడలి శ్రీధర్, అబ్దుల్ రెహమాన్, అమీర్, కుంభాల రాజుకుమార్, సామ్రాట్, బొమ్మరాతి సాయి తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో పశ్చిమ చాళుక్యుల నాటి శిల్పం



**జమ్మికుంట, ఆగస్టు 21 (సింగిడి):** జమ్మికుంట మునిసిపాలిటీ పరిధిలోని అబాది జమ్మికుంటలో గల రైతు వేదిక ప్రాంగణంలో ఒక పెద్ద రాయిపై ఈ శిల్పం చెక్కి వుంది. అబాది జమ్మికుంట శివాలయంలోని గరుడ స్థంభంపై పశ్చిమ చాళుక్య రాజు అహవామల్ల దేవ పరిపాలనలో స్థానిక పరిపాలకుడు నాగేయ వేయించిన 995 నాటి కన్నడ శాసనం వుంది. తైలపదేవ-Iని , ఉత్పల రాజ్యంపై విజయానికి గాను జమ్మికుంట శాసనం వేసారు. అదే సమయంలో రాజు పరిపాలకుడు నాగేయ యుద్ధం లో విజయానికి గాను ఈ విజయోత్సవ రాజును ఆహ్వానించే క్రమంలో ఈ శిల్పం చెక్కి ఉన్నారు. ఈ శిల్పంలో ముందు జెండా పట్టుకున్న భటుడు, కింద హంస, వెనక ఛత్రధారి, గుర్రంపై రాజు కత్తి ఎత్తిపట్టుకుని, భుజంపై విల్లుతో దక్షిణాభిముఖంగా.. విజయోత్సవం చెక్కారు. పశ్చిమ చాళుక్య పరిపాలన తర్వాత, పొలాస రాజుల, కాకతీయ రాజుల, కూతుబ్ షాహీ, అసఫ్ జాహి నిజాంల పరిపాలనలో జమ్మికుంటను రాజులు సామంత రాజులు పరిపాలించినట్టు శాసనాలు, శిల్పాలు ఇతర చారిత్రిక ఆధారాలు లేవు కావున ఇది పశ్చిమ చాళుక్యుల నాటి శిల్పంగా భావించ భావించుతున్నారు. జమ్మికుంట చరిత్రకు ఆధారమైన ఈ శిల్పాన్ని కాపాడుకోవలసిన అవసరం వుంది. మునిపాలిటీ పాలకవర్గం ప్రజలు ఈ శిల్పం శిథిలావస్థకు చేరుకోక ముందే రక్షించాలని చరిత్రకారులు రెడ్డి రత్నాకర్ రెడ్డి కోరుతున్నారు.

## నగునూరు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు మార్గదర్శక కార్యక్రమం

### విద్యార్థులకు పుస్తకాలు, పాఠశాల బ్యాగుల పంపిణీ



**కరీంనగర్, ఆగస్టు21(సింగిడి):** కరీంనగర్ గ్రామీణ మండలం నగునూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక మార్గదర్శక కార్యక్రమం నిర్వహించారు. సామాజిక సమరసత వేదిక ప్రాంత ప్రముఖ్ అప్పాల ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు భవిష్యత్ లక్ష్యాలు, వాటి సాధనకు అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, రాత పుస్తకాలను అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తపస్ జిల్లా అధ్యక్షుడు అన్నమనేని తిరుపతిరావు, సామాజిక సమరసత వేదిక రాష్ట్ర సహ ప్రముఖ్ పి. రామారావు, జిల్లా అధ్యక్షుడు తుమ్మ రమేష్‌రెడ్డి, దావు సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు




**జమ్మికుంట, ఆగస్టు21(సింగిడి):** బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జమ్మికుంటలో బీఆర్ఎస్వీ నాయకులు,కార్యకర్తలు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వి నాయకులు స్పందన అనాథ ఆశ్రమము లో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేసి గెల్లు శ్రీనివాస్ యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల,యువకుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేస్తున్న కృషిని నాయకులు కొనియాడారు. బీఆర్ఎస్వీని బలోపేతం చేయడంలో,యువతను ఐక్యంగా ముందుకు నడిపించడంలో గెల్లు శ్రీనివాస్ యాదవ్ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు, యువతకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో ఆయన మరెన్నో పదవులు అధిరోహించాలని నాయకులు, కార్యకర్తలు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ టౌన్ అధ్యక్షులు కొమ్ము నరేష్,జవ్వాజి అనిల్,నల్లగాష హరీష్ యాదవ్,నరేంగుల శివ యాదవ్,చింతల కౌశిక్ కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో పూజారి ప్రసాదాచార్యులు మృతి



**జమ్మికుంట, ఆగస్టు 21 (సింగిడి) :** జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన ప్రముఖ వేద పండితులు సముద్రాల ప్రసాదాచార్యులు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రసాదాచార్యులు కరీంనగర్ లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. జమ్మికుంట మండలం తో పాటు చుట్టుపక్కల ఉన్న చాలా మండలాలలో ఆయన ప్రత్యేక పూజలు వ్రతాలు చేస్తూ ఎంతోమందికి చేరువయ్యారు. అతి చిన్న వయసులోనే వేదాలలో ప్రత్యేక నైపుణ్యం సంపాదించుకొని ప్రముఖుల ఇండ్లలో హోమాలు పూజలు చేసి మంచి పూజారిగా పేరుపొందారు. ప్రస్తుతం జమ్మికుంట పట్టణంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆస్థాన పూజారిగా ఉంటున్న సమయంలో గత సంవత్సర కాలం నుండి ఆయన పూర్తిగా అనారోగ్యం తో ఉంటూ శుక్రవారం మృతి చెందారు. ఆయనకు ఒక కుమార్తె భార్య ఉంది. శనివారం తమ సొంత గ్రామమైన విలాసాగర్ లో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

**శోకసంద్రమైన విలాసాగర్**

విలాసాగర్ గ్రామంలో పుట్టి పెరిగిన ప్రముఖ పూజారి సముద్రాల ప్రసాదాచారి అనారోగ్యంతో మృతిచెందగా ఆ విషయం తెలుసుకున్న గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. చిన్నతనం నుండి అందరితో కలిసి మెలిసి ఉంటూ అందరివాడుగా పేరుపొందిన ప్రసాదాచార్యులు అతి చిన్న వయసులోనే అనారోగ్యంతో మృతి చెందడం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**ప్రసాద్ మృతి పట్ల విచారణ వ్యక్తం చేసిన పింగళి రమేష్**

చిన్న వయసులోనే అనారోగ్యంతో మృతి చెందిన పూజారి ప్రసాదాచార్యుల మృతి ఆ కుటుంబంతో పాటు గ్రామానికి తీరని లోటు అని ఆయన మృతి తనను బాధించిందని కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ విలాసాగర్ మాజీ గ్రామ సర్పంచ్ పింగళి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మంచి మనిషి అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరంగా ఉందని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

భూసేకరణకు రూ.2,800 కోట్లు విడుదలకు ఆమోదం

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి




**కరీంనగర్, ఆగస్టు 21(సింగిడి):** నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాస ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. భూసేకరణ కోసం ప్రభుత్వం రూ. 2,800 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. పెండింగ్ భూసేకరణపై శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి వీడియో సమావేశం నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కొత్త ఆయకట్టు సృష్టించేందుకు అవసరమైన భూసేకరణ, పునరావాస పనులను సత్వరం పూర్తి చేయాలని సూచించారు. నిధులు అందుబాటులో ఉన్నందున ఎలాంటి జాప్యం లేకుండా భూసేకరణ ప్రక్రియను పూర్తిచేసి ప్రాజెక్టుల పనులకు ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. నిర్వాసితులకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏయే ప్రాజెక్టులకు ఎంత భూమి సేకరించాల్సి ఉంది, ఎప్పటిలోగా పూర్తి చేయగలరనే వివరాలను అడిగి తెలుసుకుని, సత్వరచర్యలు చేపట్టాలని సూచించారు. వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో షర్మిల, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, నీటిపారుదల అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేకచట్టం తేవాలి

కొండమల్లేపల్లి ఘటన నేపథ్యంలో కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు టీఆర్ఎస్ఎంఏ వినతి

టీఆర్ఎస్ఎంఏ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు



**కరీంనగర్, ఆగస్టు 21(సింగిడి):** నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలో ప్రధానోపాధ్యాయురాలి హత్య ఘటనను తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం (టీఆర్ఎస్ఎంఏ) కరీంనగర్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయులపై దాడులు పెరుగుతుండటం ఆందోళనకరమన్నారు. క్రమశిక్షణలో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులను మందలించిన సందర్భాల్లో కొందరు తల్లిదండ్రులు పాఠశాలలకు వచ్చి వివాదాలకు దిగుతున్నారని తెలిపారు. పాఠశాలల పరిసరాల్లో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం కూడా విద్యార్థుల భవిష్యత్తుకు ముప్పుగా మారుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే 'ఉపాధ్యాయ రక్షణ చట్టం' తీసుకురావాలని, ప్రతి పాఠశాలను మాదకద్రవ్య రహిత ప్రాంతంగా ప్రకటించి కఠిన నిబంధనలు అమలు చేయాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో పాఠశాలలు పోలీసులను తక్షణం సంప్రదించే ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాల వేళల్లో పోలీసు గస్తీ పెంచాలని సూచించారు. ఉపాధ్యాయులు, పాఠశాలలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు, పరువునష్టం కలిగించే ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు భయరహితంగా, గౌరవప్రదంగా విధులు నిర్వర్తించే వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. తమ విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ఎంఏ జిల్లా అధ్యక్షుడు కోరం సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు పచ్చునూరి సురేందర్, నగర అధ్యక్షుడు రాహుల్ నరేష్, కార్యదర్శి బొమ్మ శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి బండ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట మండలంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలి

బిజెపి మండల అధ్యక్షుడు దొంతరవేన రమేష్ యాదవ్

బిజెపి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం



**జమ్మికుంట, ఆగస్టు 21 (సింగిడి) :** జమ్మికుంట మండలంలోని మానేరు పరివాహక ప్రాంతంలో ఇసుక రీచ్ ను ఏర్పాటు చేసి మండల ప్రజలకు ఇసుక కొరత లేకుండా చేయాలని కు వినతి పత్రం అందించిన బిజెపి నేతలు. బిజెపి జమ్మికుంట మండల అధ్యక్షుడు దొంతరవేన రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఇసుక అందుబాటులో లేకపోవడంతో గృహ నిర్మాణ దారులు పడుతున్న ఇబ్బందుల గురించి తహసిల్దార్ కు విన్నవించారు. మానేరు పరివాహక ప్రాంతం నుండి ఇసుక సప్లై జరిగితే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణదారులతోపాటు గృహ నిర్మాణం చేసుకునే వారికి ఇసుక తక్కువ రేటుకు లభ్యమవుతుందని ఇక్కడ ఇసుక రీచ్ లేకపోవడం వల్ల రెండు వేల రూపాయలకు లభించే ఇసుక ?7,000 చెల్లించి లబ్ధిదారులు కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. జమ్మికుంట మండలంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయకపోతే బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని తాహసిల్దార్ కు తెలిపినట్లు మండలాధ్యక్షుడు రమేష్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజల నిత్య అవసరాలకు అవసరమయ్యే ఇసుక విషయంలో ప్రభుత్వం ఆలోచించి ఒక నిర్ణయం త్వరగా తీసుకోవాలని ఇసుక లభించక ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతోపాటు ప్రభుత్వం మంజూరు చేసిన ఎన్నో సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ బిజెపి మాజీ మండలాధ్యక్షుడు సోంపల్లి సంపత్ రావు సర్పంచులు కేవిడే కుమారస్వామి గరిగంటి శ్రీధర్ నాయకులు పుల్లూరి ఈశ్వర్ నాగపురి విజయ్ మల్లేష్ భీమిలి వెంకటేశ్వర్లు హరీష్ సమ్మయ్య లింగమూర్తి శ్రీనివాస్ ఆవుల తిరుపతి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపై మురుగు డ్రైనేజీ నీటితో.. కాలనీవాసుల అవస్థలు

**అల్వాల్, ఆగస్టు 21(సింగిడి):** అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని సాయిరెడ్డినగర్, గణేష్‌నగర్ ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో మురుకు డ్రైనేజీ నీరునిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెలరోజులుగాడ్రైనేజీ నీరు రోడ్లపై నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ సమస్యపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని కాలనీవాసులు పేర్కొన్నారు. రోడ్లపై మురుగునీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడటంతో పాటు, దోమల బెడద కూడా పెరిగిందని వారు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీవాసులు అన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, మురుగునీటి నిల్వకు కారణాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.



## శ్రీ మహాశక్తి దేవాలయంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం

వేలాదిగా తరలివచ్చిన మహిళా భక్తులు, ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన



**కరీంనగర్, ఆగస్టు 21(సింగిడి):** చైతన్యపురిలోని శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లు కొలువైన శ్రీ మహాశక్తి దేవాలయంలో వరలక్ష్మీ వ్రత వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయం మహిళా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 7.30 గంటలకు అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు నిర్వహించి మహాహారతి ఇచ్చారు. సాయంత్రం 6.30 గంటలకు వరలక్ష్మీ వ్రతం, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామివారి ఆశీస్సులతో వేడుకలను నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రాంగణాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని వరలక్ష్మీ వ్రతంలో పాల్గొంటే సకల సంపదలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులు కలుగుతాయని భక్తుల విశ్వాసం. దీంతో పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా మహిళలు, భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## నిరుపయోగంగా ఉన్న ఎఫ్ఎఫ్‌డి ఫామ్‌ను లీజుకు ఇప్పించండి

మంత్రి వాకిటి శ్రీహరికి వినతి



**జమ్మికుంట, ఆగస్టు 21 (సింగిడి) :** కరీంనగర్ లో నిరుపయోగంగా ఉన్న ఎఫ్ ఎఫ్ డి ఫామ్ ను చేప పిల్లల పెంపకం కొరకు లైవ్ ఫిష్ సెంటర్ ను నడుపుకోవడానికి లీజుకు కేటాయించాలని మంత్రికి వినతిపత్రం అందించిన ఫిషరీస్ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ బండి మల్లేష్. శుక్రవారం హైదరాబాదులోని మినిస్టర్ క్వార్టర్స్ లో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించినట్లు మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ బండి మల్లేష్‌తో పాటు వీణవంక మండల ఫిషరీస్ చైర్మన్ ఎలవేణి సదయ్య ముదిరాజ్ పాల్గొన్నారు.

ప్రభాతవర
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం
22-8-2026

# నేర నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి

- కాళేశ్వరం జోన్ డీఐజీ అంబర్ కిశోర్ ఝా
- కొయ్యూరు, మహాదేవపూర్ పోలీస్ కార్యాలయాల్లో డీఐజీ వార్షిక తనిఖీలు





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 21 (సింగిడి):** వార్షిక తనిఖీల్లో భాగంగా కాళేశ్వరం జోన్ డీఐజీ అంబర్ కిశోర్ ఝా భూపాలపల్లి జిల్లాలోని కొయ్యూరు పోలీస్ స్టేషన్, మహాదేవపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాలను సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, డీఐజీకి స్వాగతం పలికారు. తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, మాల్ఖానా, ఆయుధాగారం, వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది టర్నౌట్, క్రమశిక్షణ, యూనిఫాం నిర్వహణ తదితర అంశాలను డీఐజీ పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి విధి నిర్వహణ, పనితీరు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. అనంతరం సీసీటీవీ కెమెరాల పనితీరును పరిశీలించి, నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు సీసీటీవీ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన, జవాబుదారీతనంతో కూడిన పోలీస్ సేవలు అందించడం ప్రతి పోలీస్ అధికారి బాధ్యత అని డీఐజీ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, విజిబుల్ పోలీసింగ్, నిఘా పెట్రోలింగ్, కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ దర్యాప్తు, సోషల్ మీడియా మానిటరింగ్ అంశాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించడంతో పాటు నేరస్తుల కంటే ఒక అడుగు ముందుండేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియంత్రణతో పాటు రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగించాలని డీఐజీ ఆదేశించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొయ్యూరు పోలీస్ స్టేషన్, మహదేవపూర్ సీఐ కార్యాలయ ఆవరణలో డీఐజీ అంబర్ కిశోర్ ఝా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జునరావు, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థిని గాయాలు పాలు చేసిన పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి

**యుఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాజేష్ నాయక్**



**హన్మకొండ, ఆగస్టు 21 (సింగిడి):** విద్యార్థిని గాయాలపాలు చేసిన పాఠశాల యాజమాన్యంపై కేసు చేయాలని యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేష్ నాయక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లాలో ఉన్న విద్యాధరి పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న మైకేల్ అనే విద్యార్థినీ రోజువారీగా పాఠశాలకు వెళ్లిన సందర్భంలో తరగతి గదిలో విద్యార్థికి చేతికి తీరమైన గాయమై ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చేర్పించి సర్జరీ ద్వారా విద్యార్థి యొక్క ప్రాణాలను డాక్టర్లు కాపాడడం జరిగిందన్నారు. ఈ సంఘటన పై జిల్లా విద్యాధికారికి అదేవిధంగా బాలల సంరక్షణ కమిటీ (సిడబ్ల్యూసి) కమిటీ కి ఫిర్యాదు చేయడం జరిగిందనీ రాజేష్ నాయక్ పేర్కొన్నారు. ఈ సంఘటనపై కమిటీ పూర్తిస్థాయి విచారణ జరిపి పాఠశాల యాజమాన్యం,తల్లిదండ్రులను పిలిచి పూర్తిస్థాయిలో ఎంక్వయిరీ నిర్వహించడం జరిగిందనీ రాజేశ్ తెలిపారు. అనంతరం జిల్లా కార్యదర్శి రాజేష్ నాయక్ మాట్లాడుతూ విద్యాధరి పాఠశాలలో విద్యార్థుల పట్ల పాఠశాల యాజమాన్యం అందులో పని చేస్తున్న ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఈ సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి పాఠశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా యజమాన్యానికి ఫీజులు వసూలు చేసే దానిపై ఉన్న శ్రద్ధ విద్యార్థులపై లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. విద్యార్థికి ఘటన జరిగితే కనీసం విద్యాధికారి కూడా చెప్పకుండా సీసీ కెమెరాలు అధికారులకు అందించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. జరిగిన ఘటనపై సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రాజేష్ నాయక్ హెచ్చరించారు.

## బెటర్ సిటీస్' పోస్టర్ ఆవిష్కరణ



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 21 (సింగిడి):** జాతీయ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మేరా షహర్, మేరా హక్ మెహనత్ కే హాత్" నినాదాలతో చేపట్టిన బెటర్ సిటీస్ప్రచారంలో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో బెటర్ సిటీస్పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత, పట్టణాల అభివృద్ధి, మెరుగైన మౌలిక వసతుల కోసం చేపడుతున్న కార్యక్రమాలను నాయకులు వివరించారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, నల్లగొండ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ కార్పొరేటర్ మామిడి కార్తీక్, నల్లగొండ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి నాగరాజు, మండల అధ్యక్షుడు కె. వి. ఆర్. సతీష్, కంచర్ల ఆనంద్‌రెడ్డితో పాటు పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడొద్దు

జీవో నం. 97ను వెంటనే రద్దు చేయాలి



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 21 (సింగిడి):** పాలిటెక్నిక్ విద్యార్థులతో ప్రభుత్వం చెలగాటమాగుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మం పాటి శంకర్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను రాష్ట్ర వ్యాప్తంగా బంద్ లో భాగంగా నల్గొండ లో పాలిటెక్నిక్ కళాశాల బంద్ విజయవంతం చేయడం జరిగింది. మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో తీసుకువస్తున్న విధానాల ద్వారా పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులను ఐఐటి -- ఏటీసీ లతో అనుసంధానం చేయడం విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే నిర్ణయమని అన్నారు. పాలిటెక్నిక్ విద్య అనేది ప్రత్యేకమైన సాంకేతిక విద్యా వ్యవస్థ అని, దాని ప్రమాణాలను మరింత పెంచాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా డిప్లమా కోర్సులను ఇతర శిక్షణా కోర్సులతో అనుసంధానం చేయడం సరికాదని వారు అన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షం లో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల తో వారి జీవితాలతో చెలగాటం ఆడడం దుర్మార్గం తక్షణమే ముఖ్యమంత్రి గారు పాలిటెక్నిక్ కళాశాల లను స్కిల్ యూనివర్సిటీలుగా మార్చాలనే నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే మా పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నల్లగోండ డివిజన్ కార్యదర్శి మారుపాక కిరణ్, ముస్కు రవిందర్ నవదీప్,వేణు,బాను భరత్,కార్తీక్, మనోజ్ చరణ్ సాయి, తేజ విద్యార్థులు పాల్గొన్నారు.

## భాగ్యనగర్ కాలనీలో పాముల బెడద



**రాజేంద్రనగర్, ఆగస్టు 21 (సింగిడి):** రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగిర్ హైదర్ షాకోట్ డివిజన్ భాగ్యనగర్ కాలనీలో స్మశాన వాటిక ప్రాంతంలో చెట్లు పొదలతో కమ్ముకొని ఉండడంతో విష సర్పాలు ఇండ్లలోకి వస్తున్నాయని భాగ్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి ఎస్ గోపాల చారి ప్రధాన కార్యదర్శి విశ్వనాథం కలిసి గురువారం జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి కి వినతి పత్రాన్ని అందించారు. స్మశాన వాటిక ప్రాంతంలో ఉన్న చెట్ల పొదలను తొలగించి విష సర్పాల బెడద నుండి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ కమిషనర్ స్పందిస్తూ తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

# కాజీపేటలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

**ఎసీ ఆర్ జీఎంను కలిసి వినతిపత్రం అందజేసిన వరంగల్ ఎంపీ కడియం కావ్య**



**హన్మకొండ, ఆగస్టు 21 (సింగిడి):** కాజీపేట కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య గురువారం సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే కార్యాలయంలో జనరల్ మేనేజర్‌ను స్వయంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కాజీపేట డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను, ఈ ప్రాంతానికి ఉన్న రైల్వే ప్రాధాన్యతను జీఎంకు వివరించారు. కాజీపేట జంక్షన్ దక్షిణ మధ్య రైల్వేలో అత్యంత కీలకమైన జంక్షన్‌గా ఉన్నప్పటికీ, దానికి తగిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని వరంగల్ ఎంపీ పేర్కొన్నారు. కాజీపేట కేంద్రంగా ప్రత్యేక రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉందని, రైల్వే ఉద్యోగులు, ప్రయాణికులు, రైల్వే వినియోగదారులు కూడా ఈ డిమాండ్‌ను కోరుతున్నారని ఆమె తెలిపారు. ఇటీవల రైల్వే జోన్లు, డివిజన్ల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో కాజీపేట డివిజన్ అంశాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తరైల్వే జోన్, డివిజన్ల ఏర్పాటు జరుగుతున్న సమయంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కాజీపేటను ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేస్తే పరిపాలనా సామర్థ్యం పెరగడంతో పాటు రైల్వే కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని వివరించారు. రైల్వే ఆదాయంలో కాజీపేట ప్రాంతానికి కీలకమైన వాటా ఉందని ఎంపీ తెలిపారు. బల్లార్షా--కాజీపేట, కాజీపేట--విజయవాడ, కాజీపేట -- కరీంనగర్, డోర్నకల్--మణుగూరు తదితర రైల్వే మార్గాలు సరుకు రవాణాకు ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయని చెప్పారు. బొగ్గు, సిమెంట్, బియ్యం, మిర్చి, గ్రానైట్, ఎరువులు తదితర సరుకుల రవాణాకు ఈ ప్రాంతంలో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్‌పై రైల్వే ట్రాఫిక్‌తో పాటు పరిపాలనా భారం కూడా పెరుగుతోందని, ఈ నేపథ్యంలో కాజీపేటను కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేస్తే పనిభారం సమతుల్యం అవడంతో పాటు ఈ ప్రాంత రైల్వే అభివృద్ధికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు వరంగల్ ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్ అని, దీనిపై రైల్వే శాఖ సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఎంపీ జీఎంను కోరారు. కాజీపేట డివిజన్ ఏర్పాటుకు సంబంధించి అవసరమైనప్రతిపాదనలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కాజీపేట డివిజన్ ఏర్పాటుతో వరంగల్--కాజీపేట ప్రాంతంలో రైల్వే మౌలిక వసతులు, ప్రయాణికుల సౌకర్యాలు, సరుకు రవాణా మరింత అభివృద్ధి చెందడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని ఎంపీ పేర్కొన్నారు.

## బహిరంగ చర్చ వేదికను విజయవంతం చేయాలి



- తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో ఆగస్టు 21 (సింగిడి):** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు అంశంపై ఈ నెల 23న హనుమకొండలోని వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న బహిరంగ చర్చ వేదికను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ పిలుపునిచ్చారు. భూపాలపల్లిలోని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయం 'బాతాల రాజ్ భవన్'లో బహిరంగ చర్చ వేదికకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీక కిరణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపు అంశంపై ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు చైర్మన్‌గా ఉద్యమకారుల కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఉదయం 11 గంటలకు బహిరంగ చర్చ వేదిక నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి టీపీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాచమౌని నాగభూషణం అధ్యక్షత వహించనున్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ సబావత్ రాములునాయక్, ఉద్యమకారుల కమిటీ సభ్యుడు శోభన్‌రెడ్డి, ప్రొఫెసర్ చింతకింది కాసిం, టీపీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంథని సంజీవరావు, తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, పీకేఎం రాష్ట్ర అధ్యక్షుడు దండం జాను తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని కిరణ్ తెలిపారు. కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామర గట్టయ్య, టీపీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాస్ పార్వతి, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు రాదండి దేవేందర్, తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఐత బాపు, తెలంగాణ రైతు పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ దాసరి రమేష్, సమ్మయ్య పాల్గొన్నారు.

# వయో వృద్ధులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 21 (సింగిడి):** వయోవృద్ధులకు మెరుగైన వసతి మౌలిక వసతులు కల్పించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. చౌటుప్పల్ మండలం పెద్ద కొండూర్ గ్రామ పరిధిలో ప్రభుత్వ అనుబంధంతో, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాయి యాదాద్రి సేవాశ్రమాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో ప్రస్తుతం ఎంతమంది వృద్ధులు ఉంటున్నారని , వారికి కల్పిస్తున్న వసతులు, ప్రతిరోజూ అందిస్తున్న భోజన సదుపాయాలపై ఆరా తీశారు. వృద్ధుల ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కోసం ప్రతిరోజూ వ్యాయామం చేయించడం, జరుగుతుందా అని,క్యారమ్స్, వివిధ ఆటలు ఆడించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ అభినందించారు. వృద్ధుల ఆరోగ్యంతో పాటు వారి మానసిక ఆనందానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వృద్ధులను అప్పుడప్పుడు విహారయాత్రలు, పర్యటనలకు తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. వయస్సు పైబడిన వారికి ఇలాంటి పర్యటనలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతో పాటు ఆత్మసంతృప్తిని అందిస్తాయని తెలిపారు. వారి పట్ల ఆప్యాయత, ఆదరణ చూపుతూ కుటుంబ సభ్యుల మాదిరిగా చూసుకోవాలని సూచించారు. ఆశ్రమానికి ప్రభుత్వం పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆశ్రమంలోని వృద్ధులకు కలెక్టర్ పండ్లు పంపిణీ చేసి, వారితో ఆప్యాయంగా మాట్లాడారు,వారి ఆరోగ్యం, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వృద్ధుల సంక్షేమం కోసం సేవాశ్రమం నిర్వాహకులు చేస్తున్న సేవలను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమం లో చౌటుప్పల్ రెవిన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి,శిశు సంక్షేమ అధికారి శ్రీనివాస్, సాయి సేవా నిర్వాహకులు అశోక్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


# రైతులకు24 గంటలు విద్యుత్ అందించాలి

- కాలిపోయిన బోరు మోటర్లు, ఎండిన వరితో నిరసన
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య




**నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 21 (సింగిడి):** రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు నల్లగొండ విద్యుత్ ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, లో-వోల్టేజ్ కారణంగా బోరు మోటర్లు కాలిపోతుండగా, విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులకు కోతలు లేని 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. మోటర్లు కాలిపోవడం, పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. లో-వోల్టేజ్‌తో దెబ్బతిన్న మోటర్లకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా మంత్రులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సమస్య విద్యుత్‌లో మాత్రమే లేదు.. పాలనలోనే శక్తి లేదు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శించారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని విద్యుత్ సరఫరాను మెరుగుపరిచి లో-వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశాయి.


## నాణ్యమైన విద్య.. ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యం



**నూతనకల్, ఆగస్టు 21 (సింగిడి):** పిల్లల సర్వతోముఖాభివృద్ధికి కావాల్సిన నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలోని లభిస్తుందని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోని చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని గురువారం నూతనకల్ పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సంఖ్య 101 చేరిన సందర్భంగా ఉద్దేశించి మండల విద్యాధికారి రాములు నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అనేక రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని ఎన్నో ప్రయోజనాలు న్న ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అడ్మిషన్ల సంఖ్య పెరగడానికి ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## సాంకేతిక రంగాల మూలపురుషుడు రాజీవ్ గాంధీ

**నల్గొండ డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత**



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 21 (సింగిడి):** సాంకేతిక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని దివంగత నేత రాజీవ్ గాంధీ అని నల్లగొండ డిసిసి అధ్యక్షులు పున్న కైలాస్ నేత అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82 వ జయంతి పురస్కరించుకొని నల్గొండ జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్ లో వారి చిత్ర పటానికి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు దేశం ఆర్థికంగా,శాస్త్ర,సాంకేతికంగా పురోగమించడానికి రాజీవ్ గాంధీ కృషి చేశాడని కొనియాడారు టెలిఫోన్,కంప్యూటర్ లాంటి ఆధునిక సాంకేతిక రంగాలను భారత్ లో ప్రవేశపెట్టి దేశ అభివృద్ధికి పాటుపడిన గొప్ప నేత అని అన్నారు. 21 సంవత్సరాలకు ఉన్న ఓటు హక్కును 18 సంవత్సరాలు చేసి యువతను దేశ రాజకీయాల్లో భాగస్వామ్యం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. దేశం కోసం బలి ధనం చేసిన రాజీవ్ గాంధీని దేశం ఎప్పటికీ మరువబోదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు జిల్లాపల్లి పరమేష్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు చింత యాదగిరి,జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ముంతాజ్ అలీ,జిల్లా ప్రధాన కార్యదర్శి దొండ రమేష్,జిల్లా కార్యదర్శి దామనూరి అశోక్, పగిళ్ల రాజు,చర్లపల్లి గౌతమ్,పళ్ళ రవితేజ, ఎండి అజీజ్, మట్టపల్లి నాగరాజ్, శ్రీనివాస్,వేముల గోపీనాథ్,ఇందనూరి శ్రీను, బోడఅరుణ్, జమ్ముఅశోక్, లింగస్వామి,యాదగిరి, మాచగిరి,గణపురం మహేష్,పున్న గణేష్, కత్తుల గణేష్, అనిల్ కుమార్,నల్లబోతు శంకర్, అకంటి సైదులు, యశ్వంత్, రాజేష్, బాలకృష్ణ,పులుసు నాగార్జున,సచిన్, వినీత్, శరత్, బోడ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# భార్యకు పదవి.. భర్తకు పెత్తనం!

- పంచాయతీ వ్యవహారాల్లోనూ భర్తల జోక్యం




**కోదాడ,ఆగస్టు 21 (సింగిడి):** పదవి భార్యకు.. పెత్తనం భర్తకు అన్నట్లుగా అనంతగిరి మండల వ్యాప్తంగా పరిస్థితి మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహిళా రిజర్వేషన్ కింద సర్పంచ్‌లుగా ఎన్నికైన మహిళలకు బదులుగా వారి భర్తలే ప్రభుత్వ కార్యక్రమాలు, గ్రామపంచాయతీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో మహిళా రిజర్వేషన్ ఉద్దేశమే ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు. గతంలో మండలంలోని ఓ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను సర్పంచ్ హోదాలో ఓ సర్పంచ్ భర్తే తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించినట్లు స్థానికులు చెబుతున్నారు. తాజాగా అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పర్యవేక్షణ కమిటీ సమావేశంలోనూ సర్పంచ్ చైర్మన్ స్థానంలో భర్త కూర్చోవడం చర్చనీయాంశమైంది. కమిటీ సభ్యులైన మహిళలను పక్కనపెట్టి నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచ్‌ల భర్తలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు పంచాయతీ వ్యవహారాల్లోనూ జోక్యం చేసుకుంటున్నారని గ్రామస్తులు అంటున్నారు. అధికారులతో మాట్లాడటం, గ్రామ సమస్యలపై నిర్ణయాలు తీసుకోవడం వంటి వ్యవహారాల్లోనూ వారే ముందుండటంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఇచ్చిన రిజర్వేషన్ పదవుల్లో భర్తల పెత్తనం కొనసాగితే దాని ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండల వ్యాప్తంగా పరిస్థితిని పరిశీలించి, సర్పంచ్‌ల భర్తల జోక్యానికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

# కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన వారికి అండగా ఉంటా..

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, ఆగస్టు 21 (సింగిడి):** కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసే వారికీ అండగా ఉంటా, వారికే వారికే నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తానని బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ ఎస్పీ కన్వెన్షన్ లో రాజీవ్ గాంధీ ఘనంగా జయంతి వేడుకలు, సర్ కార్యక్రమం విజయవంతానికి కృతజ్ఞత సభ మిర్యాలగూడ నియోజకవర్గం మండలాల, పట్టణ కాంగ్రెస్, అనుబంధ సంఘాల బాధ్యులు, కార్యకర్తల సమావేశం లో మాట్లాడుతూ రానున్న డిసెంబర్ 9కి అన్ని నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పిస్తానని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు ఇబ్బంది పడకుండ కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ, బిఎల్ఆర్ అంటే ఏమిటో చేసి చూపెడ్తానన్నారు. ఇదే ఐక్యత కొనసాగించి పార్టీ బలోపేతంకు కృషి చేయాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు రాష్ట్రప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర శాసనమండలి సభ్యులు, చీఫ్ విప్, సర్ ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్చార్జ్ బల్మూరు వెంకట్ అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. గత పాలనలో బిఆర్ఎస్ పార్టీ వారి కార్యకర్తలకే రుణాలుఇచ్చుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అలాకాదని, పార్టీలకు సంబంధం లేకుండా బడుగు బలహీన వర్గాలకు, అర్హులైన ప్రతి ఒక్కరికి రుణ అవకాశం, ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ అభివృద్ధి పథకాలను ఇస్తుందన్నారు. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలో ప్రతి గ్యారంటీ అమలు చేశామని, చేస్తున్నామన్నారు. మొదటి దశలో ఎస్ఐఆర్ లో అసలు ప్రక్రియ 30,000 ఓట్లు సక్రమంగా లేవని, పక్కన పెట్టారని 25,000 ఇతర కారణాలు చూపి పక్కన పెట్టారని నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ కో ఆర్డినేటర్ కస్ప శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల సంఘం బిజెపికి అనుబంధ సంస్థగా మారిందని ఆయన ఆరోపించారు. రాజీవ్ గాంధీ విడియో విజ్వల్ ను డిసిసి అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత ఆవిష్కరించి మాట్లాడుతూ బ్రిటిష్ వారికీ తొత్తులు బిజెపి పూర్వీకులు అన్నారు. నిజమైన దేశభక్తుల పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటేష్, రాష్ట్ర నాయకులు దిరావత్ స్కైలాబ్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల సైదులు, పొదిలే శ్రీనివాస్, జిల్లా నాయకులు మహబూబ్ అలీ, చిలుకూరి బాలకృష్ణ గుడిపాటి నవీన్, నూకల వేణుగోపాల్ రెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జి. మాధవి, ఒన్, టూ టౌన్ అధ్యక్షులు కె. ఇంద్రకుమార్, ఎండి. హమీదుద్దీన్ (మొయిజ్), యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు అజరుద్దీన్, కౌన్సిలర్ ఫారూఖ్, ఆరిఫ్, కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు, పాల్గొన్నారు.




# ఆరోగ్యంగా ఉండాలంటే..

నేటి బిజీ జీవితంలో శారీరక కదలికలు తగ్గిపోవడంతో ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అయితే, ప్రతిరోజూ కేవలం 10-15 నిమిషాలు కేటాయించి, సులభమైన యోగాసనాలు వేయడం ద్వారా శరీరాన్ని ఆరోగ్యంగా, చురుకుగా ఉంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.



శరీరంలోని అవయవాలు సరిగా పనిచేయాలంటే రక్త ప్రసరణ సక్రమంగా ఉండాలి. అయితే నేటి బిజీ జీవనశైలిలో చాలా మంది శారీరక కదలికలు తగ్గించడంతో రక్త ప్రసరణ మందగిస్తుంది. దీని వల్ల గుండె సమస్యలు సహా అనేక ఆరోగ్య సమస్యలు రావచ్చు. కానీ కొన్ని యోగాసనాలను ప్రతిరోజూ చేస్తే రక్త ప్రసరణను మెరుగుపరచవచ్చు.



**సర్వాంగాసనం**
సర్వాంగాసనం (భుజాల మీద నిలబడే ఆసనం) అనేది మొత్తం శరీరానికి ప్రయోజనం చేకూర్చే ఒక శక్తివంతమైన విలోమ యోగాసనం. ఇది థైరాయిడ్ గ్రంథిని ఉత్తేజపరచడం, రక్త ప్రసరణను, జీర్ణక్రియను మెరుగుపరచడం, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది.




**ఉష్ట్రాసనం**
ఈ ఆసనం రక్త ప్రసరణను పెంచి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. వెన్నునొప్పి, ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. మోకాళ్లపై కూర్చుని వెనక్కి వాలి చేతులతో చీలమండలను పట్టుకోవాలి. ఛాతిని పైకి ఎత్తి 10--20 సెకన్లు ఉండాలి. తర్వాత మెల్లగా కూర్చోవాలి.



**అధో ముఖ శ్వానాసనం**
ఈ ఆసనం తలకు రక్త ప్రసరణను పెంచుతుంది. అలసట తగ్గించి వెన్నెముకను బలపరుస్తుంది. మోకాళ్లపై నిలబడి, చేతులు నేలపై ఉంచి తుంటిని పైకి ఎత్తాలి. శరీరం 'ఎ' ఆకారంలో ఉండాలి.

**త్రికోణాసనం**
ఈ ఆసనం శరీరానికి సమతుల్యత ఇస్తుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది, శరీర భంగిమ కూడా సరిగా ఉంటుంది. పాదాలను దూరంగా ఉంచి నిలబడి, ఒక వైపు వంగి ఒక చేతిని కాలి వద్ద ఉంచి, మరో చేతిని పైకి ఎత్తాలి.




**విపరీత కరణి**
ఇది చాలా సులభమైన ఆసనం. కాళ్లను గోడకు ఆనించి పైకి ఎత్తి పడుకోవాలి. రక్త ప్రసరణ మెరుగుపడటంతో పాటు ఒత్తిడి తగ్గుతుంది. నిద్రలేమికి కూడా ఉపయోగపడుతుంది.

**జాగ్రత్తలు**
అధిక రక్తపోటు, గుండె సమస్యలు ఉన్నవారు ముందుగా వైద్యుడిని సంప్రదించాలి. గర్భిణీలు ఈ ఆసనాలు చేయకూడదు. మెడ లేదా కంటి సమస్యలు ఉన్నవారు నిపుణుల సలహా తీసుకోవాలి.
ఈ యోగాసనాలను క్రమం తప్పకుండా చేస్తే రక్త ప్రసరణ మెరుగై శరీరం ఆరోగ్యంగా ఉంటుంది.

## స్టాక్ మార్కెట్
Stock Market

### ఏడు రోజుల నష్టాలకు బ్రేక్..

భారీ లాభాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. దీంతో వరుసగా ఏడు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. గురువారం సెషన్‌లో సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అమెరికా బాండ్ల రాబడులు తగ్గడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. విదేశీ మదుపర్ల పెట్టుబడులు కలిసొచ్చాయి. రియాల్టీ, ప్రైవేట్ బ్యాంక్, ఐటీ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ ఉదయం 77,468.45 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,909.68) లాభాల్లో ప్రారంభ మైంది. రోజంతా సూచీ లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,611.11 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 628.04 పాయింట్ల లాభంతో 77,537.72 వద్ద ముగిసింది. నిఫ్టీ 153.55 పాయింట్లు పెరిగి 24,231.85 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.71గా ఉంది. సెన్సెక్స్ 30లో టైటాన్, హెచ్‌సీఎల్, ఇండిగో, టాటా స్టీల్ కంపెనీ షేర్లు తప్ప మిగతా కంపెనీల షేర్లన్నీ లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 93.94డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,490.60 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ మార్కెట్ సూచీలు కూడా లాభాల్లోనే ట్రేడయ్యాయి.

## గోల్డ్ లోన్ రంగంలోకి ఆదిత్య బిర్లా కంపెనీ



బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ ఆదిత్య బిర్లా క్యాపిటల్ బంగారం రుణాల వ్యాపారంలోకి అడుగు పెడుతోంది. రాబోయే 3 ఏళ్లలో మొత్తం 1,000 బంగారు రుణాల శాఖలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2027 చివరి నాటికి తొలిదశలో భాగంగా 300 శాఖలు ప్రారంభిస్తా మని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. దేశంలో బంగారు రుణాలు బలమైన వృద్ధిని నమోదుచేస్తున్నాయని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాకేశ్ సింగ్ తెలిపారు. వ్యూహాత్మక ప్రణాళికలో భాగంగా ఈ రంగంలోకి అడుగు పెడుతున్నట్లు తెలిపారు. పట్టణాల్లో, నగరాల్లో మార్కెట్‌ను విస్తరిస్తామని తెలిపారు. డిజిటల్ ప్లాట్‌ఫాం, రిటైల్ స్టోర్‌లలో బంగారు రుణాలు కొత్త వినియోగదా రులకు అందుబాటులో ఉంటాయని అన్నారు.

**గూగుల్ ఆఫర్:**
కాలేజీ విద్యార్థులకు ఏడాది పాటు 'ఏఐ ప్లస్' ఫ్రీభౌగోళిక పరిస్థితుల కారణంగా బంగారానికి డిమాండ్ పెరిగిందని, సురక్షిత పెట్టుబడిగానూ మారిందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. అందుకే ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలు బంగారు రుణాల వ్యాపారం వైపు మొగ్గు చూపుతున్నాయని అభిప్రాయవ డ్డారు. బంగారు రుణాలను చెల్లించి తిరిగి బంగారాన్ని పొందొచ్చు అనే నమ్మకం రుణగ్రహీతల్లో పెరగడంతో గోల్డ్ లోన్‌లకు డిమాండ్ పెరిగిందని అన్నారు. జూన్ 2026 నాటికి ఎన్‌బీఎఫ్‌సీల బంగారు రుణాల పోర్ట్‌ఫో లియో 69.3 శాతం వృద్ధి పెరిగి రూ. 3.42 లక్షల కోట్లకు చేరింది.

## కాలేజీ విద్యార్థులకు ఏడాది పాటు 'ఏఐ ప్లస్' ఫ్రీ



ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ భారతీయ కాలేజీ విద్యార్థులకు శుభవార్త చెప్పింది. 'గూగుల్ ఏఐ ప్లస్' సబ్‌స్క్రిప్షన్‌ను ఏడాది పాటు ఉచితంగా అందించనున్నట్లు ప్రకటించింది. గూగుల్ ఏఐ అసిస్టెంట్, సెర్చ్ ద్వారా ఎడ్యుకేషనల్ టూల్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొంది. అమెరికాలోని కాలేజీ విద్యార్థుల కోసం గూగుల్ ఏఐ ప్రో ప్లాన్‌ను ఉచితంగా అందిస్తుండగా.. ఇప్పుడు భారతీయ కాలేజీ విద్యార్థుల కోసం 'గూగుల్ ఏఐ ప్లస్'ను ఏడాది పాటు ఉచితంగా తీసుకురానుంది. జీ-మెయిల్, డాక్స్‌లో జెమినై సేవలు లభించనున్నాయి. రీసెర్చ్, అనాలసిస్ కోసం నోట్‌బుక్ ఎల్ఎమ్ కూడా వాడుకోవచ్చు. దీంతో పాటు ఫొటోలు, డ్రైవ్, జీమెయిల్ కోసం 400 +దీ స్టోరేజీని ఉచితంగా పొందొచ్చు. సాధారణంగా గూగుల్ ఏఐ ప్లస్ సబ్‌స్క్రిప్షన్ ధరను నెలకు రూ. 399గా (ఏడాదికి రూ. 4,788) కంపెనీ నిర్ణయించింది.

**స్టూడెంట్స్ కోసం 'ఐకూ జెడ్ 11'.. 32ఎంపీ సెల్ఫీ కెమెరా, ఏఐ ఫీచర్లు..**
గూగుల్ ఏఐ ప్లస్‌లో భాగంగా స్టడీ నోట్‌బుక్స్, ఫ్లాష్‌కార్డులను క్రియేట్ చేయడం, ప్రాక్టీస్ క్విజ్‌లు వంటి ఇతర సదుపాయాలను గూగుల్ కల్పిస్తుంది. జెమినై లైవ్ కూడా అందుబాటులో ఉంటుంది. విద్యార్థులకు గూగుల్ ఏఐ ప్రో, యూట్యూబ్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌పై 70 శాతం డిస్కౌంట్‌ను కూడా ఆఫర్ చేస్తోంది. గూగుల్ ఏఐ ప్రో సబ్‌స్క్రిప్షన్‌తో యూట్యూబ్ ప్రీమియం లైట్ కూడా పొందొచ్చు. అర్హత కల్గిన విద్యార్థులు పర్సనల్ గూగుల్ అకౌంట్‌తో గూగుల్ వన్‌లో సైన్ అప్ కావొచ్చు. విద్యార్థుల అర్హతను గూగుల్ాష్ట్రవవతీ×ఱ ప్లాట్‌ఫామ్ ద్వారా వెరిఫై చేయనుంది.

ప్రభాతనవ సింగిడి
SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం



### ఉత్తన్నూర్ పాఠశాలలో విద్యార్థులకు

# రక్త గ్రూప్, హీమోగ్లోబిన్ పరీక్షలు



**గద్వాల ప్రతినిధి (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని ఉత్తనూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం రక్త గ్రూప్, హీమోగ్లోబిన్ పరీక్షా కార్యక్రమం నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంజీవని మొబైల్ మెడికల్ యూనిట్, భవిష్య భారత్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పవన్‌కుమార్ రెడ్డి భవిష్య భారత్ సంస్థ లక్ష్యాలు, సేవా కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధతో పాటు నివారణాత్మక ఆరోగ్య సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇందు మైత్రి రక్త గ్రూప్ తెలుసుకోవడం, హీమోగ్లోబిన్ ప్రాధాన్యతను వివరించారు. సమతుల్య పోషకాహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రక్త గ్రూప్ గుర్తింపు, హీమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. హెడ్‌మాస్టర్ సోమశేఖర్ రెడ్డి, శివ శంకర్ రెడ్డి, బయో–సైన్స్ ఉపాధ్యాయుడు వీరన్న కార్యక్రమాన్ని అభినందించారు. పాఠశాల తరపున భవిష్య భారత్ సంస్థకు వారు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్య భారత్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా జరిగిందని పేర్కొన్నారు.

# రైల్వే సమస్యల పరిష్కారానికి జీఎంను కలిసిన ఖమ్మం ఎంపీ రఘురామ్ రెడ్డి



**ఖమ్మం ప్రతినిధి (సింగిడి):** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో నెలకొన్న రైల్వే సమస్యల పరిష్కారానికి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి చర్యలు చేపట్టారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను సికింద్రాబాద్‌లో కలిసి జిల్లాలకు సంబంధించిన పలు కీలక రైల్వే అంశాలపై చర్చించారు. ఖమ్మం రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను వేగవంతం చేయడంతో పాటు, కోవిడ్ సమయంలో నిలిచిపోయిన రైళ్లను పునరుద్ధరించాలని ఎంపీ కోరారు. మధిర, తడికలపూడి వంటి ప్రాంతాల్లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్‌లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ పేరును భద్రాద్రి కొత్తగూడెం లేదా కొత్తగూడెం రైల్వే స్టేషన్‌గా మార్చాలని కోరారు. శ్రీరాముడు కొలువైన భద్రాచలం వరకు రైల్వే లైన్‌ను పూర్తి చేసి, భద్రాద్రి కొత్తగూడెం నుంచి తిరుపతికి 'భద్రాద్రి ఎక్స్‌ప్రెస్'ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. డోర్నకల్––మిర్యాలగూడ రైల్వే లైన్‌ను సారవంతమైన వ్యవసాయ భూములకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గంలో చేపట్టాలని సూచించారు. కారేపల్లి, గాంధీపురం ప్రాంతాల్లో ఆర్వోబీల నిర్మాణం, అగ్రహారం వద్ద అసంపూర్తిగా ఉన్న అండర్‌పాస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఖమ్మం నగరంలోని కస్బాబజార్––గాంధీచౌక్ ప్రాంతంలో వరద ముంపు సమస్య పరిష్కారానికి డ్రైనేజీ వ్యవస్థను విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని రైల్వే ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రైల్వే జీఎంను ఎంపీ రఘురాం రెడ్డి కోరారు.

### ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు



**కల్వకుర్తి (సింగిడి):** తలకొండపల్లి మండలంలోని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆదేశాల మేరకు తలకొండపల్లి మండలంలోనీ చౌదర్ గ్రామ పంచాయతీలోనీ జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో వాటర్ ట్యాంక్‌ను ప్రత్యేక పద్ధతిలో శుభ్రపరిచారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. మేరేగా భారతమ్మ గోపాల్, ఉప సర్పంచ్ జ్యోతి ప్రదీప్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు మహేష్ గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వర్షకాలం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి అని సూచించారు. ప్రతి ఒక్కరూ గ్రామంలోని తాగునీటి నిల్వ ట్యాంకును ఆధునిక జర్మన్ టెక్నాలజీతో పూర్తిస్థాయిలో శుభ్రపరచడం వల్ల నీటి నాణ్యత మెరుగుపడి, ప్రజలకు ఆరోగ్యకరమైన తాగునీరు అందుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు తాగునీటి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందిస్తూ, ఎల్లప్పుడూ ఆయనకు రుణపడి ఉంటామని రానున్న రోజుల్లో ఆయనకు మా సహాయ సహకారాలు ఉంటాయని వారు అన్నారు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో కూడా నిర్వహించాలని ఐక్యత ఫౌండేషన్‌ను చైర్మన్ సుశీకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# సత్తుపల్లి అభివృద్ధికి మంత్రి పొంగులేటి శ్రీకారం

### కలెక్టర్ దివాకర్‌తో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



**సత్తుపల్లి, (సింగిడి):** సత్తుపల్లి పట్టణ అభివృద్ధిలో మరో ముందడుగు పడింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ ఐఏఎస్‌తో కలిసి గురువారం పట్టణంలో పలు అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శివసాయినగర్‌లో బహుళార్థ సాధక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, కలెక్టర్ దివాకర్ కలిసి ప్రారంభించారు. పట్టణ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను మరింత చేరువ చేయడంతో పాటు అత్యవసర సమయాల్లో సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని అధికారులు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, వైద్య సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని నాయకులు పేర్కొన్నారు. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం, కమల్ పాషా, డీఎంహెచ్‌ఓ, అడిషనల్ డీఎంహెచ్‌ఓ, హెల్త్ ఈఈ, గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అవినాష్, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ నరసింహ, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కౌన్సిలర్ తోట సుజలారాణి గణేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఫేజ్–2పై బిఎల్‌ఎలకు సూపర్‌వైజర్లకు శిక్షణ

### శాంతినగర్‌లో అలంపూర్ నియోజకవర్గ బిఎల్‌ఎల సమావేశం

**గద్వాల ప్రతినిధి (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని బి ఎల్ ఎలు, సూపర్‌వైజర్లకు ఎస్ ఐ ఆర్ ఫేజ్–2పై శిక్షణ కార్యక్రమాన్ని శాంతినగర్ క్యాంపు కార్యాలయంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గత నెల రోజులుగా ప్రతి బూత్‌లో బిఎల్‌ఎలు కీలకంగా పని చేస్తున్నందుకు వారిని నాయకులు అభినందించారు. ఎస్ఐఆర్ మొదటి విడత అనంతరం ఫేజ్–2లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, నింపాల్సిన ఫారాలు, పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఓటర్ల వివరాల పరిశీలనలో బి ఎల్ ఏలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓటర్లను గుర్తించి, వారి ఓటు హక్కును కాపాడే బాధ్యత బిఎల్‌ఎలపై ఉందని తెలిపారు. కార్యక్రమానికి అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, జాతీయ కిసాన్ సెల్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ దులిపూడి హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి సిద్ధేశ్వర్‌తో పాటు నియోజకవర్గంలోని బి ఎల్ ఎలు, ఇన్‌చార్జిలు, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# డీ–8 కెనాల్‌ను పరిశీలించిన మంత్రి జూపల్లి..

### కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదలపై ఆరా



**నాగర్ కర్నూల్ (సింగిడి):** కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన డీ–8 కెనాల్ పరిధిలోని కాల్వలను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బైక్‌పై తిరుగుతూ స్వయంగా పరిశీలించారు. తూడుకుర్తి వద్ద ప్రధాన కాల్వ నుంచి సాకర్‌పల్లి, ఏదుట్ల, గోపాలపేట, రేమద్దుల, సింగాయిపల్లి, తురకపల్లి, గోపులపురం కాల్వలను పరిశీలించి నీటి ప్రవాహం, కాల్వల పరిస్థితిని పర్యవేక్షించారు. కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు విడుదల చేస్తున్న నీరు, ఆయకట్టు పరిస్థితిపై సాగునీటిపారుదల శాఖ అధికారులను మంత్రి ఆరా తీశారు. ఆయకట్టు చివరి భూముల వరకు నీరు చేరుతున్న తీరును తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టి, వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. అందుబాటులో ఉన్న నీటితో అధిక విస్తీర్ణంలో పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదల, ప్రవాహం, ఆయకట్టు పరిస్థితిపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నీరు వృథా కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయకట్టు చివరి భూములకు సైతం సక్రమంగా నీరు అందేలా చూడాలని ఆదేశించారు. మంత్రి వెంట వనపర్తి జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్, కోడేరు మాజీ ఎంపీపీ రామ్మోహన్ రావు, సాగునీటిపారుదల శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి దంపతులు



**కల్వకుర్తి (సింగిడి):** తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి దంపతులు పెళ్లిరోజు సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లి కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు పొందుతూ ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో శ్రీవారిని దర్శించుకున్నారు. తమ దాంపత్య జీవితంలో మరో మధురమైన సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా తిరుమల శ్రీవారి సన్నిధిలో ప్రత్యేకంగా ప్రార్థనలు చేయడం ఆనందంగా ఉందని సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి దంపతులు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని వారు ఆకాంక్షించారు. పెళ్లిరోజును పురస్కరించుకుని పవిత్రమైన తిరుమల క్షేత్రంలో శ్రీవారిని దర్శించుకోవడం తమకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతిని కలిగించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తులతో కలిసి ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపారు. శ్రీవారి ఆశీస్సులతో తమ దాంపత్య జీవితం మరింత ఆనందమయంగా సాగాలని, గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ సేవ చేస్తూ పడకల్ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సర్పంచ్ దంపతులు సంకల్పించారు. పెళ్లిరోజు సందర్భంగా శ్రీవారి దర్శనం చేసుకున్న డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి దంపతులకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం





**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తి పట్టణ కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు జూలూరి రమేష్ బాబు జన్మది నాన్ని పురస్కరించుకుని వాసవి క్లబ్ ఆధ్వ ర్యంలో ఘనంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహిస్తూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ సభ్యులు, యువత, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని 50 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న వారికి రక్తదానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఒక్కొక్కరు ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జూలూరి రమేష్ బాబు జన్మదినాన్ని పురస్కరిం చుకుని ఇలాంటి సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని పలువురు కొనియాడారు. సమాజ సేవలో భాగంగా రక్తదానం, ఆరోగ్య అవగాహన వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రక్తదాన శిబిరానికి సహకరించిన వాసవి క్లబ్ సభ్యులకు, రక్తదాతలకు, నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ ఈ సందర్భంగా సన్మానించి అభినందించారు. జన్మదిన వేడుకలకు సేవా కార్యక్రమాన్ని జోడించి సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా జూలూరి రమేష్ బాబు జన్మదిన వేడుకలు ఆదర్శంగా నిలిచాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు, మరియు కార్యదర్శి, సభ్యులు పాల్గొన్నారు.

### జీఓ 97ను వెంటనే

# రద్దు చేయాలి

### బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు దారమోని గణేష్



**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తి పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ కార్యాలయంలో తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు దార మోని గణేష్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జి ఓ 97ను వెంటనే రద్దు చేయాలని భారత రాష్ట్ర సమితి విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు దారమోని గణేష్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యపై ఆధారపడుతున్న వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసేలా ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచే టని, ప్రతి ఏటా అన్ని వర్గాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు సాంకేతిక విద్యలో నైపు ణ్యం కోసం పాలిటెక్నిక్ విద్యను అభ్య సిస్తు న్నారని, డిప్లమా పూర్తి చేసిన వారికి సాంకే తిక రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. అలాంటి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, దానికి విరుద్ధంగా జి ఓ 97 తీసుకురావడం విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేయడమేనని అన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్యా పరిధిలో కొనసాగుతున్న పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను యూనివర్సిటీల పరిధిలోకి మార్చే ప్రయత్నాలు చేయడం ద్వారా పాలిటెక్నిక్ కోర్సులను క్రమంగా నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని గణేష్ ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించ కుండా పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థనే దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, పేద మధ్యతరగతి కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పాలిటెక్నిక్ విద్యను యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని దారమోని గణేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన ఆలోచనా విధానాన్ని మార్చు కొని జి ఓ 97 ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే, విద్యార్థుల పక్షాన బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో అవసరమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని దారమోని గణేష్ హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు కంఠం రవీందర్, విష్ణు, పెరు మాళ్ళ కృష్ణ, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి అమలు కోసం బీఆర్ఎస్ మహాధర్నా







### హామీలు అమలు చేయని సీఎం ప్రజలకు క్షమాపణ చెప్పాలి: నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి.

**నాగర్ కర్నూల్ (సింగిడి):** నాగర్‌కర్నూల్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయని ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజల ముందుకు వచ్చి ముక్కునేలకు రాసి క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల రద్దులో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం మినీ ట్యాంక్‌బండ్ కూడలిలో మహాధర్నా నిర్వహించారు.

మర్రి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, కొత్త పథకాలు అమలు చేయడం పక్కనపెట్టి కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ విషయంలో ప్రభుత్వం కోర్టులో సరైన వాదనలు వినిపించకపోవడం వల్లే పథకం రద్దు పరిస్థితికి వచ్చిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యం వంటి పథకాలు అమలు చేశారని, వాటిని కొనసాగించలేక కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. సంక్షేమ పథకాల కోసం ప్రజలు ప్రశ్నించకపోతే ఉన్న పథకాలన్నింటినీ రద్దు చేస్తారని, ప్రజలు చైతన్యవంతులై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.

**తులం బంగారం హామీ ఏమైంది?**

కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఉన్న కళ్యాణలక్ష్మి పథకాన్ని కూడా నిర్వీర్యం చేసిందని మర్రి ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నెలలోపే కళ్యాణలక్ష్మి సాయం అందేదని, ఇప్పుడు ఏళ్ల తరబడి ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. ఆడపిల్లల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వానికి ప్రజల ఆగ్రహం తప్పదన్నారు.

**ఎమ్మెల్యేపై ఆరోపణలు..**

సంక్షేమ పథకాల కోసం సంతకాలు చేసే విషయంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే పార్టీలు చూస్తున్నారని మర్రి ఆరోపించారు. పేదలకు పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందించాలని అన్నారు. మున్సిపాలిటీలో పేదలను రాజకీయ కారణాలతో తొలగిస్తున్నారని ఆరోపించారు.

**పేదలకు బువ్వ పెట్టడం పాపమా ?**

మర్రి అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం అందిస్తుంటే మున్సిపాలిటీ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. నెలకు రూ. 10 నుంచి రూ. 15 లక్షలు తన సొంత డబ్బు ఖర్చు చేస్తున్నానని, అయినా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పేదలకు బుక్కెడు బువ్వ పెట్టడం కూడా పాపమా అని ప్రశ్నించారు.

**24 గంటల విద్యుత్‌పై మరో ధర్నా..**

కేసీఆర్ హయాంలో 24 గంటల విద్యుత్ అందేదని, ప్రస్తుతం వ్యవసాయంతో పాటు గృహ విద్యుత్‌కు కూడా కోతలు పెడుతున్నారని మర్రి విమర్శించారు. 24 గంటల విద్యుత్ కోసం త్వరలో మరో ధర్నా చేపడతామని ప్రకటించారు.

**సీఐతో వాగ్వాదం..**

ధర్నా ప్రాంగణంలో సీఐ అశోక్‌రెడ్డి కార్యకర్తలను పక్కకు జరపడంతో మర్రి జనార్దన్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ "ఒంటిపై ఖాకీ డ్రెస్సు.. మనసంతా కాంగ్రెస్" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే సమయంలోనూ పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

**ఆర్డీవో కార్యాలయం గేటు వద్ద పోలీసులు..**

అడ్డుకోవడంతో కార్యకర్తలు లోపలికి వెళ్లి కార్యాలయం ముందు బైఠాయించారు. అనంతరం సంక్షేమ పథకాలను కొనసాగించాలని నినాదాలు చేస్తూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన పూల కొట్లు..!

### వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు

### ఫుట్‌పాత్ దాటి రహదారిపైనే దందా.. పట్టించుకోని అధికారులు

**కొత్తగూడెం(సింగిడి):** జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ఎంజీ రోడ్డులో పూల వ్యాపారులు రోడ్డునే వ్యాపార వేదికగా మార్చుకోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు నగరంలో ఆరు లైన్ల రహదారిని నిర్మించినప్పటికీ, ఆక్రమణల కారణంగా ప్రయోజనం లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంజీ రోడ్డులో పూల వ్యాపారులు ఫుట్‌పాత్ పరిధికే పరిమితం కాకుండా ఏకంగా ప్రధాన రహదారిపైకి వచ్చి దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూల బుట్టలు, ఇతర సామగ్రిని రోడ్డుపై ఉంచడంతో వాహనాలు వెళ్లేందుకు స్థలం తగ్గిపోతోంది. దీంతో ముఖ్యంగా రద్దీ సమయాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు.

**ప్రశ్నిస్తే దురుసు సమాధానాలు**

రోడ్డుపై వ్యాపారం చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎవరైనా ప్రశ్నిస్తే కొందరు వ్యాపారులు దురుసుగా సమాధానం ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలు పాటించాల్సిన వ్యాపారులు రహదారినే ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

**ట్రాఫిక్ పోలీస్ దృష్టి సారించాలి**

రహదారి ఆక్రమణలపై సంబంధిత ట్రాఫిక్ పోలీస్ అధికారులు తక్షణమే దృష్టి సారించి ఫుట్‌పాత్‌లు, ప్రధాన రహదారులను పూలకొట్ల ఆక్రమణల నుంచి విముక్తి చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వ్యాపారాలపై చర్యలు తీసుకుని, పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# అల్ఫోర్స్ పాఠశాలలో ఘనంగా తాతయ్యలు, అమ్మమ్మల వేడుక

**వారి అనుభవాలు, ఆప్యాయతలు విద్యార్థులకు విలువైన పాఠాలు: అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్‌రెడ్డి**




**కరీంనగర్, (సింగిడి):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో తాతయ్యలు, అమ్మమ్మల కోసం ప్రత్యేకంగా 'గ్రాండ్ పేరెంట్స్ డే' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత సరస్వతీదేవి విగ్రహానికి పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా డా. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తాతయ్యలు, అమ్మమ్మల అనుభవాలు, కుటుంబ విలువలు, జీవితంలో లక్ష్యాలను సాధించే విధానాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. వారి సూచనలు, అనుభవాలను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. వేడుకల్లో భాగంగా తాతయ్యలు, అమ్మమ్మలకు పలు వినోదాత్మక కార్యక్రమాలు, క్రీడలు నిర్వహించారు. వయసును మరచి ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. వారు ప్రదర్శించిన నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు, కుటుంబ సభ్యులకు ఉపయోగకరమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్న డా. వి. నరేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి తాతయ్యలు, అమ్మమ్మల్లో నూతనోత్సాహాన్ని నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కెవికెను సందర్శించిన ట్రైనీ కలెక్టర్



**జమ్మికుంట, (సింగిడి):** కరీంనగర్ జిల్లా ట్రైనీ కలెక్టర్ పి హరిప్రసాద్ గురువారం జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రంను సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకేలో నిర్వహిస్తున్న వర్మీ కంపోస్ట్, వర్మీ వాష్, పశుగ్రాస పంటలు, నర్సరీ యూనిట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న వరి, పత్తి, కంది మరియు వివిధ కూరగాయల క్షేత్రాలను సందర్శించి, పంటల సాగు విధానం కేవీకే ద్వారా రైతులకు అందిస్తున్న సాంకేతిక మార్గదర్శకాలను తెలుసుకున్నారు. అదేవిధంగా భూసార పరీక్ష కేంద్రం ద్వారా రైతులకు వారి యొక్క మట్టి పరిస్థితులను తెలియచేస్తూ మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకుండా కృషి చేయడం జరుగుతుందని తెలుసుకున్నారు. తక్కువ పెట్టుబడితో స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, నేల ఆరోగ్యాన్ని పరిరక్షించే సహజ పునరుత్పాదక సాంకేతిక విధానంలో నిర్వహిస్తున్న పరిశీలన క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇటువంటి తక్కువ పెట్టుబడి, స్థిరమైన వ్యవసాయ విధానాలపై మరింత మంది రైతులకు అవగాహన కల్పించేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం రైతులు పండించే ఉత్పత్తులకు విలువ జోడించి, ఆదాయాన్ని పెంచేందుకు ఉపయోగపడే సోలార్ డ్రైయర్ యూనిట్‌ను పరిశీలించారు. కేవీకే ద్వారా రైతులకే కాకుండా వ్యవసాయ విద్యార్థిని, విద్యార్థులకు కూడా వ్యవసాయం మరియు అనుబంధ రంగాలలోని నూతన సాంకేతిక, శాస్త్రీయ అంశాలపై శిక్షణ, సలహాలు మార్గదర్శకత్వం అందించడం అభినందనీయమని ట్రైనీ కలెక్టర్ పేర్కొన్నారు. "వ్యవసాయ రంగానికి అవసరమైన శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ, సలహాలు, ప్రదర్శనా క్షేత్రాలు మరియు అనుబంధ రంగాలపై మార్గదర్శకత్వాన్ని ఒకే వేదికపై అందిస్తూ, కేవీకే రైతులకు 'వ్యవసాయంలో వన్‌స్టాప్ సొల్యూషన్ సెంటర్'గా సేవలందిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు వెంకటేశ్వరరావు, సిబ్బంది సంబంధిత అధికారులు మరియు వ్యవసాయ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ 75వ జయంతి వేడుకలు




**మల్లాపూర్,(సింగిడి):** మల్లాపూర్ మండల కేంద్రంలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 75వ జయం తి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి నివాళులర్పించారు. దేశ అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను నాయకులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్ల సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పుంద్రా శ్రీనివాస్ రెడ్డి, పుంద్రా లక్ష్మారెడ్డి, మిట్టపల్లి జీవన్ రెడ్డి, కోటగిరి ఆనంద్ గౌడ్, మరిపెల్లి మల్లయ్య, బాజోజి సత్యనారాయణ, క్యాతం సురేష్ రెడ్డి, ఎర్ర భూమయ్య, సిరి పురం రవీందర్, గడ్డం సోమారెడ్డి,తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిల కోసం విద్యార్థుల భారీ ర్యాలీ

**రూ.12 వేల కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి,**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు**



**కరీంనగర్, (సింగిడి):** ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో గురువా రం భారీ విద్యార్థి ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ చౌక్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు వందలాది మంది విద్యార్థులు, బీజేవైఎం నాయకులతో కలిసి 'విద్యార్థి మార్చ్' చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ వద్ద 'ఫీజుల బకాయి-బీజేపీ లడాయి' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు మాట్లా డుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ. 12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడు దల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలలు విద్యా ర్థుల ధ్రువపత్రాలను నిలిపివేస్తున్నాయని, దీంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల విష యంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభు త్వం చేసే దానం కాదని, అది విద్యార్థుల హక్కు అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శిం చారు. శాంతియుతంగా నిరసన తెలిపే విద్యార్థులపై ఆంక్షలు విధించకుండా పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయకపోతే విద్యార్థుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్ మాట్లాడుతూ విద్యార్థి ర్యాలీ విషయంలో పోలీసులు అతిగా వ్యవహరించి విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలను నోటీసులతో బెదిరించారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బాస సత్యనారాయణరావు, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంగ నరేష్, బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్పొరేటర్లు, వివిధ మోర్చాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు వెల కట్టలేనివి



**వెల్గటూర్, (సింగిడి):** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటి పర్తి శైలేందర్ రెడ్డి అన్నారు. గురువారం రాజీవ్ గాంధీ జయంతి ని పురస్కరించుకొని.. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటి పర్తి శైలేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ కూడలి వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. దేశ ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పేదలకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**విద్యార్థుల భవిష్యత్తు కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుంది, మేయర్ శ్రీనివాస్**

**కరీంనగర్, (సింగిడి):** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫీజుల బకాయి--బీజేపీ లడాయి' కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు రూ. 12 వేల కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక అనేక మంది విద్యార్థులు విద్యా ధ్రువపత్రాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కళాశాలలకు బకాయిలు అందక సిబ్బందికి వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే వైఖరిని కొనసాగిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని శ్రీనివాస్ విమర్శించారు. విద్యార్థుల సమస్యలపై గల్లీ నుంచి అసెంబ్లీ వరకు బీజేపీ నిరంతరం పోరాడుతుందని, బకాయిలు పూర్తిగా విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం ఆగదని, ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండె గణేష్, జిల్లా ఇన్‌చార్జి శాంతకుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంఘ నరేష్, మాజీ ఎమ్మెల్యే శోభక్క, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లు, విద్యార్థులు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# టెక్నాలజీ అభివృద్ధిలో రాజీవ్ గాంధీ పాత్ర కీలకమైనది

**కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్**

**జమ్మికుంట, (సింగిడి):** భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి ఉత్సవాన్ని జమ్మికుంట పట్టణ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహిం చడం జరిగింది . ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్ మాట్లాడుతూ దేశాన్ని ఆధునిక అభివృద్ధి పథంలో ముందుకు నడిపేందుకు దూర దృష్టితో ఆలోచించిన మహా నాయకుడు యువ భారత ఆకాంక్షలకు ప్రతినిధి గా నిలిచిన భారతరత్న మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ అని కొనియాడారు. కంప్యూటర్ టెలి కమ్యూనికేషన్ వంటి ఆధునిక సాంకేతిక రంగా లను ప్రోత్సహిస్తూ భారతదేశాన్ని 21వ శతాబ్దం వైపు నడిపించేం దుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువ తకు రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించడం గ్రామీణ భారత అభి వృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం దేశ ఐక్యత సమగ్ర అభివృద్ధి ఆయన చేసిన సేవలు స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వీరమనేని పరశు రామారావు టి పి సి సి ఎగ్జిక్యూటివ్ నెంబర్ సాయిని రవి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిలు కాంగ్రెస్ పొనగంటి రవీందర్ దొడ్డి శ్రీకాంత్



సీనియర్ కాంగ్రెస్ నాయకులు పొనగంటి మల్లయ్య కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్స్ శ్రీపతి నరేష్ చందా రాజు పొనగంటి విష్ణు దిడ్డి రామ్మోహన్ ఒగ్గు రమేష్ మాచర్ల రాజు కుతాడి తిరుపతి యాట్ల అశోక్ ఎగిత అశోక్ నాయకులు పూదరి శివకుమార్ గౌడ్ శ్రీనివాస్ యాదవ్ బండి పవన్ ఎండి సలీం మార్కెట్ డైరెక్టర్ నాయినేని రాజేశ్వరరావు బొంగోని వీరన్న పూరెల్ల రాకేష్ పిట్టల రమేష్ పంజాల అజయ్ పాత ప్రసాద్ పాతకాల ప్రవీణ్ శ్రీనివాస్ యాదవ్ యం డి సలీం పాషా గుర్రం ప్రవీణ్ చింట ( కుమార్) రాజు కుమార్ పాత కాల ప్రవీణ్ పిడుగు భాగ్యలక్ష్మి నర్సయ్య తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# స్వగ్రామం కోసం గల్ఫ్ కార్మికుల సేవా హస్తం







**మల్లాపూర్, (సింగిడి):** విదేశాల్లో కష్టపడి సంపాదించిన డబ్బు లో కొంత భాగాన్ని స్వగ్రామ అభివృద్ధికి వినియోగిస్తూ వాల్గొండ, వాల్గొండ తండాకు చెందిన గల్ఫ్ కార్మికులు ఆదర్శంగా నిలుస్తున్నారు. పార్టీలు, కులం, మతం, చిన్నా పెద్దా అనే తేడాలు లేకుండా గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. గతంలో గల్ఫ్ కార్మికుల సహకారంతో శ్రీరామనవమి వేడుకలకు రూ. 50 వేల విరాళం, ఇటీవల హనుమాన్ మందిర నిర్మాణం, సెకం డరీ పాఠశాల నేమ్ బోర్డు నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపట్టారు. విదేశాల్లో ఉంటూ స్వగ్రామంపై ఉన్న అభిమానంతో గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్న గల్ఫ్ కార్మికులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గల్ఫ్ కార్మికుల సేవా కార్యక్రమాలను చూసి యువత గ్రామం కోసం ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర రంగాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ తమకు వీలైనంతగా గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. మన ఊరిని మనమే అభివృద్ధి చేసుకోవాలనే ఆలోచనతో ప్రతి ఒక్కరూ ముందుకు వస్తే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మన ఊరు బాధ్యత మనదే అందరం కలిసి మన గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకుందాం అని గల్ఫ్ కార్మికులు పిలుపునిచ్చారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోంది

**జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలి, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు పొన్నం అనిల్‌కుమార్ గౌడ్**

**కరీంనగర్, (సింగిడి):** పాలిటెక్నిక్ కళాశాలలను 'శక్తి' (స్కిల్ హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనిషియేటివ్స్) విభాగంలో విలీనం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఎదుట బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానంలోకి తీసుకురావడం ద్వారా ప్రభుత్వ విద్యా సంస్థలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ నిర్ణయం అమలైతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద, మధ్యతరగతి విద్యార్థులపై ఫీజుల భారం పెరిగి సాంకేతిక విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం వారిని ప్రైవేటు విశ్వవిద్యాలయాల వైపు నెట్టడం సరికాదన్నారు. గతంలో పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో నేరుగా ప్రవేశించే అవకాశం ఉండేదని, విలీనం వల్ల ఈ సౌకర్యం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మహబూబాబాద్ కలెక్టరేట్ వద్ద జీవో నంబర్ 97 రద్దు కోసం నిరసన తెలిపిన పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల పోలీసుల వ్యవహారశైలిని ఖండిస్తూ, సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. జీవోను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని పొన్నం అనిల్‌కుమార్ గౌడ్ హెచ్చరిం చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్, ఆరే రవి గౌడ్, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు గంగాధర చందు, నారదాసు వసంత్‌రావు, బండ వేణు యాదవ్, సోమిరెడ్డి నరేష్‌రెడ్డి, వడ్లకొండ పరశురాం, గంటల రేణుక, విక్రమ్, శనిగరం సతీష్, పెరుమాండ్ల హరీష్ తదితరులు పాల్గొన్నారు.




# నేడు జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

**జగిత్యాల ప్రతినిధి , (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం జగిత్యాల జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మధ్యాహ్నం 12 గంటలకు జగిత్యాల జిల్లాకు చేరుకొని ధరూర్ క్యాంప్, జగిత్యాల జిల్లా లో నూతనంగా మంజూరైన జగిత్యాల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, భీమారం, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయాలు, మాల్యాల, మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీకి చేరుకుని, మధ్యాహ్నం 1:00 గంటల నుంచి 1:30 గంటల వరకు కాలనీని పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడనున్నారు. మధ్యాహ్నం 3:00 గంటల నుంచి 4:30 గంటల వరకు జగిత్యాలలోని లిపద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మంత్రి ముఖాముఖి కార్యక్రమంలి నిర్వహించనున్నారు. సాయంత్రం 4:30 గంటల నుంచి 7:00 గంటల వరకు లిఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లతో గృహ నిర్మాణం, రెవెన్యూ అంశాలపై సమీక్షా సమావేశంలి నిర్వహించనున్నారు. మంత్రి పర్యటన సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు అవసరమైన ఏర్పాట్లు సమన్వయంతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# కరీంనగర్‌లో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీదే**
**డీసీసీ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం**



**కరీంనగర్, (సింగిడి):** మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కరీంనగర్‌లోని రాజీవ్ చౌక్‌లో కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసయ్య తదితరులు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ దేశంలో ఐటీ, టెలికమ్యూనికేషన్ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు రాజీవ్ గాంధీ పునాదులు వేశారని అన్నారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడంతో పాటు నూతన విద్యా విధానానికి శ్రీకారం చుట్టి, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. ముఖ్యంగా 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతను ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములను చేసిన ఘనత రాజీవ్ గాంధీదేనన్నారు. అనంతరం టీపీసీసీ ఆదేశాల మేరకు రాజీవ్ గాంధీ స్ఫూర్తితో 18 ఏళ్లు నిండిన యువతకు కొత్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా. మేడిపల్లి సత్యం స్వయంగా నూతన ఓటరు నమోదు దరఖాస్తును పూర్తి చేసి యువతకు అందజేశారు.
రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులు కట్టుబడి ఉన్నాయని వైద్యుల అంజన్ కుమార్ తెలిపారు. దేశ ప్రజలకు సేవ చేసిన నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల త్యాగాలను ఎప్పటికీ మరువలేమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 22న మిలాద్ ఉన్ నబీ .. అంతర్మత సదస్సు

**వెలిచాల రాజేందర్‌రావుకు ఆహ్వానం. అందజేసిన మర్కజి మిలాద్ కమిటీ ప్రతినిధులు**



**కరీంనగర్, (సింగిడి)::** మిలాద్ ఉన్ నబీ సంద ర్భంగా ఈ నెల 22న కరీంనగర్‌లో నిర్వహించనున్న అంతర్మత సదస్సుకు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావును మర్కజి మిలాద్ కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ నెల 22న శనివారం సాయం త్రం రాజీవ్ చౌక్ సమీపంలోని పీకాక్ రెస్టారెంట్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహ మ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మత సామరస్యం, సోదరభావం, శాంతి సందేశంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కొత్తపల్లిలోని ప్రజా కార్యాలయంలో రాజేందర్ రావును కలిసి కమిటీ ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందజేశారు. సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరగా, తప్పకుండా పాల్గొంటానని రాజేందర్‌రావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మర్కజి మిలాద్ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

**'ఫీజుల బకాయి--బీజేపీ లడాయి'లో భారీ విద్యార్థి ర్యాలీ**



**కరీంనగర్, (సింగిడి):** విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలాడుతున్న వైఖరికి నిరసనగా భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం 'ఫీజుల బకాయి--బీజేపీ లడాయి' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్. రామచంద్రరావుకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు స్వాగతం పలికారు. అనంతరం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, విద్యార్థులు, బీజేవైఎం నాయకులతో కలిసి సునీల్‌రావు తెలంగాణ చౌక్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు నిర్వహించిన భారీ విద్యార్థి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి, వారి విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

## జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా
# పంజా కల్పన నియామకం





**తొర్రూరు, (సింగిడి):** మహబూబాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీల నివారణకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలో తొర్రూరు పట్టణానికిచెందిన పంజా కల్పన కు సభ్యురాలిగా అవకాశం లభించింది. ఈ సందర్భంగా పంజాకల్పన హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన తనకు ఈ కీలకమైన కమిటీలో సభ్యురాలిగాఅవకాశం కల్పించిన పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి కి, ఝాన్సీరాజేందర్ రెడ్డి కి పంజా కల్పన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సీరాజేందర్ రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఆమె పేర్కొన్నారు. కమిటీసభ్యురాలిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఎస్సీ, ఎస్టీ( వర్గాలహక్కుల పరిరక్షణకు, అట్రాసిటీ బాధితులకు సకాలంలో న్యాయం అందేలా తన వంతుకృషి చేస్తానని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్, కమిటీ చైర్‌పర్సన్ స్నేహ శబరిష్ ఆధ్వర్యంలోఈ కమిటీ పనిచేయనుంది. ఎస్సీ, ఎస్టీ(అట్రాసిటీల నివారణ) చట్టం అమలు,బాధితులకు న్యాయం, పరిహారం, పునరావాసం తదితర అంశాలపై కమిటీ సమీక్షించి,బాధితులకు అండగా నిలవనుంది. తనకు లభించిన ఈ అవకాశాన్ని సామాజిక బాధ్యతగా భావించి, అణగారిన వర్గాలసమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని పంజా కల్పన స్పష్టంచేశారు. అనంతరంకమిటీ సభ్యురాలిగా ఎన్నికైనపంజా కల్పనను తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య, కమిషన్ సభ్యులు, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారిశ్రీనివాసరావు, ఇతర జిల్లా అధికారులు శాలువాతో సన్మానించి అభినందించారు.

# తిరగబడ్డ మమకారం' లఘుచిత్రం షూటింగ్ ప్రారంభం

**గోదావరిఖని (సింగిడి):** నిరీక్షణ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'తిరగబడ్డ మమకారం' లఘుచిత్రం షూటింగ్ గురువారం గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌లోని నిరీక్షణ స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఇప్టా జాతీయ సమితి, ప్రజా నాట్యమండలి కళాకారుడు కవ్వంపల్లి స్వామి, సీనియర్ పాత్రికేయులు దయనంద్ గాంధీ, ఎన్పీడీసీఎల్ రిటైర్డ్ ఏడీఈ కె.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించి చిత్రీకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో పోతుల చంద్రపాల్ రూపొందించిన లఘుచిత్రాలు సమాజాన్ని ఆలోచింపజేసే సామాజిక అంశాలతో రూపొందించబడ్డాయని తెలిపారు. అదే తరహాలో 'తిరగబడ్డ మమకారం' కూడా సమాజానికి చక్కటి సందేశాన్ని అందించేలా తెరకెక్కుతోందన్నారు. కన్నవాళ్లను నిరాశ్రయులను చేసినప్పుడు.. తల్లిదండ్రులు తమ మమకారాన్ని చంపుకుని తిరగబడితే ఏర్పడే పరిస్థితులను ఈ చిత్రంలో చూపించనున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రుల పట్ల పిల్లలు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని తెలియజేసేలా ఈ చిత్రం ఉంటుందని తెలిపారు. ఇటీవల లఘుచిత్రాల పేరుతో కొందరు ఇబ్బందికర టైటిల్స్ తో, అభ్యంతరకర దృశ్యాలతో చిత్రాలను రూపొందిస్తున్నా రని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దర్శకులు, నిర్మాతలు వ్యక్తిగత క్రమశిక్షణ పాటిస్తూ సమాజానికి ఉపయోగపడే, సందేశాత్మక చిత్రాలను రూపొందించాలని సూచించారు. 'తిరగబడ్డ మమకారం'కు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. కాగా గతంలో పలు సామాజిక అంశాలపై లఘుచిత్రాలను రూపొందించిన పోతుల చంద్రపాల్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వ బాధ్యతలు చేపట్టగా, సీనియర్ పాత్రికేయులు మేజిక్ రాజా, పోతు శంకరయ్య, సిరిపురం శ్రీనివాస్, సతీష్, శ్రీలత, రజిత,



వేదశ్రీ, అస్మిత్ పాల్గుణ, రియా వృంద తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. తిప్పబత్తిని అంజయ్య మేకప్‌మెన్‌గా, కో-డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో బీరుక లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల విద్యకు సైకిళ్ల భరోసా..!!

### ఎన్టీపీసీ సీఎస్ఆర్ కార్యక్రమంలో 171 మంది విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ
### పాఠశాలలకు సురక్షిత ప్రయాణం.. విద్యాభ్యాసానికి మరింత ప్రోత్సాహం

**గోదావరిఖని (సింగిడి):** బాలికలు విద్యను నిరంతరాయంగా కొనసాగించేందుకు, పాఠశాలలకు సులభంగా మరియు సురక్షితంగా చేరుకునేలా ఎన్టీపీసీ చేపట్టిన సామాజిక బాధ్యత కార్యక్రమం (జూ=)లో భాగంగా 171 మంది విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. రామగుండం మండలంలోని ఎనిమిది పాఠశాలలకు చెందిన 9వ తరగతి బాలికలకు అశోక్‌నగర్‌లోని జెడ్పీ హెచ్ఎస్ (గర్ల్స్) పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, పాఠశాలల ఉపాధ్యాయులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. విద్యాభ్యాసానికి చేయూత



పాఠశాలలకు వెళ్లేందుకు బాలికలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను తగ్గించడంతో పాటు, ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. సైకిళ్ల పంపిణీతో బాలికలకు సురక్షితమైన, సులభమైన ప్రయాణ సౌకర్యం



లభించడంతోపాటు వారి విద్యాభ్యాసానికి మరింత ప్రోత్సాహం అందుతుందని పేర్కొన్నారు. బాలికల విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఎన్టీపీసీ చేపట్టిన ఈ జూ= కార్యక్రమం విద్యార్థినుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి ప్రశంసలు అందుకుంది.

# ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

### కమాన్‌పూర్ ఆసుపత్రిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ




**కమాన్ఆ పూర్ (సింగిడి):** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగాయి. ముందుగా భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనకు ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి, వారి పరామర్శించి పండ్లను పంపిణీ చేశారు. ? ఈ వేడుకల అనంతరం స్థానిక నాయకులు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధికి, ఆధునిక సాంకేతిక రంగానికి రాజీవ్‌గాంధీ వేసిన పునాదులు చిరస్మరణీయమని కొనియా డారు. సాంకేతిక విప్లవంతో పాటు యువతకు ప్రాధాన్యత నిస్తూ దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లిన గొప్ప నాయకుడు ఆయన అని గుర్తుచేశారు. రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కాంగ్రెస్ శ్రేణులంతా నిరంతరం శ్రమిస్తూ, ప్రజా సేవకే ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు రంగు సత్యనారాయణ గౌడ్, గుమ్మడి శ్రీనివాస్, బొంగోని సదయ్య, రాజమహేందర్, శేవ్వా శంకరయ్య, పిల్లి చంద్ర శేఖర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రెబల్ రాజ్ కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు పెన్ రెడ్డి కిషన్ రెడ్డి, మల్యాల మహేష్ గౌడ్, మహమ్మద్ యూసుఫ్ (లల్లు), నగునూరి నర్సయ్య గౌడ్, చిగురు రవీందర్, ఇనగంటి శ్రావణ్ కుమార్, చాట్ల గట్టయ్య, మేడగొని విజయ్, చాట్ల రాయమల్లు, కాడిపల్లి సుమన్, కోలేటి సురేష్, కొంతం శ్రీనివాస్, పచ్చునూరి రాజకుమార్, బోనాల పవన్, వెంగళి రాజయ్య, గర్రెపల్లి వెంకన్న, దాసరి రామస్వామి, మల్యాల చిన్న తిరుపతి, బత్తిని శ్రీనివాస్, బొంగుని వీరయ్య, బంగారి శ్రీనివాస్, ఆరెల్లి శ్రీనివాస్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అనుమానితులు ఎదురైతే సమాచారం ఇవ్వాలి ఏఎస్ఐ రహీం

**కమాన్ పూర్ (సింగిడి):** అనుమానితులు ఎవరైనా ఎదురైతే సమాచారం ఇవ్వాలని కమాన్ పూర్ ఏ ఎస్ ఐ రహీం అన్నారు. కమాన్ పూర్ క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై కొట్టే ప్రసాద్ ఆదేశాల మేరకు పెద్దపల్లి మంథని ప్రధాన రహదారి కమాన్ పూర్ క్రాస్ రోడ్ ప్రజలతో అవగాహన కల్పించారు. ప్రజలు సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని అన్నారు. దొంగతనాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించా లని పేర్కొన్నారు. ఎవరైనా బ్యాంకు వారని ఓటీపీలో అడిగితే చెప్పకూడదని అన్నారు. సైబర్ మోసాలు తీవ్రంగా జరుగుతు న్నాయని ప్రతి ఒక్కరూ అలర్ట్ గా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబులు బాబు, మధునయ్య, సిబ్బంది అంజలి, తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యోగుల హక్కులపై నిర్లక్ష్యం ఇంకెంత కాలం..?

### పెండింగ్ డీఏలు, పీఆర్సీ, బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలి: టీజీఈజేఏసీ కన్వీనర్ తూము రవీందర్ పటేల్

**గోదావరిఖని (సింగిడి)::** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యో గులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి (టీజీఈజేఏసీ) కన్వీనర్, పెద్దపల్లి జిల్లా గెజిటెడ్ అధికా రుల సంఘం అధ్యక్షుడు తూము రవీందర్ పటేల్ ఆరోపిం చారు. ఉద్యోగులకు చట్టబద్ధంగా రావాల్సిన పెండింగ్ డీఏలు, పీఆర్సీ ప్రయోజనాలు, వివిధ బకాయి బిల్లులను ప్రభుత్వం సకాలంలో చెల్లించకుండా జాప్యం చేస్తోందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం చెల్లింపు లను వాయిదా వేయడం వల్ల ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిలో ఉన్న ఉద్యోగులు మరింతగా అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



**కుటుంబ బాధ్యతలు..**
**ఉద్యోగ ఒత్తిళ్లు.. అధికారుల వేధింపులు**

ప్రభుత్వ ఉద్యోగులు ఒకవైపు కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ, మరోవైపు ప్రభుత్వ విధులను నిర్వర్తిస్తూ తీవ్ర ఒత్తిడికి గురవుతు న్నారని రవీందర్ పటేల్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిళ్లకు తోడు కొంతమంది ఉద్యోగులు అధికారుల వేధింపులను సైతం భరిస్తూ మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అన్నారు. సకాలంలో వేతన సంబంధిత ప్రయోజనాలు, బకాయిలు అందకపోవడం ఉద్యోగుల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, పని ఒత్తిళ్ల కారణంగా పలువురు ఉద్యోగులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి మరింత దయనీయం**

సుదీర్ఘకాలం ప్రభుత్వ సేవలందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యలను కూడా ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. పదవీ విరమణ అనంతరం రావాల్సిన ప్రయోజ నాలు, బకాయిల కోసం రిటైర్డ్ ఉద్యోగులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడటం బాధాకరమన్నారు. హక్కులు సాధించుకునే వరకు పోరాటం ఉద్యోగుల సమస్యలను ఇకనైనా ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి తక్షణ పరిష్కారం చూపాలని రవీందర్ పటేల్ డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీ, వివిధ బకాయి బిల్లులతో పాటు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన అన్ని ఆర్థిక ప్రయోజనాలను త్వరితగతిన విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ కాలయాపన కొనసాగిస్తే, ఉద్యోగుల ఐక్య శక్తిని చూపించాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఉద్యోగుల సహనాన్ని పరీక్షించకుండా వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# వంతెన లేని రహదారి... ప్రయాణికులకు ప్రాణసంకటం!

### వెంటనే రక్షణ గోడలు నిర్మించాలి: బీజేపీ నాయకుడు మల్లారపు అరుణ్ కుమార్ డిమాండ్



**కమాన్ఆ పూర్ (సింగిడి):** కమాన్‌పూర్ నుండి సిద్దిపల్లె వెళ్లే ప్రధాన రహదారిపై ప్రయాణం ఇప్పుడు వాహనదా రుల పాలిట తీవ్ర భయాందోళనలు రేకెత్తి స్తోంది. ఇటీవల ఈ మార్గంలో నూతనంగా రహదారి నిర్మాణం పూర్తి చేసినప్పటికీ, మార్గం మధ్యలో ఉన్న కాలువ వద్ద కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం పెద్ద వివాదాస్పదంగా మారింది. రహదారి క్రింది భాగం నుండి కాలువ నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నప్పటికీ, అక్కడ అవసరమైన వంతెన లేదా కల్వర్టు నిర్మించకుండానే రోడ్డు పనులు పూర్తి చేయడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ప్రస్తుతం కాలువ వద్ద ఎలాంటి రక్షణ గోడలు గానీ, భద్రతా పరాకాష్టలు గానీ ఏర్పాటు చేయలేదు. దీనికి తోడు రహదారి అంచున మట్టి కొట్టుకుపోతుం డటంతో రహదారి తీవ్ర ప్రమాదకరంగా తయారైంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ మార్గంలో ప్రయా ణించే వారికి ఎలాంటి హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు లేకపోవడం వల్ల వాహనాలు నేరుగా కాలువలో పడిపోయే ప్రమాదం పొంచి ఉందని స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. రోడ్డు నిర్మించినప్పుడే కాలువపై వంతెనను కూడా పూర్తి చేసి ఉంటే ప్రజలకు ప్రయాణ సౌకర్యంతో పాటు పూర్తి భద్రత చేకూరేదని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ తీవ్రమైన సమస్యపై బీజేపీ నాయకుడు మల్లారపు అరుణ్ కుమార్ ఘాటుగా స్పందించారు. రహదారి నిర్మాణం చేపట్టి కాలువ వద్ద రక్షణ గోడలు, వంతెన మరచిపోవడం అధికారుల బాధ్యతారాహి త్యమేనని ఆయన విమర్శించారు.



సంబంధిత శాఖాధికారులు తక్షణమే స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఈ ప్రదేశంలో వంతెన లేదా కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రయాణికుల ప్రాణ రక్షణను దృష్టిలో ఉంచుకుని వెంటనే హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, తాత్కాలిక రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే ప్రజల తరపున పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# దేశవ్యాప్త నిరసనను విజయవంతం చేయాలి

### ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్.. (ఏ ఐ ఎల్ యు ) కందికట్ల వీరేశం

**నర్సంపేట (సింగిడి):** ఆలిండియా లాయర్స్ యూనియన్ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 21 నాజరుగుతున్న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నర్సంపేటబార్ అసోసియేషన్, ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా బాధ్యులు కందికట్లవీరేష్ ఆధ్వర్యంలో గురువారము నర్సంపేట లో జరిగిన సమావేశంలో నర్సంపేట బార్అసోసియేషన్ ప్రెసిడెంట్ చిలువేరు కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 21న దేశవ్యాప్తంగా న్యాయవాదులు చేస్తున్న నిరసనార్యక్రమంలో నర్సంపేట బార్అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాబాధ్యులు కందికట్ల వీరేష్ మాట్లాడుతూ ఆలిండియా బార్ కౌన్సిల్ చైర్మన్‌మన్నన్ మిశ్రా గత 14 సంవత్సరాలుగా చైర్మన్గా కొనసాగుతూ్యాయవాదుల పట్లనల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థుల పట్ల మాట్లాడిన మాటలు దుర్మార్గంఅన్నారు న్యాయవాద విద్యార్థులు ప్రజాస్వామ్య భారతదేశంలో నిరసన తెలిపేహక్కు ఉందని దానిని హరించి వేయడం సరికాదన్నారు. మనన్ మిశ్రా బార్




కౌన్సిల్ చైర్మన్ గా ఉండుకుంటూ రాజ్యసభ సభ్యునిగా కొనసాగుతున్నారుప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సినవ్యక్తులే నియంత్రిత్వ పద్ధతులలో పదవులలో కొనసాగడం సరికాదన్నారు. తక్షణమేబార్ కౌన్సిల్ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు టి నరసింహారెడ్డి ఎస్ కే రహీముద్దీన్ మాట్లాడుతూ న్యాయవాద విద్యార్థుల పట్ల బార్ కౌన్సిల్ చైర్మన్ మాట్లాడినమాటలను తప్పుపట్టారు. సీజెఐ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా మాటలను నిరసనతెలిపిన నల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థులు వారి స్నాతకోత్సవంసందర్భంగా సిజెఐ చేతుల మీద డిగ్రీ పట్టాలు తీసుకోము అనే నిరసన తెలిపినదానికి వారి పైన భారతదేశంలోని ఏ బార్ కౌన్సిల్లో కూడా రెండు సంవత్సరాలవరకు రిజిస్ట్రేషన్ చేర్చకూడదు అనే మాట్లాడడం బార్ కౌన్సిల్ చైర్మన్‌మన్నన్ మిశ్రాకు సరికాదని అన్నారు విద్యార్థులు తమ నిరసన తెలిపే హక్కు ఉందన్నారు ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్నిగౌరవించలేని వ్యక్తులు ఉన్నత పదవులలో ఉండకూడదన్నారు కావున ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రేపు జరగబోతున్న అఖిలభారత న్యాయవాదుల నిరసనకార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో నర్సంపేట బార్ అసోసియేషన్ కోశాధికారి బొడ్డుపల్లి అజయ్,సహాయ కార్యదర్శి రఫీ, సీనియర్ న్యాయవాదులు దొంతి సాంబయ్య,ఏజీపీ బండి శివమహిళా న్యాయవాదులు టి సునీత, టీ స్రవంతి, ప్రతిభ,మౌనిక న్యాయవాదులు కొంగరి రాజు,పొనుగోటి అజయ్,కంసాని అశోక్,నాగుల రమేష్, సూరయ్య,పాలడుగుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్యాలలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలు



**మల్యాల, (సింగిడి):** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలు గురువారం పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి సాంకేతిక పరమైన టెక్నాలజీని తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కిందని అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ లు రామలింగారెడ్డి ,నేరెళ్ల సతీష్ రెడ్డి, కొల్లూరు గంగాధర్ ,మానాల సర్పంచ్ బల్మూరి పాపారావు, సర్వాపూర్ సర్పంచ్ జంగిలి హ నుమంతు ,మల్యాల ఉప సర్పంచ్ కటకం వినయ్, ముత్యంపేట ఉప సర్పంచ్ కందిరి ముత్యం రెడ్డి, శనిగరపు తిరుపతి, అరుణ్ రావు, కంటే అరుణ్ ,గొట్టె నరేష్, నరసింహారెడ్డి ,బత్తిని మనోజ్ నాగులపేట సంజీవ్ దితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌కు ఘన సన్మానం



**కమాన్ పూర్ (సింగిడి):** కమాన్ పూర్ మండలం సిద్ది పల్లె ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్ ను ఘనంగా సన్మానించారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు సందర్భంగా పెద్దపెల్లి జిల్లా ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ గా కొనసాగుతున్న సతీష్ ఫోటోగ్రాఫర్ అవడం వల్ల ఆయనను ఘనంగా సన్మానించారు. నేడు ఫోటోగ్రఫీలో పోటీతత్వం పెరిగిపోయిందని ,సెల్ యుగంతో ఉపాధి కోల్పోవాల్సి వస్తుందని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్, ప్రధాన కార్యదర్శి ఎం డి ఇర్ఫాన్, కోశాధికారి అల్లం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్రస్వామిని దర్శించుకున్న మంత్రి పొన్నం



**భీమదేవరపల్లి, (సింగిడి):** భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని శ్రీ వీరభద్రస్వామి దేవస్థానాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఆలయ అర్చకులు మంత్రికి సంప్రదా యబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వా ణాధికారి పి. కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లో వ్యతిరేకత రాగానే ఊసరవెల్లి మాటలా.....

### కాంగ్రెస్ నాయకుల పై మండిపడ్డ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు
### మీకు చిత్తశుద్ధి ఉంటే మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టాలి
### కాంస్య విగ్రహాలపై మాకు వ్యామోహం లేదు.
### విగ్రహ రాజకీయం చేస్తున్న కాంగ్రెస్ నాయకులది ద్వంద్వ నీతి

**నర్సంపేట (సింగిడి):** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్ మీడియా సమావేశం ఏర్పాటు చేశార. వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని మెడికల్ కాలేజీ దగ్గర నుండి తొలగించాలని ఐదో వార్డ్ కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త రాతపూర్వకంగా మున్సిపల్ కమిషనర్ కి ఫిర్యాదు చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆ ఫిర్యాదు ఆధారంగానే కమిషనర్ పోలీసులకు లేఖ రాశారన్నది వాస్తవం కాదా అని నిలాదిశారు దానికి సంబంధించిన లేఖ మా దగ్గర ఉందని ఒక వైపు మీ కౌన్సిలర్ భర్త విగ్రహం తీయించమని ఫిర్యాదు చేస్తారు, మరోవైపు కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే మాధవ రెడ్డి కీ సంబంధం లేదని ఎలా చెబుతారు ఇది ప్రజలను మోసం చేయడమే అన్నారు. మాటలు చెప్పడం కాదు మీకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే మెడికల్ కాలేజ్ కి " పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీ నర్సంపేట " అని +ూ అధికారికంగా విడుదల చేయండి ఏని సవాలు విసిరారు. చిల్లర రాజకీయాలు కుట్రలు మాని, ఆ మహనీయుడి పేరును చిరస్థాయిగా నిలిపే విధంగా చర్యలు తీసుకోండి అని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియకుండానే వేలాది మంది పోలీసులు నర్సంపేటలో ఈరోజు వరకు గస్తీ కాస్తున్నారా అని ఎద్దేవా చేశారు. అధికారులే మాకు స్వయంగా ఎమ్మెల్యే నుండి ఒత్తిడి ఉంది విగ్రహాన్ని తొలగించాలని చెబుతున్నారు అంటే ఇది మీ చిల్లర రాజకీయాలకు నిదర్శనం అని అన్నారు. జిల్లా వ్యాప్తంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులను కార్యకర్తలను ఉద్యమకారులను అభిమానులను హౌస్ అరెస్టులు చేస్తూ నిర్బంధిస్తుంటే ప్రభుత్వం



గాని స్థానిక ఎమ్మెల్యే గాని ఎందుకు స్పందించలేదు,ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి పుట్టినరోజు నాడు విగ్రహాన్ని తొలగించి వేడుకలను పోలీసుల నిర్బంధంలో జరుపుకున్న మీరు ఈరోజు మొసలి కన్నీరు కారవడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దీ=ుఖ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, కౌన్సిలర్లు రాయిడి కీర్తి దుశాంత్ రెడ్డి, మండల శ్రీదేవి శ్రీనివాస్, శివరాత్రి స్వామి, దోమ్మటి రమ్య సంతోష్, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు వాసం కరుణ, మాజీ కౌన్సిలర్ నాగిశెట్టి ప్రసాద్, బండి ప్రవీణ్, పెండం వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి రాంప్రసాద్, నాయిని వేణుచంద్, సంపంగి సాలయ్య, మంద ప్రసాద్, పైసా ప్రవీణ్, బైరి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి | SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం
22-8-2026

## నా ఎదుగుదల జీర్ణించుకోలేక ఆరోపణలు..

**-సముద్రాల ఉపసర్పంచ్ సింగరయ్య**



**కోహెడ, (సింగిడి):**కోహెడ మండలం సముద్రాల గ్రామ ఉపసర్పంచ్ సింగరయ్యపై వేల్పుల బాలవ్వ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఆయన బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు.గతంలో బాలవ్వ గ్రామైక్య సంఘంలో వివో కార్యదర్శిగా పనిచేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో అధికారులకు తెలియజేయకుండా వార్డు సభ్యురాలిగా నామినేషన్ వేసిందని, ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు రాజీనామా చేయించాలని సూచించగా ఆమె రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఆమె ఓడిపోయినప్పటికీ మళ్లీ కార్యదర్శిగా కొనసాగాలని ప్రయత్నించడం సరికాదన్నారు. గ్రామసభలో కార్యదర్శి నియామకంపై ఎలాంటి ప్రశ్నలు లేవనెత్తలేదని, అనంతరం ఐకెపి అధికారిని అడగగా కొత్త వ్యక్తిని నియమించినట్లు తెలిసిందన్నారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యత మేరకు స్పందించానని, కానీ దీనిని రాజకీయంగా మలుస్తున్నారని ఆరోపించారు. కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సమస్యను ప్రేరేపిస్తున్నారని తెలిపారు.తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, తాను ఎవరినీ బెదిరించలేదని సింగరయ్య స్పష్టం చేశారు.

## అడవిలో నీటి కొరత నివారణకు సాసర్ పిట్‌లు


**అటవీశాఖ ప్రత్యేక చర్యలు**




**అశ్వాపురం, (సింగిడి):** మణుగూరు డివిజన్ అశ్వాపురం రేంజ్ పరిధిలో ఎరవెండి సెక్షన్‌కు చెందిన తుమ్మలచెరువు బీట్‌లో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో సాసర్ పిట్‌లలో నీటిని నింపే కార్యక్రమాన్ని చేపట్టారు.వేసవి కాలం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అడవుల్లో సహజ జలవనరులు ఎండిపోతుండ టంతో జంతువులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అటవీశాఖ ముందస్తు చర్యగా సాసర్ పిట్‌లను ఏర్పాటు చేసి, వాటిలో నిరంతరంగా నీటిని నింపే కార్యక్రమాన్ని ప్రారంభించింది.ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారి రమేష్ ఆధ్వర్యంలో మొండికుంట గ్రామపంచాయతీ సిబ్బంది సమన్వయంతో నీటి సరఫరా ఏర్పాటు చేశారు. పిట్‌లలో నీరు అందుబాటులో ఉండేలా తరచుగా పర్యవేక్షణ నిర్వహించాలని, వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు కోరారు.వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా అడవుల్లో జీవవైవిధ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు.

## 365 ఫుడ్‌కోర్ట్ నూతన ప్రాజెక్ట్‌కి భూమిపూజ

**శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి పువ్వాడ..**



**పాలేరు,(తల్లంపాడు)(సింగిడి):** ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు నందు నూతనంగా ఎస్‌విఎస్ గ్రూప్ నిర్మిస్తున్న 365 ఫుడ్ కోర్టు నూతన ప్రాజెక్ట్‌కి బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చేతులమీదుగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమకు విచ్చేసిన ఖమ్మం రూరల్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ జె సి కృష్ణ మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ టేకులపల్లి మాజీ సొసైటీ అధ్యక్షుడు బీరెడ్డి నాగ చంద్రారెడ్డి కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి నాగండ్ల కోటేశ్వరరావు బిక్కసాని జస్వంత్ మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి పోట్ల శ్రీకాంత్ యూత్ అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్ మాటేటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో

# కేసు నమోదు

**కీసర మండల డివిజన్ అధ్యక్షుడు కోల బాలరాజు యాదవ్**



**కీసర, (సింగిడి):** కీసర సర్కిల్, కీసర మండల డివిజన్ అధ్యక్షుడు కోల బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఓటు బ్యాంక్ రాజకీయాలలో భాగంగా ముస్లిమ్ లను రెచ్చ గొడుతు భారతీయ జనతా పార్టీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నాయకులను కార్యకర్తలను చంపాలని, లేకుంటే మిమ్మల్ని కాపాడే వాడు ఎవ్వడులేడని, నాగుపాము నమాజ్ చేసే సమయంలో దగ్గరికి వస్తే చంపాలని అదీ ఖురాన్ లో రాసి ఉన్నదని, రెచ్చ గొట్టే మాటలు మాట్లాడినందుకు కీసర పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, నాగారం మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డి, జిల్లా సెక్రెటరీ బోడ శ్రీనివాసరావు, జిల్లా నాయకులు రాగుల అశోక్ ముదిరాజ్, మెట్టు కృష్ణ యాదవ్, కొలుకూరి నాగేష్, మండల ప్రధాన కార్యదర్శులు నల్ల వెంకటరెడ్డి, అబ్రబోయిన నాగరాజ్ ముదిరాజ్, గోసుల శ్రీనివాస్, నక్క కిషోర్, కోల మల్లేష్ యాదవ్, బర్లపాటి ఆంజనేయులు, కోల శ్రీనివాస్ యాదవ్, బత్తుల ఆంజనేయులు, దుర్గం వేణు యాదవ్, బత్తుల కుమార్ తదతరులు పాల్గొన్నారు.

## ఇంటిపన్నులో 5%రిబేట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్**



**జమ్మికుంట, (సింగిడి):** ఇంటి పన్ను వసూళ్లలో రాష్ట్ర ప్రభు త్వం 5% రిబేట్ ఏర్పాటు చేయగా మున్సిపల్ పరిధిలోని ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ వార్డులలో ఇంటి పన్ను వసూళ్లలో పాల్గొని ప్రజలకు ఇంటి పన్ను వసూళ్లలో 5% రిబేట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. అందులో భాగంగా జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి ముక్క జితేందర్ గుప్తా ఐదుశాతం రిబేట్‌తో రూ.69వేలను మున్సిపల్ అధికారులకు చెల్లించి పట్టణ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. ఆయన మాట్లా డుతూ, పట్టణం అభివృద్ధి చెందాలంటే ప్రజల సకాలంలో పన్నులు చెల్లించాలని రాష్ట్రప్రభుత్వం ముందస్తుగా పన్నులు చెల్లిస్తే 5శాతం రిబేట్ ప్రకటించడం అభినందనీయమని అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి పట్టణ ప్రణాళిక అధికారి శ్రీధర్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మానేరు రివర్‌ఫ్రంట్ పనులు వేగవంతం చేయాలి

**పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి నగరానికి కొత్త అందం తీసుకురావాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా**




**కరీంనగర్, (సింగిడి)::** కరీంనగర్ నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచే మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇరిగేషన్, పర్యాటక, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పనుల పురోగతిని సమీక్షించారు. పూర్తైన పనులు, పెండింగ్ పనుల స్థితి, అవసరమైన నిధులు, భూ సేకరణ పురోగతి వంటి అంశాలపై చర్చించారు.భూ సేకరణను త్వరగా పూర్తి చేసి, అందుబాటులో ఉన్న బడ్జెట్ ప్రకారం మిగిలిన పనులను చేపట్టాలని తెలిపారు. అందంగా తీర్చిదిద్దే పనులు, రైలింగ్, తోటల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే బైపాస్ రోడ్ నుండి రివర్ ఫ్రంట్ వరకు రహదారి కనెక్టివిటీ పనులను ప్రాధాన్యంగా తీసుకోవాలని పేర్కొన్నారు.ఇరిగేషన్, పర్యాటక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రాజెక్టును పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

**ఐపీఎస్ విద్యాసంస్థల అధినేతలు. మాటేటి కృష్ణప్రియ, సంజీవ్ కుమార్**

**ఐపీఎస్ లో ఫేర్వెల్ డే వేడుకలు**







**సుల్తానాబాద్, (సింగిడి)::** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగా లని ఐపిఎస్ అధినేతలు మాటేటి కృష్ణప్రియ, సం జీవ్ కుమార్ పిలుపునిచ్చారు.సుల్తానాబాద్ మం డల కేం ద్రంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో బుధవారం ఫేర్‌వెల్ డే వేడుకలను అత్యంత ఘ నంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ నిర్వహించినఈకార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా నృత్య ప్రదర్శ నలు, పాటలు, వినోదాత్మక కార్యక్ర మాలు హాజరైన వారిని అలరిం చాయి. విద్యార్థులు తమ పాఠశాల జీవితంలోని అనుభవాలను పంచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఐపీఎస్ అధినేతలు మాట్లా డుతూ,విద్యార్థు లు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించా రు.పాఠశాల అందించిన విలువలను ఎప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు.ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పదవ వార్డులో ముమ్మరంగా ప్రజా పాలన అభివృద్ధి పనులు

**మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత... ప్రజాపాలనతో సమస్యల పరిష్కారం**




**సుల్తానాబాద్, (సింగిడి):**పదవ వార్డులో పురవీధుల్లో ముమ్మరంగా అభివృ ద్ధి, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో సమస్యలు పరిష్కారం చేసుకోవడంతోపాటు, అభి వృద్ధి పనులు చేసుకోవడం జరుగుతుందని అన్నారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్ర భుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవా రం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. జూ నియర్ కళాశాలతో పాటు పలు వాడలో ప్రజా పా లన ప్రగతి ప్రణాళిక నిర్వహించారు, ఈ కార్యక్ర మంలో జిల్లా గ్రంధాల య చైర్మన్ అంతటి అ న్నయ్య గౌడ్, మున్సిపల్ కమిషనర్ రమేష్, ప లువురు కౌన్సిలర్లు, వాకర్స్, మునిసిపల్

## అభివృద్ధికి సహకరించాలని వినతి పత్రం



**మంథని (సింగిడి):** గ్రామ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ ఎర్రవెల్లి కృష్ణవేణి నరేష్ ఆర్జీ 1జీఎం లలిత్ కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. బుధవారం మంథని మండలం దుబ్బపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ఎర్రవెల్లి కృష్ణవేణి నరేష్, సీనియర్ నాయకులు కుడుదుల రవి, నరేష్‌రావులు ఆర్జీ 1 జీఎం లలిత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలవతో సన్మానించి సత్కరించారు. జీఎం నూతనంగా ఎన్నికైన సర్పంచు లను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు పలు విషయాలపైన చర్చించారు. దుబ్బపల్లి, చిల్లపల్లి గ్రామాలలో నిరుపేదలకు ఉపాధి హామీ పథకం లేనందున పేద ప్రజలు ఇబ్బంది పడుతున్న సందర్భంగా పేద ప్రజలకు ఉపాధి నిమిత్తం సింగరేణి ప్లాంటేషన్ లో ఉపాధి పని చూపించగలరని కోరారు. గ్రామంలో ప్లాస్టిక్ నిర్మూలించేందుకు సహకరించాలని తెలిపారు. గ్రామపంచాయతీ లో పలుఅభివృద్ధి పనులకునిధులు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగంలేని నిరుద్యోగులకు విటిసి ఇవ్వ డం కొరకు కృషి చేయాలని వారు తెలిపారు. గ్రామస్తులకు మినీ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసుకున్నందుకు సహకరించాలని తెలి పారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత అయిన మహిళలకు నూతనంగా జీవనోపాధి పొందేందుకు సహకరించాలని వారు జీఎం తో కలిసి చర్చించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను వంచిస్తోంది...

**దళిత బంధు సాధన నేతల ఆగ్రహం**



**మంథని, (సింగిడి):**ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైం దని, దళితులను బీసీలను మైనారిటీ వర్గాలను వంచిస్తోందని దళిత బంధు సాధన సమితి నాయకులు తీవ్రంగా విమర్శించారు. మంథని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత బంధు రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు గద్దల శంకర్, మంథని డివిజన్ దళిత బంధు సాధన సమితి అధ్యక్షులు ఊట్ల శ్రీను మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రకటించిన 'అంబేడ్కర్ అభయహస్తం' పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సంవత్సరాల కాలం గడిచినా ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని ఆరోపించారు. మంథని నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే అర్హులైన 132 కుటుంబాలకు దళిత బంధు నిధులు మంజూరైనా, వాటిని విడుదల చేయకుండా నిలిపివేశా రని నేతలు ఆరోపించారు. కలెక్టర్ ఖాతాలో పడిన నిధులను కూడా విడుదల చేయకుండా ఆలస్యం చేస్తున్నారని తక్షణమే ఆ నిధులను విడుదల చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో దళితులకు అండగా ఉంటామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించడం సరికాదని నేతలు హెచ్చరించారు. తక్షణమే దళిత బంధు, అభయహస్తం పథకాల నిధులను విడుదల చేసి, అర్హులైన కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.దళితులను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగిస్తున్నారని ఆరోపిస్తూ, సమస్యను వెంటనే పరిష్కరించకపోతే గ్రామ గ్రామాన ప్రజలను చైతన్య పరచి ప్రభుత్వంపై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నేతలు హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మంతెన లక్ష్మణ్, మంథని డివిజన్ దళిత సంఘం సీనియర్ నాయకులు,అవునూరి రాజలింగం కమాన్‌పూర్ మండల దళిత బంధు సాధన సమితి అధ్యక్షులు, మంత్రి రాజబాబు రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి తోటపల్లి రాజబాబు, దళిత బంధు మంథని డివిజన్ నాయకులు జూల రమేష్, మేకల వెంకటస్వామి, గువ్వల రాజు, జనగామ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాలు





**పెద్దపల్లి రూరల్ (సింగిడి):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా పి.సి.పి.యన్.డి.టి.అడ్వైజరి కమిటి సమావేశంను డా.కె.ప్రమోద్‌కుమార్, అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 33 స్కానింగ్ కేంద్రాలు రిజిస్ట్రేషన్ అయినయని పేర్కొన్నారు. వీటిలో ప్రతి నెల 5 నుండి10 కేంద్రాలను తనిఖీ చేస్తూ,అన్నీ కేంద్రాలు తనిఖీ అయ్యేలా చూస్తున్నాము అని అన్నారు.ఈనెల కూడా తనిఖీ నిర్వహించామన్నారు. గర్భస్థ శిశువు లింగనిర్ధారణ వ్యతిరేక చట్టం-1994 పి.సి.పి.ఎన్.డి.టి.ప్రకారం పుట్టబోయే బిడ్డ అడ,మగ అని చెప్పడంనేరం.లింగనిర్ధారణ చేసిన వారికి, చేయుమని అడిగినవారికి మూడు 3 సం,రాల జైలు శిక్ష, రూ.10,000ల జరిమానా విధించడం జరుగుతుందన్నారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం ను పకడ్బందిగా అమలు చేస్తున్నామని అన్నారు.ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో గర్భిణులకు చేసే స్కానింగ్ వివరాలను కూడా ఫారం ఎఫ్ నింపడం ద్వారా వారి వివరాలను పొందుపరిచాలని కమిటీ సభ్యులు అన్నారు.ఈ సమావేశంలో డా.వి వాణిశ్రీ ప్రోగ్రాం అధికారి,ఎం.ఎచ్.ఎన్ డా.బి శ్రీరాములు డిప్యూటీ డి.ఎం.ఎచ్.ఓ,డా.బి కిరణ్ ప్రోగ్రాం అధికారి,డా.యం.అనూష రెడ్డి,పిల్లల వైద్య నిపుణులు,శ్రీ కె.రాజగోపాల్,రెడ్ క్రాస్ సోసైటి,అధ్యక్షులు,స్వప్న జిల్లా సమైక్య అధ్యక్షురాలు,ఎస్.వెంకటేశ్వర్లు,జిల్లా మాస్ మీడియా ఉప అధికారి పాల్గొన్నారు.


## ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై సమావేశం




**కోదాడ,(సింగిడి):** కోదాడ ఆర్టీసీ డిపోలో ఎస్సీ, ఎస్టీ రీజియన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి డిపో కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నాయకులు సూచించారు. ఈ సందర్భంగా రీజియన్ నాయకులు కొర్ర లింగా నాయక్, డి.వి. రత్నం, కడియం రమేష్ మాట్లాడుతూ, ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని తెలిపారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం సాధించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిపో నాయకులు కె.వి. రత్నం, అంజలి, రామ్మూర్తి, రాంబాబు, జ్యోతి, సుధ, సంజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక చేయూత..

**అండగా నిలిచిన ఆటో యూనియన్**



**జమ్మికుంట (సింగిడి):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామానికిచెందిన నేరెళ్ళ రంజిత్ ఆకస్మికంగా మరణించడంతో వారి కుటుంబానికి అండగా ఉన్నామంటు కొత్తపల్లి ఆటోయూనియన్ ప్రెసిడెంట్ పసరగొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు మడిపల్లి కొత్తపల్లి శ్రీరాములపల్లి కనగర్తి గుండేడు ఆటో డ్రైవర్లు నేరెళ్ళ రంజిత్ కుమారుడుఅభిబార్య అనితని కలిసి 20.000 ఇరువదివేలరుపాయలు పోస్టుఆఫీసులోపిక్స్.డు డిపాజిట్. చేయించడం జరిగింది. ఈకార్యక్రమంలో ల్యాదల్ల మల్లేష్ దరుగుల కుమార్.సురేష్ శ్రీహరి శ్రీదర్ శ్రావన్ రాము బద్రి అనిల్ శ్రీనాద్ రాజు అబీబ్ ఆటో డ్రైవర్స్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## అమరచింతలో సిపిఐ 3వరోజు

# గడపగడపకు ప్రచారం



**అమరచింత, (సింగిడి):** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఏప్రిల్ ఒకటి నుండి పది వరకు గడపగడపకు సిపిఐ అనే కార్యక్రమాన్ని అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో పార్టీ నాయకులు గత మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. బుధవారం మున్సిపాలిటీ కేంద్రంలోని పలు వార్డులో గడపగడపకు సిపిఐ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సిపిఐ పార్టీ ప్రజల సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని కరపత్రాల ద్వారా ప్రచారం చేపట్టారు. అలాగే పార్టీ బలోపేతానికి సమస్యల పరిష్కారానికి విరాళాల సేకరణను చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి వి భాస్కర్, పట్టణ కార్యదర్శి రవీందర్, శ్యాంసుందర్ లక్ష్మీనారాయణ, సౌలు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లి వేడుకలు పాల్గొన్న జిల్లా గ్రంథాలయ చైర్మన్

**మహాదేవపూర్, (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్‌మండల కేంద్రంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాచకట్ల మురళి మనవరాలు పెళ్లివేడుకలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ కోట రాజబాపు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి లు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో వార్డు మెంబర్ అస్రార్, కాంగ్రెస్ నాయకుడు సమ్మయ్యలు పాల్గొన్నారు.

## దళితులకుఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం



**మిర్యాలగూడ (సింగిడి):** ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ ఆదేశానుసారం రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలకు వినతి పత్రం ఇచ్చే కార్యక్రమములో భాగంగా బుధవారం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కలిసి ఎమ్మార్పీఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షులు రామంజి సైదులు మాదిగ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నూకపంగు కాశయ్య మాదిగ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్చార్జ్ చీమలపాటి వెంకటయ్య జిల్లా నాయకులు పరంగీ రంజిత్ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు అందుగుల లక్ష్మణ్ కొండేటి మధు ఏర్పుల వెంకన్న ఎడ్ల నాగరాజు పాలడుగు క్రాంతి, వివిధ గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు

## అనంతగిరి ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడిగా సైదులు



**కోదాడ, (సింగిడి):**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గుండెపంగు రమేష్ ఆధ్వర్యంలో అనంతగిరి మండల కమిటీని బుధవారం ప్రకటించారు. ధారావత్ సైదులను అధ్యక్షుడిగా, రాజ్యంను ఉపాధ్యక్షురాలిగా, బచ్చల సుధాకర్‌ను ప్రధాన కార్యదర్శిగా నియమించారు.
ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమం, అమరుల కుటుంబాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏలేశ్వరావు, వెంకటేశ్వర్లు, నాగరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## 34వ డివిజన్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం




**మంచిర్యాల, (సింగిడి):** మంచిర్యాల కార్పొరేషన్ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మేయర్ మధుకర్ పేర్కొన్నారు. బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో స్పెషల్ డ్రైవ్ లో భాగంగా 34వ డివిజన్ లో పర్యటించారు. డివిజన్ లో సమస్యలను తెలుసు కొని పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. 34వ డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 34వ డివిజన్ కార్పొరేటర్ అగ్గు సాగర్, మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ ఆఫీసర్ ,అధికారులు,సిబ్బంది , స్థానిక ప్రజలు పాల్గొన్నారు



singidinews@gmail.com

సిన్మా సింగిడి
Cinma Singidi

శనివారం
22-8-2026

# నటి షావుకారు జానకి మృతి


## వయోసంబంధ అస్వస్థతో కన్నుమూత
## షావుకారు సినిమాతో పేరు స్థిరం

తెలుగు చిత్రపరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం ఆమె మృతి చెందారు. షావుకారు జానకి ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు ఆమెను చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 94 ఏళ్ల వయసులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆమె తుది శ్వాస విడిచారు. షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. షావుకారు జానకి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలనుంచి తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో.. అభిమానులు, స్నేహితులు, చిత్ర పరిశ్రమకు చెందిన వారు నివాళులు అర్పించటం కోసం ఉంచుతామని తెలిపారు. టేకుమళ్ల జానకి 1931 డిసెంబర్ 12వ తేదీన తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. విజయవారి 'షావుకారు' సినిమాతో 1950లో జానకి సినీరంగ ప్రవేశం చేశారు. మొదటి సినిమా పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్నారు. 'షావుకారు' జానకిగా పాపులర్ అయ్యారు. జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు 380 చిత్రాలలో నటించారు. ఆమె చివరగా 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే' సినిమాలో కనిపించారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కేవలం నాయికగానే కాకుండా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ వైవిధ్యం చాటుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కళారంగానికి ఆమె అందించిన అమూల్యమైన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022 సంవత్సరంలో దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' అవార్డుతో ఆమెను ఘనంగా సత్కరించింది. ఆమె మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.






'Sowcar' Janaki
(1931 – 2026)



# ఆదిత్యరాయ్ మూవీలో భాగ్యశ్రీభోర్సే

## వార్తలను తోసిపుచ్చిన టీ సీరిస్

టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ–సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ–సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన్', 'ఏక్ దివానే కీ దివానియత్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. 'యారియాన్ 2', 'చందు ఛాంపియన్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఆదిత్య రాయ్ కపూర్ సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి. భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది. తొలి సినిమాతోనే తన గ్లామర్‌తో పాటు నటన తోనూ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు ఆమె తలుపు తట్టాయి. దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కాంత' లోనూ భాగ్యశ్రీ నటించింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' చిత్రంలోనూ భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించింది. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ సరసన కమల్ హాసన్ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'సేయోన్' సినిమాలో నటిస్తోంది.



# హాయ్ చిత్రం ట్రైలర్ విడుదల

లేడీ సూపర్ స్టార్ నయనతార, టాలెంటెడ్ యంగ్ హీరో కవిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా మూవీ 'హాయ్'. ప్రముఖ గీత రచయిత విఘ్న ఎడవన్ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆగస్టు 28న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తమిళంతో పాటు తెలుగు ట్రైలర్‌ను వదిలింది. ఈ ట్రైలర్ ఫుల్ లవ్, ఫన్ మరియు ఎమోషన్స్‌తో ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ వివాహాల కోసం ప్రయత్నించి విఫలమయ్యే సామాన్యుడిగా కవిన్ ఇందులో కనిపించగా, ఆయనకు దేవసేన పాత్రలో నటిస్తున్న నయనతార ఎదురుకావడం జరుగుతుంది. సంప్రదాయాలకు భిన్నంగా ఉండే ఒక స్వతంత్ర భావాలున్న మహిళగా నయనతార లుక్ చాలా ఆకర్షణీయంగా ఉంది. అనుకోని పరిస్థితుల నేపథ్యంలో వీరిద్దరికీ పెళ్లి జరగడం, ఆ తర్వాత వారి మధ్య జరిగే మనస్పర్థలు, భావోద్వేగాలు ఈ సినిమా ప్రధాన కథాంశంగా ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. కవిన్, నయనతార ఆన్–స్క్రీన్ కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా ఉండి సినిమాపై అంచనాలను పెంచుతోంది.

ఇక ఈ చిత్రంలో నయనతార, కవిన్‌లతో పాటు కే. భాగ్యరాజ్, ప్రభు, రాధికా శరత్‌కుమార్ వంటి దిగ్గజ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు జెన్ మార్టిన్ సంగీతం అందిస్తుండగా, రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. జి స్టూడియోస్ సౌత్, రౌడీ పిక్చర్స్ మరియు సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090